అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 26-07-2024







బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి

సంపుటి : 10 సంచిక : 207 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



మన పద్దు రూ.2,91,159 కోట్లు

కాంగ్రెస్ హయాంలో ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్

అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క

- బడ్జెట్ కేటాయింపుల్లో మారిన ప్రాధాన్యాలు
- తొలిసారి సభకు హాజరైన ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌ను రూ.2,91,159 కోట్లుగా ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లు కాగా, పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయాన్ని రూ.35,208.44 కోట్లని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేకున్నా, కేంద్ర పన్నుల్లో వాటాగా రూ.26,216.28 కోట్లు వస్తుందనీ, గ్రాంట్ల రూపంలో 21,636.15 కోట్లు వస్తాయని అంచనా వేశారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర అవసరాల కోసం రూ.57,112 కోట్లు అప్పులు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర శాసనసభలో గురువారం ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2024-25 ఆర్థిక సంవత్సర పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. శాసనమండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుత ఏడాదిలో ఆర్థిక లోటును రూ.49,255.41 కోట్లుగా అంచనా వేశారు. దానిలో ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లుగా బడ్జెట్‌లో చూపారు. మొత్తంగా ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.297.42 కోట్లు ఆదాయ మిగులు ఉంటుందని లెక్కించారు.

పాత సర్కారుపై ఫైర్

ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ పదేండ్ల బీఆర్‌ఎస్ సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ ప్రారంభంలోనే పోరాడి, త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో గడచిన పదేండ్లలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా వెనుకబడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం నాటికి అప్పు రూ.75,577 కోట్లు ఉండగా, 2023 డిసెంబర్ నాటికి ఈ అప్పు రూ.6,71,757 కోట్లకు పెరిగిందని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల సమస్యలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని తెలిపారు. నిధుల వ్యయానికి రాష్ట్ర పురోగతికి ఏమాత్రం పొంతన లేదని విమర్శించారు.

కొత్త అప్పుల కంటే చెల్లించాల్సిన రుణాలే ఎక్కువ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.35,118 కోట్లు అప్పు చేసిందని ఆర్థికమంత్రి తెలిపారు. అయితే గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, వడ్డీలు కలిపి రూ.42,892 కోట్లు చెల్లింపులు చేశామని వివరించారు. అంటే తాము తీసుకున్న రుణాల కంటే రూ.7,774 కోట్లు అధికంగా పాత రుణాలు చెల్లించాల్సి వచ్చిందన్నారు.

తగ్గిన వృద్ధి రేటు

2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధి రేటు 7.6 శాతం ఉంటే, తెలంగాణ రాష్ట్ర వృద్ధి రేటు 7.4 శాతం మాత్రమే. పెరిగిన అప్పులు, ఖర్చుల వల్ల వృద్ధి రేటు తగ్గింది. దీన్ని గాడిలో పెట్టాలంటే కఠోర ఆర్థిక...15లో



అంతా గ్యాస్..ఒట్టి ట్రాష్..

అది బడ్జెట్ ప్రసంగం కాదు..పొలిటికల్ స్పీచ్

నిర్దిష్టంగా ఒక్క పాలసీ లేదు : రాష్ట్ర బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్

వివరాలు 15లో



తలసరి ఆదాయమే కాదు అప్పులూ పెరిగాయి

ఖర్చులు తగ్గించుకొని, ఆదాయం పెంచుకోవాలి

ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ స్థిరత్వం సాధించాలి : తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే-2024 నివేదిక వెల్లడి

వివరాలు 15లో



వారి బాటలోనే వీరు..

గత సర్కారు మాదిరిగానే భారీ అంచనాలు

వాస్తవాలకనుగుణంగా అంటూనే ఊహల్లో సర్కార్

ఆదాయ మార్గాలపై అస్పష్టత

అప్పులు, బకాయిలపై గందరగోళం

వివరాలు 8లో

8 **వాస్తవ పరిస్థితులకు బడ్జెట్ ప్రతిబింబం** — విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనివ్వాలి: అలుగుబెల్లి నర్సిరెడ్డి

8 **బీజేపీ చెబితేనే సభకు కేసీఆర్** — హడావుడిగా వచ్చి..అంతే హడావుడిగా వెళ్లారు : డిప్యూటీ సీఎం

8 **సంక్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజానుకూల బడ్జెట్** — సీపీఐ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మెల్యే కూనంనేని

శాఖల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో)	
వ్యవసాయం	72,659
ఉద్యానశాఖ	737
పశుసంవర్ధశాఖ	1,980
సబ్సిడీ గ్యాస్‌సిలిండర్ పథకం	723
గృహజ్యోతి	2,418
పౌరసరఫరాలు	3,836
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ	29,816
రీజినల్ రింగ్ రోడ్	1,525
స్త్రీ, శిశు సంక్షేమం	2,736
ఎస్సీ సంక్షేమం	33,124
ఎస్టీ సంక్షేమం	17,056
మైనార్టీ సంక్షేమం	3,003
బీసీ సంక్షేమం	9,200
వైద్యారోగ్య శాఖ	11,468
ఇంధనశాఖ (ట్రాన్స్‌కో, డిస్కంలు)	16,410
అడవులు, పర్యావరణ శాఖ	1,064
పరిశ్రమల శాఖ	2,762
ఐటీ	774
నీటిపారుదల శాఖ	22,301
విద్యాశాఖ	21,292
హెూంశాఖ	9,564
రోడ్లు, భవనాల శాఖ	5,790
జీహెచ్‌ఎంసీ	3,065
హెచ్‌ఎండీఏ	500
మెట్రో వాటర్ వర్క్స్	3,385
హైడ్రా	200
ఔటర్ రింగ్‌రోడ్	200
మెట్రోరైల్ విస్తరణ	1,100
ఎమ్ఎమ్‌టీఎస్	50
మూసీ రివర్ ఫ్రంట్	1,500

సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించాలి

కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సంక్షేమ రంగాల ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని తెలిపారు. గత పదేండ్లలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదని విమర్శించారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయట పడలేదని వివరించారు. అందువల్ల ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమాతోపాటు, వ్యవసాయ పరిశోధనలకు రూ.72,659 కోట్లు కేటాయించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యా, వైద్యానికి చేసిన కేటాయింపులు గతం కంటే పెరిగినా అది స్వల్పమేనని వివరించారు. రాష్ట్రంలో అక్షరాస్యత 66 శాతం దాటడం లేదని పేర్కొన్నారు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు ఆకర్షించబడుతున్నారని తెలిపారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, పల్లె దవాఖానాలకు, ప్రభుత్వ ఆస్పత్రులకు సరిపోవని పేర్కొన్నారు. విద్యా, వైద్య రంగాల్లో ప్రభుత్వాలు తగు శ్రద్ధ చూపకపోవడంవల్ల ప్రయివేటు రంగాలకు ఆకర్షించబడుతున్నారని తెలిపారు. ఈ రెండు రంగాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరముందని సూచించారు.

ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలివ్వాలి

రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ఆందోళన సాగుతున్నదని తమ్మినేని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు వేసుకున్నవారిని తొలగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రూ.ఐదు లక్షలు, దళితులకు రూ.ఆరు లక్షలు ఇస్తామన్నారని ...15లో



దేశంలో 49,342 ఎంఎస్‌ఎంఈలు మూత

3,17,641 మంది ఉద్యోగులపై ప్రభావం

లోక్‌సభలో కేంద్రమంత్రి జితిన్ రాం మాంఝీ సమాధానం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 49,342 ఎంఎస్‌ఎంఈలు మూతపడ్డాయని, 3,17,641 మంది ఉద్యోగాలు కోల్పోయారని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ రాం మాంఝీ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 జులై 22 నాటికి 49,342 ఎంఎస్‌ఎంఈలు మూతపడ్డాయని, 3,17,641 మంది ఉద్యోగాలు కోల్పోయారని పేర్కొన్నారు. తెలంగాణలో 1,236 ఎంఎస్‌ఎంఈలు మూతపడగా 17,899 మంది ఉద్యోగాలు కోల్పోయారని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 996 ఎంఎస్‌ఎంఈలు మూతపడగా 6,049 మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖలో 3,520 పోస్టులు ఖాళీ

పర్యాటక, సాంస్కృతిక శాఖలో 3,520 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రిత్వ శాఖలో గ్రూప్ ఏ 263 పోస్టులు, గ్రూప్ బి 577 పోస్టులు, గ్రూప్ సి 2,680 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

హైకోర్టుల్లో 357 జడ్జి పోస్టులు ఖాళీ

దేశంలోని హైకోర్టుల్లో 357 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన...15లో

అభూత కల్పన..అంకెల గారడీ : కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప ఏమీ లేదనీ, బడ్జెట్ అంతా అభూత కల్పన, అంకెల గారడీ, ఆర్భాటం, సంతుష్టీకరణ అన్నట్టుగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పంటపెట్టుబడి సాయానికి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఎక్కడా ఆసరా పింఛన్ల ప్రస్తావన లేదని విమర్శించారు. గత ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసి పోతే..ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు కోసం అప్పులమీద అప్పులు చేస్తున్నదని ఆరోపించారు. గత ప్రభుత్వం కంటే రూ.17 వేల కోట్ల ఎక్కువ అప్పు తెచ్చుకుంటామని చెప్పుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అమ్మాలని చూస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోబోరని హెచ్చరించారు. రాష్ట్రంలో విధ్వంసానికి గురైన విద్యావ్యవస్థకు 15 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఏడు శాతమే కేటాయించడమేంటని ప్రశ్నించారు. మహిళలు, దళితులు, యువతకు ఇలా...15లో

ఖనిజ హక్కులపై రాయల్టీ పన్ను విధించొచ్చు

రాష్ట్రాలకు భారీ ఊరట..సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ : మైనింగ్, ఖనిజ కార్యకలాపాలపై రాయల్టీ పన్ను విధించే హక్కు రాష్ట్రాలకు ఉన్నదని సుప్రీంకోర్టు గురువారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల విస్తృత ధర్మాసనంలో కేవలం జస్టిస్ బీవీ నాగరత్న మాత్రమే ఈ తీర్పుతో విభేదించారు. రాయల్టీ అనేది పన్ను వంటిది కాదని, రాయల్టీని విధించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. తద్వారా 1989లో ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. అది సరైన తీర్పు కాదని వ్యాఖ్యానించింది. ఖనిజ సంపద అధికంగా ఉన్న ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తీర్పు గొప్ప ...15లో

ఏజెన్సీకి మళ్లీ గోదావర్రీ

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ



50 అడుగులకు చేరిక

ముంపు ప్రజలను పునరావాసాలకు తరలించండి : కలెక్టర్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఏజెన్సీకి మరోసారి గోదావరి భయం మొదలైంది. బుధవారం వరకు శాంతించిన గోదావరి గురువారం ఉదయం నుంచి మరోసారి తన ప్రతాపాన్ని చూపింది. రెండు రోజుల వ్యవధిలోనే మరోసారి 50 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను జల వనరుల శాఖ అధికారులు జారీ చేశారు. దాంతో లోతట్టు ప్రాంత ప్రజల గుండెల్లో వరద భయం మరోసారి ...6లో

నితీశ్ యూటర్న్ వెనుక?

సన్నిహిత అధికారిపై ఈడీ దాడి.. బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిడులు

జైలు జీవితం తప్పదేమోనని వెంటాడిన భయం

అందుకే ప్రత్యేక హోదా డిమాండ్‌కు మంగళం

ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ ఆరోపణ



బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పించాలని, లేనిపక్షంలో నిరసనకు కూడా సిద్ధమేనని హుంకరించిన సీఎం నితీశ్ కుమార్ హఠాత్తుగా మెత్తబడిపోయారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీతో సంతోషపడిపోయారు. అదీకాక సన్నిహిత అధికారిపై ఈడీ దాడి చేయడం నితీశ్‌ను కలవరపరిచింది. తనను కూడా జైలుకు పంపుతారేమోనని ఆయన భయపడిపోయారు. చివరికి బీజేపీ నుంచి వచ్చిన ఒత్తిడులకు తలవంచి హోదా డిమాండ్‌ను పక్కనపెట్టి, ప్యాకేజీతో సరిపెట్టుకున్నారు.

పాట్నా : లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యుల బలం ఉంది. మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన 272 స్థానాల కంటే ఇది కేవలం 21 మాత్రమే అధికం. ఎన్డీఏలో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూకు 12, చంద్రబాబు నాయుడు...15లో

హైదరాబాద్‌లో స్కిన్, కాస్మెటాలజీ సెంటర్లపై దాడి

- ముగ్గురు నకిలీ వైద్యుల గుర్తింపు
- తెలంగాణ వైద్యమండలి చర్యలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న స్కిన్, లేజర్, కాస్మెటాలజీ సెంటర్లపై తెలంగాణ వైద్య మండలి గురువారం ఐదు బృందాలుగా ఏర్పడి ఏక కాలంలో దాడి చేసింది. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, మియాపూర్ ప్రాంతాల్లో మొత్తం 40 సెంటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ముగ్గురు నకిలీ వైద్యులను గుర్తించినట్టు టీజీఎంసీ చైర్మెన్ డా.మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు వారిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేయనున్నట్టు చెప్పారు. మరో 20 సెంటర్లలో చర్మ వ్యాధి నిపుణులు, ప్లాస్టిక్ సర్జన్స్ లేకుండా, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి లేకుండా లేజర్స్ వినియోగిస్తున్న వైద్యులకు, విద్యార్హత లేకుండా డెంటల్, ఆయుర్వేదిక్, హెూమియోపతి వైద్యం చేస్తున్న వారికి నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. వారిపై చర్యలకు కౌన్సిల్‌కు లేఖ రాయనున్నామని తెలిపారు.

ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం కాస్మెటాలజీ, లేజర్, పీఆర్‌పీ థెరపీ, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ లాంటి చికిత్సలు డెర్మటాలజీ, ప్లాస్టిక్ సర్జరీ వైద్య విద్య చదివిన డాక్టర్లు మాత్రమే నిర్వహించాలని వైస్ చైర్మెన్ డా జి.శ్రీనివాస్ అన్నారు. వేరే విద్య చదివి లేజర్ కాస్మెటాలజీ చికిత్స చేస్తున్న వారిపై ఎన్ఎంసీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మెన్ డా.నరేష్ కుమార్ మాట్లాడుతూ.. 70 శాతం అర్హత లేని నకిలీ వైద్యులు పట్టణ ప్రాంతాల్లోనే ఉంటూ ప్రజలను, ప్రభుత్వాలను పక్కతోవ పట్టించే మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. ఈ తనిఖీల్లో టీజీఎంసీ సభ్యులు డా.ఆనంద్, డా.విష్ణు, డా. ఇమ్రాన్ అలీ, డా.సన్నీ డేవిస్, సీ. ఓపీటీ మెంబర్స్ డా.విజయ్, డా.ఫణి, డా.రాజీవ్, చర్మ వైద్య నిపుణులు డా.మౌనిక పాల్గొన్నారు.

ఫారం నెం.యుఆర్‌సి-2

చట్టంలోని చాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నోటీసు ఇవ్వవలసిన ప్రకటన
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (రిజిష్టర్ చేయుటకు అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014 లోని రూల్ 4(1)నకు అనుగుణంగా)
స్వయం ఇన్ఫినిటీ ఎల్ఎల్‌పి

1. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, స్వయం ఇన్ఫినిటీ ఎల్ఎల్‌పి, ఏదైతే కంపెనీల చట్టం, 2013లోని చాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా రిజిస్టర్ కానున్నదో, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366 యొక్క సబ్-సెక్షన్ (2)నకు అనుగుణంగా అది రిజిస్ట్రార్ ఎట్ హైదరాబాద్ వద్ద దరఖాస్తు చేసి యున్నది.
2. కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు దిగువ విధంగా కలవు :
ఆహార ధాన్యాలు, తృణధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, శుద్ధిచేసిన ఆహారాలు, రెడీ-టు-ఈట్ మీల్స్, ఘన ఆహారాలు, క్యాన్డ్ ఫుడ్స్, పాల ఉత్పత్తులు, బేకరీ ఉత్పత్తులు, మిఠాయిలు, స్నాక్స్, పానీయాలు మరియు మానవుల లేదా జంతువుల వినియోగానికి సరిపడే ఏవైనా ఫుడ్ ఐటంలు మాత్రమే కాకుండా అన్ని రకాల ప్యాక్ చేయబడిన ఆహార ఉత్పత్తులతోపాటు దిగుమతులు, ఎగుమతులు, వాణిజ్యం, కొనుగోలు, అమ్మకం, పంపిణీ, మార్కెటింగ్, మరియు వ్యాపారాల నిర్వహణకు..
3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క ప్రతిని ఆఫీసు : డోర్ నెం.3-3-110/165/ఎ, ప్లీజెంట్ పార్క్, హైదర్‌గూడ, అత్తాపూర్, హైదరాబాద్, రాజేంద్రనగర్, తెలంగాణ, ఇండియా, 500048 వద్ద పరిశీలించుకోవచ్చును.
4) ఈ దరఖాస్తును వ్యతిరేకించదలచిన ఏ వ్యక్తి అయినా వ్రాతపూర్వకంగా వారి అభ్యంతరాలను కంపెనీకి దీని రిజిష్టర్డు ఆఫీసు వద్ద ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఇరవైఒక్క రోజుల్లోపు సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్(సిఆర్‌సి), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైయిర్స్(ఐఐసిఎ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్-5, ఐఎంటి మనేసర్, గుర్గామ్, హర్యానా-122050 వారికి వ్రాతపూర్వకంగా, దాంతోపాటు ఒక కాపీని కంపెనీకి దాని రిజిస్టర్డ్ ఆఫీసుకు పంపించవలెను.

తేది : 23 జూలై, 2024

దరఖాస్తుదారు పేరు
స్వయం ఇన్ఫినిటీ ఎల్ఎల్‌పి.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd
రిజిస్టర్డ్ ఆఫీస్: బసవన్నగుడి, బెంగళూరు-560004.
బ్రాంచ్ ఆఫీస్: # 1-7-96/2, 1వ అంతస్తు, మహేష్ నగర్, ఇసిఐఎల్ పోస్ట్, ఎ.ఎస్.రావ్‌నగర్, హైదరాబాద్-500062. టి.ఎస్. సెల్.నం.7625079248
E-mail: asraonagar@canfinhomes.com, CIN: L85110KA1987PLC008699

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు (రూల్ 8(1))

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకముదారు తేది: 10-05-2024తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము రుణగ్రహీత శ్రీ గిలకపల్లి భాస్కర్, తండ్రి: శ్రీ గిలకపల్లి శ్రీరాములు మరియు శ్రీ గిలకపల్లి శ్రీరాములు, తండ్రి శ్రీ గిలకపల్లి దానయ్య వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తం రూ.24,63,894/- (ఇరవై నాలుగు లక్షల అరవై మూడు వేల ఎనిమిది వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే) వసూలయ్యే తేది వరకు ఒప్పంద రేట్ల వంతున తదుపరి వడ్డీతో నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు రుణగ్రహీత రుణబకాయి తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడు సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ ఈ క్రింద తెలిపిన ఆస్తిని ఈ క్రింది సంతకముదారు 19 జూలై, 2024న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

సదరు చట్టములోని సెక్షన్ 13 ఉపసెక్షన్ (8)లోని నిబంధనల క్రింద మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల లభ్యతను పొందగలరని రుణగ్రహీతల అప్రమత్తతను ఆహ్వానిస్తున్నాము. కావున ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు, ఒక వేళ జరిపినట్లయితే సిఎఫ్‌హెచ్ఎల్ వారి చార్జీకి లోబడి రావలసిన బకాయి రూ.24,63,894/- (ఇరవై నాలుగు లక్షల అరవై మూడు వేల ఎనిమిది వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే) దానిపై వడ్డీ క్రింద వర్తించును.

స్థిరాస్తి వివరణ:

తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, నారపల్లి ఎస్ఆర్ఓ క్రింద, ఘట్‌కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటీ క్రింద పోచారం గ్రామం, శ్రీనివాస్ నగర్ కాలనీ వద్ద గల సర్వే నం.36 భాగంలోని ఓపెన్ ప్లాట్ నం.48 యొక్క విస్తీర్ణం 200 చ.గ.లు లేదా 167.2 చ.మీ.లు కలిగిన యావదాస్తి. భూమికి గల సరిహద్దులు: ఉత్తరం: 25' వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.73, తూర్పు: ప్లాట్ నం.49, పశ్చిమం: ప్లాట్ నం.47.

తేది: 25-07-2024, ప్రదేశము: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Canara Bank

కెనరా బ్యాంక్ Canara Bank
(A Government of India Undertaking)
ఉల్సూర్ బ్రాంచ్ (0791),
పిటి నెం.883, 18/10, కేంబ్రిడ్జ్ రోడ్డు, ఉల్సూర్, బెంగళూర్-560008. మొబైల్:9483530791
ఇమెయిల్: cb0791@canarabank.com

(స్థిరాస్తుల విక్రయం కోసం వేలం ద్వారా విక్రయ ప్రకటన)

విక్రయ ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది: 28-08-2024

[illegible]

(www.canarabank.com "E-Auction" [illegible]) cb0791@canarabank.com [illegible]

తేది:25-07-2024
ప్రదేశము:బెంగళూరు
సం/- అధీకృత అధికారి
కెనరా బ్యాంక్

1వ అదనపు జిల్లా జడ్జి, మెదక్ జిల్లా మెదక్ వద్ద కోర్టులో
ఓ.ఎస్.నెం. 37 ఆఫ్ 2022
(పాత ఓ.ఎస్. నెం. 20 ఆఫ్ 2013 సిద్దిపేట వద్ద)
మధ్య :
ఎం/ఎస్. ఆర్.కె. టౌన్‌షిప్ ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, దాని యొక్క చైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎం.ఎం. కొండయ్య చేత ప్రాతినిధ్యం వహించునది .... వాది
మరియు
దండు కిష్టయ్య & ఇతరులు ...... ప్రతివాదులు
వీరికి
1) శ్రీమతి దండు పెంటమ్మ, భర్త : కీ.శే.దండు కిష్టయ్య, వయసు : మేజర్, నివాసం : కల్లకల్ గ్రామం, తూప్రాన్ మండలం, మెదక్ జిల్లా. (డి.నెం.14)
2) శ్రీమతి సక్కుబాయి, భర్త : శ్రీరాములు & తండ్రి : కీ.శే. దండు కిష్టయ్య, వయసు : మేజర్, నివాసం : దబీల్‌పూర్ గ్రామం, మేడ్చల్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా. (డి.నెం.15)
3) శ్రీమతి బాలమణి, భర్త : మల్లేశ్ & తండ్రి : కీ.శే. దండు కిష్టయ్య, వయసు : మేజర్, నివాసం : కల్లకల్ గ్రామం, మనోహరాబాద్ మండలం, మెదక్ జిల్లా. (డి.నెం.16)
4) శ్రీమతి లక్ష్మీనర్సమ్మ, భర్త : కృష్ణ & తండ్రి : కీ.శే. దండు కిష్టయ్య, వయసు : మేజర్, నివాసం : కన్నాయిపల్లి గ్రామం, (డి.నెం. 17)
5) శ్రీమతి దనమ్మ, భర్త : అశోక్ & తండ్రి : కీ.శే. దండు కిష్టయ్య, వయసు : మేజర్, నివాసం : రావల్‌కోల్ గ్రామం, మేడ్చల్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా. (డి.నెం.18)

నిర్దిష్టమైన నిర్వహణ కొరకు పైన పేర్కొన్న ఓ.ఎస్.నెం. 37 ఆఫ్ 2022 న్యాయస్థానం వాదులు ఫైల్ చేశారు-షెడ్యూల్డ్ ఆస్తికి సంబంధించినది. పైన పేర్కొన్న 14 నుండి 18 వరకు పేర్లుగల వాదులైన మీ యొక్క హాజరీ మరియు ఏవైనా అభ్యంతరాల కొరకు 13-08-2024కు సూట్ వాయిదా పడినది. అందువల్ల ఆ రోజున ఉ.10:30 గం.కు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా గౌరవనీయ 1వ అదనపు జిల్లా జడ్జి మెదక్ జిల్లా మెదక్ వారి ముందు మీరు హాజరు కావడంలో విఫలం కావొద్దు. ఒకేళ, హాజరు కావడంలో విఫలమైతే, అర్హత మరియు చట్టం ప్రకారం ఆరోపణ ఈ విషయంపై నిర్ణయం చేయబడును.

// గౌరవనీయ కోర్టు ఆదేశం ద్వారా //
(శ్రీ. వి.ప్రతాప్‌రెడ్డి) న్యాయవాది,
ఇ.నెం. 1-13-4, చర్చి కాంపౌండ్ సమీపంలో, మెదక్.
ఫోన్ : 9440080865
Prathapreddy.advocate@gmail.com

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL)

తెలంగాణ ప్రభుత్వం
ఆపరేషన్ : సైబర్‌సిటీ సర్కిల్ టెండర్ ప్రకటన నెం. 03/24-25

అర్హత గల బిడ్డర్ల నుండి బిడ్స్ ఆహ్వానిస్తున్నాం :- 1) ఐఆర్ స్టోర్స్‌లో సామగ్రి లోడ్ & అన్-లోడ్ చేయడం 2) 11 కెవి లైన్స్‌ను విభజించడం & కొండాపూర్ డివిజన్‌లో ఓ.ఏస్. యాక్సెస్ మీటరింగ్ సిస్టమ్ కల్పించే పనులు 3) గచ్చిబౌలి డివిజన్‌లోని ఎం/ఎస్ జిల్లా మేనేజర్, టిఎస్ఆర్ఐడిసిఎల్ వరకు 3- ఫే4 కెడబ్ల్యూ సరఫరాను విస్తరించడం. 4) ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 11 కెవి లైన్స్ & ఎబిఎల్ పనులను ఇంటర్‌లింక్ చేయడం మరియు సిబిసి సర్కిల్‌లో ఇతర పనులు.తదుపరి వివరాల కొరకు దయచేసి www.tssouthernpower.com.gov.in & www.eauction.telangana.gov.in & eprocurement.telangana.gov.in చూడగలరు.

DIPR R.O.No.2124-PP/CL/ADVT/1/2024-25, Dt: 25-07-2024 సం/- ఎస్ఈ/ఓ/సైబర్‌సిటీ, [illegible]

తెలంగాణ ప్రభుత్వం
ఆసక్తి వ్యక్తీకరణ
జల్‌పల్లి పురపాలక సంఘం

ఆ.వ్య. నోటీసు నెం. ఇ1/జెఎల్‌పిఎం/కన్సల్టెన్సీ సర్వీసెస్/2024-25 తేది : 25-07-2024

"2024-25 ఏడాది కొరకు జల్‌పల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ్ కు మద్దతు మరియు పర్యవేక్షణ కొరకు కన్సల్టెన్సీ సర్వీసెస్ సమకూర్చుటకు" మున్సిపల్ కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ వారు వ్యక్తిగత కన్సల్టెంట్లు/ఏజెన్సీలు/ఫర్మ్‌ల నుండి కొటేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తిగల పార్టీల వారందరూ సెలవారీ రూపం ప్రాతిపదికన ఫైనాన్షియల్ కోటేషన్‌తోపాటు ప్రతిపాదనను చేతిద్వారా/పోస్టు ద్వారా 02-08-2024 సా.3.00 గం.వరకెల్లా లేదా ముందుగా జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి వద్ద సమర్పించాలి. **అర్హత ప్రమాణం:-**గడచిన 5 సంవత్సరాలలో ఏదైనా ప్రభుత్వ సంస్థ కోసం ఎస్‌డబ్ల్యూఎం డిపిఆర్/ఎస్‌డబ్ల్యూఎం అమలు పనులు/స్వచ్ఛ్ సర్వేక్షణ్ పని అనుభవం ఏజెన్సీ/ఫర్మ్‌కు తప్పకుండా ఉండాలి. తదుపరి వివరాల కొరకు మున్సిపల్ కమిషనర్‌ను కార్యాలయం పని గంటలలో మీరు సంప్రదించగలరు.

సం/- కమిషనర్,
జల్‌పల్లి మున్సిపాలిటీ.
DIPR R.O.No.2110-PP/CL/ADVT/1/2024-25, Dt: 25-07-2024

తెలంగాణ ప్రభుత్వము
శంషాబాద్ మున్సిపాలిటీ వారి కార్యాలయం, రంగారెడ్డి :: జిల్లా

ఎల్ఆర్. నెం. ఇ1/ఎస్ఎచ్‌బిఎం/128/2024 తేది : 25-07-2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

"ఆఫీసు ఫర్నీచర్ సరఫరా మరియు వ్యవస్థాపన, మరియు శంషాబాద్ మున్సిపాలిటీ వద్ద కాన్ఫరెన్స్ గది, చైర్మన్ చాంబర్ & కమిషనర్ చాంబర్ సుందరీకరణ" కొరకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నాం. కమిషనర్, శంషాబాద్ మున్సిపాలిటీ చేత 30-07-2024న సా. 01.30 గం. వరకు స్వీకరించబడును మరియు అదే రోజున టెండరర్ల లేదా వారి ప్రతినిధుల సమక్షంలో, కమిషనర్, శంషాబాద్ మున్సిపాలిటీవారి చేత సా. 01.45 గం.కు అవి తెరువబడును. **టెండర్ల పిలుపు యొక్క షెడ్యూల్ ఈ క్రింది విధంగా :** 1. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది : 25-07-2024న సా. 01.30 గం.కు 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్ల యొక్క సమర్పణ : 30-07-2024న సా. 01.30 గం.కు 3. టెండర్లు తెరువునది : 30-07-2024న సా. 01.45 గం.కు తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫామ్, అనగా., https://tender.telangana.gov.in చూడగలరు లేదా శంషాబాద్ మున్సిపాలిటీ ఆఫీసులో సంప్రదించగలరు. సంప్రదించుటకు : 7337323577/ 7337336191.

సం/- కమిషనర్,
శంషాబాద్ మున్సిపాలిటీ.
DIPR. R.O.No. 2116-PP/CL/ADVT/1/2024-25, Dt. 25-07-2024

TSIIC EMPLOYEES HOUSE BUILDING MUTUALLY AIDED CO-OPERATIVE SOCIETY LTD., HYDERABAD. TELANGANA STATE

Regd No TS/DCO/Hyd/MACS/2017/09 - Housing
Regd. Office H.No. 6-4-481/10/A/1, 1st Floor,Krishna Nagar Colony, Opp. Gandhi Hospital, Musheerabad, Hyderabad - 500 080.

ELECTION NOTICE

Detailed Programme Date :23-07-2024

DATE	TIME	PROGRAMME	PLACE/Address
13-08-2024	11.00 am to 3.00 pm	Issue of Nominations Forms for the post of 3 Board of directors.	H.No.6-4-481/10/A/1, 1st Floor, Krishna Nagar Colony, Opp. Gandhi Hospital, Musheerabad, Hyderabad-80
14-08-2024	11. am to 3.00 pm	Receipt of nomination forms for post of 3 board of Directors	-do-
16-08-2024	11.00 am to 3.00 pm	Scrutiny of Nominations	-do -
17-08-2024	11.00 am to 3.00 pm	Withdrawal of nominations	-do-
19-08-2024	After 5.00 pm	Publication of Final List of valid nominations and allotment of symbols	-do-
21-08-2024	10.00 am to 3.00 pm	Polling	-do-
21-08-2024	After 3.30 pm	Counting and declaration of results	-do-
21-08-2024	From 8.00 pm	Elections of Office Bearers	-do-

Sd/- Election Officer

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance
రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032,
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవల్-2) బిల్డింగ్ నెం.క్యూ2, అరం క్యూపార్క్స్, జెన్ 4/1, టిటిసి, థానే బేలాపూర్ రోడ్డు, ఘన్‌సోలి, నవి ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

ఏదైతే, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మార్పు చేసుకొని శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ లిమిటెడ్ అనునది శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనమైన, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయం పొందియున్నారు. మేము అనేక పర్యాయాలు ఆర్థిక సహాయంవారు పొందారని సూచించాము, రుణగ్రహీతలు/ హామీదారులు సదరు వాయిదా తేదీల ప్రకారం వడ్డీ& అసలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో డీఫాల్టిగావించబడినారు. అందుకుగాను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి కోరికపై రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీచేయబడిన మార్గదర్శకాలు/ ఆదేశాలతో అనుసరించి ఖాతా అనునది నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్‌సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ పేర్కొన్న సదరు తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేసి, SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద సదరు నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా చెల్లించు తేదీ వరకు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ။వాటితో నోటీసులో పేర్కొనబడిన మొత్తాలపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా దిగువ రుణగ్రహీతలు/హామీదారులు/ తాకట్టుదారును కోరబడినది. రుణగ్రహీతల వారి యొక్క గతంలో తెలిసిన చిరునామాలపై నోటీసులు జారీచేయబడినవి కాని అవివారికి బట్వాడా కానందున, దానికి సంబంధించి బహిరంగ ప్రకటన రూపేనా ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది. సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్(8) యొక్క నియామాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించగలరు.

రుణగ్రహీతల/ సహ-రుణగ్రహీతల/ హామీదారుల పేరు	
1) శేషాద్రి ముంతా, తండ్రి సారయ్య ముంతా, వయస్సు:33 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి,నివాసం: ఇ.నెం.1-7-1022/9/16, హరినగర్, వాటర్ ట్యాంక్ దగ్గర, రాంనగర్, ముషీరాబాద్,హైదరాబాద్-500020, బి/ఓ.: "మెసర్స్ ఫిట్ 365 (డ్రింక్ అండ్ ఫిట్నెస్ జిమ్)"ప్రొప్రైటర్, 2-1-565, 3వ అంతస్తు, వెర్టెక్స్ హెరాల్డ్, కొత్త నల్లకుంట, హైదరాబాద్, 8281818886, 2) పద్మ ముంతా, భర్త ముంతా సారయ్య, వయస్సు: 55 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇ.నెం.1-7-1022/9/16, హరినగర్, వాటర్‌ట్యాంక్ దగ్గర, రామ్ నగర్, ముషీరాబాద్, హైదరాబాద్-500020, 9966273764, 3)సారయ్య ముంత, తండ్రి బలయ్యముంతా, వయస్సు:66 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఇ.నెం.1-7-1022/9/16, హరినగర్, వాటర్‌ట్యాంక్ దగ్గర, రాంనగర్, ముషీరాబాద్, హైదరాబాద్-500020, 9866678886. 4) సాయి సందీప్ సాయి, తండ్రి సాయి శ్రీనివాస్, వయస్సు: 35 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఇ.నెం.1-8-141, బాగ్ లింగంపల్లి, ఇ.డబ్ల్యు. ఎస్ క్వార్టర్స్, హైదరాబాద్-500020, 9052255588 .....రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/చట్టబద్ధమైన వారసులు	ఎన్‌పిఏ తేది 08.10.2023 డిమాండ్ నోటీసు తేది 23.01.2024 బాకీపడిన మొత్తం Rs.3444031/- రుణ మొత్తం Rs.2000000/-

CHKDPTF2302060004- స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"ఎ": జమిస్తాన్‌పూర్, హైదరాబాద్, టి.ఎస్.లోని 350చ.అ.ల ప్లింత్ఏరియా కలిగిన 124 చ.గ.లు లేదా 103.76చ.మీ.ల పూర్తి విస్తీర్ణంలోని ఖాళీ స్థలంతో మున్సిపల్ నెం.1-7-1022/9/16 (పిటిఐన్ నెం.1090131639) కలిగిన ఆవరణ మొత్తం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి: తూర్పు వైపు: శ్రీమతి రాములమ్మ ప్లాట్, పశ్చిమం వైపు: శ్రీ కె. కృష్ణయ్య ప్లాట్, ఉత్తరం వైపు: నాలా మరియు రోడ్డు, దక్షిణం వైపు: పొరుగువారి ఇల్లు.

పై చెప్పిన ఇట్టి పరిస్థితుల్లో, ఇందుమూలంగా పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (వర్తించునట్లుగా)కు ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల్లోగా తదుపరి వడ్డీ& వర్తించబడు చార్జీలతోపాటు పై పేర్కొన్నట్లుగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది. విఫలం చెందినచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు దాని క్రింద వర్తించబడు రూల్స్ క్రింద రుణగ్రహీతలు & తాకట్టుదారులు యొక్క సెక్యూర్డ్ అసెట్స్ స్వాధీనంచేసుకొనుటతో సెక్యూర్డ్ అసెట్ పై ఈ ప్రకటన తేది యొక్క 60 రోజులు ముగిసిన తరువాత ఏదైతే తదుపరి చర్యలు తీసుకోబడుతాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, నోటీసు పై పేర్కొన్న అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల రూపేనా రుణగ్రహీత బదిలీ చేయలేరు.

తేది: 18-07-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance
రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032,
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవల్-2) బిల్డింగ్ నెం.క్యూ2, అరం క్యూపార్క్స్, జెన్ 4/1, టిటిసి, థానే బేలాపూర్ రోడ్డు, ఘన్‌సోలి, నవి ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

ఏదైతే, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మార్పు చేసుకొని శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ లిమిటెడ్ అనునది శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనమైన, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయం పొందియున్నారు. మేము అనేక పర్యాయాలు ఆర్థిక సహాయంవారు పొందారని సూచించాము, రుణగ్రహీతలు/ హామీదారులు సదరు వాయిదా తేదీల ప్రకారం వడ్డీ& అసలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో డీఫాల్టిగావించబడినారు. అందుకుగాను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి కోరికపై రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీచేయబడిన మార్గదర్శకాలు/ ఆదేశాలతో అనుసరించి ఖాతా అనునది నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్‌సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ పేర్కొన్న సదరు తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేసి, SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద సదరు నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా చెల్లించు తేదీ వరకు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ။వాటితో నోటీసులో పేర్కొనబడిన మొత్తాలపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా దిగువ రుణగ్రహీతలు/హామీదారులు/ తాకట్టుదారును కోరబడినది. రుణగ్రహీతల వారి యొక్క గతంలో తెలిసిన చిరునామాలపై నోటీసులు జారీచేయబడినవి కాని అవివారికి బట్వాడా కానందున, దానికి సంబంధించి బహిరంగ ప్రకటన రూపేనా ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది. సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్(8) యొక్క నియామాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించగలరు.

రుణగ్రహీతల/ సహ-రుణగ్రహీతల/ హామీదారుల పేరు	
1) శ్రీనివాస్ రెడ్డి తూంకుంట, తండ్రి మల్లా రెడ్డి, వయస్సు 51 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: చిరునామా 1: ఇ.నెం:13-78, ఎస్‌జికెఎస్ కాలనీ, ఆంధ్రాబ్యాంక్ వెనుక, మేడ్చల్, రంగారెడ్డి-501401, చిరునామా 2: ఇ.నెం.13-7/7, కిస్టాపూర్, మేడ్చల్, రంగారెడ్డి-501401, బి/ఓ: టి.ఎస్.రెడ్డి-రోడ్ & బిల్డింగ్ మెటీరియల్స్ సప్లయర్" యజమాని, సత్య సాయి పెట్రోల్ పంప్, మేడ్చల్, రంగారెడ్డి, 9848038772. 2) తూంకుంట పేరాజేశ్వరి, @అలియాస్ టి.రాజేశ్వరి, వయస్సు 48సం॥లు, వృత్తి:గృహిణి, నివాసం: చిరునామా1: ఇ.నెం:13-78, ఎస్‌జికెఎస్ కాలనీ, ఆంధ్రాబ్యాంక్ వెనుక, మేడ్చల్, రంగారెడ్డి-501401, చిరునామా 2: ఇ.నెం.13-7/7, కిస్టాపూర్, మేడ్చల్, రంగారెడ్డి-501401, 9505365684. 3) నద్ది సంజీవ రెడ్డి @అలియాస్ ఎస్ఎస్ రెడ్డి, తండ్రి పెంట రెడ్డి, వయస్సు 67 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఇ.నెం. 1-289/1, వినాయక్ నగర్ కాలనీ, రోడ్ నెం.1, మేడ్చల్, రంగారెడ్డి-501401, 9392066690. .....రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/చట్టబద్ధమైన వారసులు	ఎన్‌పిఏ తేది 31.03.2021 డిమాండ్ నోటీసు తేది 20.11.2023 బాకీపడిన మొత్తం Rs.5146185/- రుణ మొత్తం Rs.3200000/-

SHIVMTF1609290001-స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"ఎ": రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ ఉపజిల్లా, మేడ్చల్ గ్రామపంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, సర్వే నెం.80/1, 81 మరియు 86, ప్లాట్ నెం.82, సైట్ విస్తీర్ణం 222 చదరపు గజాల లేదా 185.59 చ.మీ.లు. దిగువ సరిహద్దులు: తూర్పు వైపు: ప్లాట్ నెం.88, పడమర: 25 అ.ల వెడల్పు రోడ్డు, ఉత్తరం వైపు: ప్లాట్ నెం.81, దక్షిణం వైపు: ప్లాట్ నెం.83.

పై చెప్పిన ఇట్టి పరిస్థితుల్లో, ఇందుమూలంగా పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (వర్తించునట్లుగా)కు ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల్లోగా తదుపరి వడ్డీ& వర్తించబడు చార్జీలతోపాటు పై పేర్కొన్నట్లుగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది. విఫలం చెందినచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు దాని క్రింద వర్తించబడు రూల్స్ క్రింద రుణగ్రహీతలు & తాకట్టుదారులు యొక్క సెక్యూర్డ్ అసెట్స్ స్వాధీనంచేసుకొనుటతో సెక్యూర్డ్ అసెట్ పై ఈ ప్రకటన తేది యొక్క 60 రోజులు ముగిసిన తరువాత ఏదైతే తదుపరి చర్యలు తీసుకోబడుతాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, నోటీసు పై పేర్కొన్న అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల రూపేనా రుణగ్రహీత బదిలీ చేయలేరు.

తేది: 18-07-2024, ప్రదేశం: మేడ్చల్ సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance
రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032,
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవల్-2) బిల్డింగ్ నెం.క్యూ2, అరం క్యూపార్క్స్, జెన్ 4/1, టిటిసి, థానే బేలాపూర్ రోడ్డు, ఘన్‌సోలి, నవి ముంబయి-400710.
డిమాండ్ నోటీసు

రుణగ్రహీతల/ సహ-రుణగ్రహీతల/ హామీదారుల పేరు	బాకీపడిన మొత్తం	ఎన్‌పిఏ తేది
1) సయ్యద్ అయూబ్, తండ్రి సయ్యద్ అబ్దుల్ గఫర్, చిరునామా-1: నివాసం:డోర్ నెం.1-4-387, బోలక్‌పూర్, ముషీరాబాద్, సికింద్రాబాద్-500020, చిరునామా-2: డోర్‌నెం.1-4-334, సిద్దిక్‌నగర్, బోలక్‌పూర్, ముషీరాబాద్, సికింద్రాబాద్-500020. 2) అబ్దుల్ మన్నాం, తండ్రి సత్తార్ అబ్దుల్, నివాసం:ఎఫ్-33, 2 సిటిసి కాలనీ, హఫీజ్‌గూడ, రంగారెడ్డి జిల్లా. .....రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/చట్టబద్ధమైన వారసులు	Rs.5601291/- రుణ మొత్తం Rs.2000000/-	14.12.2016 డిమాండ్ నోటీసు తేది 23.02.2024

SHIVMTF1303280001- స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"ఎ": బాబా నగర్, నాదారం గ్రామం, ఉప్పల్ మండలం, కాప్రా మునిసిపాలిటీ, రంగా రెడ్డి జిల్లా, ఉప్పల్ ఉప-జిల్లా పరిధిలోని 178 చ.గ.లు లేదా 148.8 చ.మీ.ల విస్తీర్ణంలోని సర్వే నెం.42లోని ప్లాట్ నెం.18 నార్తన్ పార్ట్‌పై పాత డోర్ నెం.6-32/18/1, న్యూ డోర్ నెం.4-6-32/18/1/ఎ కలిగిన ఇంటి మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి: తూర్పు వైపు: 25 అ.ల వెడల్పు రోడ్డు, పడమర వైపు: సర్వే నెం.38, ఉత్తరం వైపు: పార్క్, దక్షిణం వైపు: ప్లాట్ నెం.18 సదరన్ పార్ట్.

తేది: 18-07-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రుణగ్రహీతల/ సహ-రుణగ్రహీతల/ హామీదారుల పేరు	
1) మీర్జా ఫహీమ్ బేగ్, తండ్రి మిర్జా హైదర్ బేగ్ @ అలియాస్ మిర్జా హైదర్ బేగ్, వయస్సు: 43 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, చిరునామా1: నివాసం: ఇ.నెం.19-2-127/6, [illegible], ఫలక్నుమా, కాలాపత్తర్ పిఎస్ దగ్గర, హైదరాబాద్-500053, చిరునామా2:నెం.4-14-78 &4-14-79, ఎస్ఎస్ కాలనీ, హసన్ నగర్, అత్తాపూర్ గ్రామం,రాజేంద్రనగర్, చిరునామా3: 19-2-21/23/55/ఏ/30/11/ఏ, బషారత్ నగర్, కాలాపత్తర్, చార్మినార్, ఫలక్నుమా, హైదరాబాద్-500053, బి/ఓ.: "ఫహీమ్ ప్రింటర్స్" యొక్క ప్రొప్రైటర్, అదే నివాస చిరునామ 2) నబీహా ఫాతిమా, భర్త మీర్జా ఫహీమ్ బేగ్, వయస్సు: 41 సం॥లు, వృత్తి:గృహిణి, నివాసం: ఇ.నెం. 19-2-127/6, [illegible], ఫలక్నుమా, కాలాపత్తర్ పిఎస్ దగ్గర, హైదరాబాద్, 500053, చిరునామా 2: 19-2-21/23/55/ఏ/30/11/ఏ, బషరత్‌నగర్, కాలాపత్తర్,చార్మినార్, ఫలక్నుమా, హైదరాబాద్-500053, 9700777107, 3) ప్రదీప్ గుప్తిల, తండ్రి బాలకృష్ణజి, వయసు: 29 సం॥లు, వృత్తి: స్వయం ఉపాధి, నివాసం: ఇ.నెం.18-4-201, అలియాబాద్, ఫలక్నుమా, తారా స్కూల్ దగ్గర, చార్మినార్, హైదరాబాద్-500053, బి/ఓ.:"శ్రీసాయి హెయిర్ కట్టింగ్ సెలూన్" యొక్క యజమాని, అదే నివాసం చిరునామా, 99080 91331. .....రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/చట్టబద్ధమైన వారసులు	ఎన్‌పిఏ తేది 08.09.2023 డిమాండ్ నోటీసు తేది 23.01.2024 బాకీపడిన మొత్తం Rs.3164767/- రుణ మొత్తం Rs.2000000/-

HMYTHTF2211150003- స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"ఎ": "ఎస్ఎస్ కాలనీ, హసన్ నగర్", జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ గ్రామం, రంగా రెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని సర్వే నెం.296/ఏలోని 142.21చ.గ.లు లేదా 118.90చ.మీ.లకు సమానమైన విస్తీర్ణపు ప్లాట్‌నెం.9పైగల మున్సిపల్ నెం.లు4-14-78& 4-14-79 గల అస్తి [illegible] మొత్తం మరియు ఈ క్రింది విధంగా [illegible]

తేది: 18-07-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రుణగ్రహీతల/ సహ-రుణగ్రహీతల/ హామీదారుల పేరు	
1) బోధ జైపాల్ రెడ్డి, తండ్రి మల్లా రెడ్డి, వయస్సు: 47 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఇ.నెం.3-51, రావిర్యాల గ్రామం, మహేశ్వరం (మం), రంగారెడ్డి-501510, బి/ఓ: "వి బిల్డర్ ఇటుకల తయారీ" యజమాని, 2-72, (సర్వే నెం.89), రావిర్యాల్ గ్రామం, మహేశ్వరం (మం), రంగారెడ్డి, 9346789304. 2) రాణిరెడ్డి బోధ భర్త జైపాల్ రెడ్డి బోధ, వయసు:41 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం:ఇ.నెం.3-51, రవిర్యాల్(గ్రా), మహేశ్వరం(మం),రంగారెడ్డి (జిల్లా)-501510, 7093986929. 3) మంజులా బోధ @ అలియాస్ బోద మంజు: భర్త శ్రీనివాస్ రెడ్డి బోధ @అలియాస్ బోదా శ్రీనివాస్ రెడ్డి, వయస్సు: 37 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇ.నెం.3-51, రావిర్యాల్(గ్రా), మహేశ్వరం (మం), రంగారెడ్డి (జిల్లా)-501510, 9848798944, 4) బోధ శ్రీనివాస్ రెడ్డి @అలియాస్ బోద శ్రీనివాస్ రెడ్డి, తండ్రి బోద మల్లారెడ్డి, వయస్సు: 45 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: నెం: 3-51, రావిర్యాల్(గ్రా), మహేశ్వరం (మం), రంగారెడ్డి (జిల్లా)-501510, బి/ఓ.: మెసర్స్ శ్రీనివాస్ బ్రిక్స్ ఇండస్ట్రీ" ప్రొప్రైటర్, సర్వే నెం.108, రావిర్యాల్, మహేశ్వరం, రంగారెడ్డి, 7013347375. 5) పి.శివ శంకర్, తండ్రి పి. నర్సింహ, వయస్సు: 42 సం॥లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం:6-31, ప్లాట్ నెం:22, శోభా నగర్, రంగన్నగూడ, తుర్కాయంజల్, హైదరాబాద్-501510, బి/ఓ.: "మెసర్స్ శివ శంకర్ఎర్త్ మూవర్స్" యొక్క ప్రొప్రైటర్, అదే నివాస చిరునామా, 9652907946. .....రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/హామీదారులు/చట్టబద్ధమైన వారసులు	ఎన్‌పిఏ తేది 08.09.2023 డిమాండ్ నోటీసు తేది 23.01.2024 బాకీపడిన మొత్తం Rs.7844824/- రుణ మొత్తం Rs.7500000/-

DLSKNTF1905300010- స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"ఎ": (బోద మంజుల): తుక్కుగూడ గ్రామం మరియు గ్రామపంచాయత్, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లాలోని సర్వే నెం.లు 199& 200లోని 220చ.గ.ల విస్తీర్ణపు ఓపెన్ ప్లాట్ నెం.160గల అస్తి మొత్తం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి: తూర్పు వైపు: ప్లాట్ నెం.161, పడమర వైపు: ప్లాట్ నెం.159, ఉత్తరం వైపు: ప్లాట్ నెం.171, దక్షిణం వైపు: 40 -0 వెడల్పు రోడ్డు.

DLSKNTF1905300010-స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"బి":(బోద రాణి): రావిర్యాల్ గ్రామం మరియు గ్రామ పంచాయత్, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లాలోని 252చ.గ.ల విస్తీర్ణంతో ఇంటి నెం.2-2 (పాతది), (2-72/1 క్రొత్తది) మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి: తూర్పు వైపు: 12'-0'అ.ల వెడల్పు రోడ్ పడమర వైపు: సంధ రాములు & ఎన్.లింగం ఇల్లు, ఉత్తరం వైపు: బి. జైపాల్ రెడ్డి యొక్క ఓపెన్ ప్లాట్‌ని వెండర్స్ కొనుగోలు చేస్తున్నారు& తాళ్ల శ్రీను ఇల్లు, దక్షిణం వైపు: విలేజ్ మెయిన్ రోడ్ &బి.రాణి ఓపెన్ ప్లాట్

DLSKNTF1905300010 -స్థిరాస్తి యొక్క వివరణ-షెడ్యూల్-"సి":(బోద రాణి):రావిర్యాల్ గ్రామం మరియు గ్రామ పంచాయత్, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లాలోని 187చ.గ.ల విస్తీర్ణపు ఇంటి నెం.2-2 (పాతది), (2-72/1 క్రొత్తది) మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగాఉన్నాయి: తూర్పు వైపు: 12'0' వెడల్పు రోడ్డు, పడమర వైపు: బాబు రావు మరియు నర్సింహా ఇల్లు, ఉత్తరం వైపు: బాబురావు & నర్సింహదా చెలగోని స్వామి ఇల్లు, దక్షిణం వైపు: గ్రామ మెయిన్‌రోడ్.

తేది: 18-07-2024, ప్రదేశం: మహేశ్వరం సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



సాగునీటి రంగానికి కోత

రూ.7481.57 కోట్ల తగ్గింపు

నిర్మాణంలోని ఆరు ప్రాజెక్టులకు పచ్చజెండా

వచ్చే ఆర్థికంలో మరో ఆరు

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కీలకమైన సాగునీటి రంగానికి నిధుల కేటాయింపులు స్వల్పంగా తగ్గించింది. ఈ ఏడాది ఈ శాఖకు రూ.22,301 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. గత సంవత్సరం 2023-24లో 29,766.00 కోట్లను కేటాయించగా, ఈసారి రూ.7481.57 కోట్ల మేర కోతపెట్టింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 34 భారీ, 39 మధ్యతరహా మొత్తం 73 నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. వాటిలో భారీ ప్రాజెక్టులు 10, మధ్యతరహావి 32 మొత్తం 42 ప్రాజెక్టులను పూర్తిచేసినట్టు బడ్జెట్‌లో సర్కారు పేర్కొంది. ప్రస్తుతం భారీవి 24, మధ్య తరహావి ఏడు నిర్మాణంలో ఉన్నాయి.

కాళేశ్వరాన్ని పట్టించుకోని సర్కారు

గత ప్రభుత్వ అప్పులకే వడ్డీల చెల్లింపు

బీఆర్ఎస్ సర్కారు తొందరపాటు నిర్ణయాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం నిర్మాణంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు, డిజైన్లలో లోపాలు, నాణ్యతారహితంగా చేసిన నిర్మాణాలు ఆ ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయి. ఈ ప్రాజెక్టు గురించి చేసిన ఆర్భాట ప్రచారంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, అనతికాలంలోనే ఈ ప్రాజెక్టు డొల్లతనం బయటపడింది. అందులో జరిగిన అవకతవకలను గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు పలు విచారణ కమిటీలను ఈ ప్రభుత్వం నియమించింది. కాగా న్యాయ విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోనుంది. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే ఖర్చుపెట్టిన వేల కోట్ల ప్రజాధనం వృధా కాకుండా జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకు తాత్కాలిక మరమ్మతులు చేయించిన సంగతి తెలిసిందే. శాశ్వత మరమ్మతులు చేసేందుకుగాను ఎన్‌డీఎస్ఏతో చర్చలు జరుగుతున్నాయి. తాజా బడ్జెట్ స్వల్పంగా నిధులిస్తే పూర్తయ్యే ప్రాజెక్టులు ఆరు వరకు ఉన్న సంగతి తెలిసిందే. వాటికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో ఆరింటికి ఇవ్వనుంది. భారీ, మధ్యతరహా, చిన్న ప్రాజెక్టుల నిర్వహణ గత పదేండ్లుగా జరగకపోవడంతో ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు.

కాళేశ్వరానికి రూ. లక్ష కోట్లు ఖర్చు

కాళేశ్వరానికి ఇప్పటివరకు రూ. లక్ష కోట్లు ఖర్చుపెట్టినట్టు కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక స్పష్టం చేసింది. ఇంకా రూ. 42 కోట్లు కేటాయిస్తేనే మిగతా పనులు పూర్తవుతాయని సమాచారం. కాగా 2019లో కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలతో దాదాపు లక్ష కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది. డీపీఆర్ దగ్గర నుంచి నిర్మాణాల వరకు అవినీతి అవకతవకల అంతుతేల్చేందుకు జస్టిస్ పీసీ ఘోష్ న్యాయవిచారణ కమిషన్ పనిచేస్తున్నది. ఇప్పటికే అవినీతి, అవకతవకలు జరిగాయంటూ విజిలెన్స్ కమిషన్ నివేదిక సైతం ఇచ్చింది. ఎన్‌డీఎస్ఏ సైతం ఇప్పటికే ప్రాథమిక, మధ్యంతర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించింది.

పూర్తి బడ్జెట్ ఇచ్చారు
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బడ్జెట్ సాగునీటిరంగానికి తగిన ప్రాధాన్యత ఇచ్చింది. ఎలాంటి తగ్గింపులు లేవు. కేటాయించిన నిధులతో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా వచ్చేఏడాదిలో 12 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ప్రాజెక్టు నిర్వహణను ప్రొటోకాల్ ప్రకారం చేపడుతాం.



సాగునీటి రంగానికి గత ప్రభుత్వం కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా అప్పులు తెచ్చిన నేపథ్యంలో ప్రతియేటా రూ. 18 వేల కోట్ల మేర వడ్డీలకే

వడ్డీలకే రూ.18 వేల కోట్లు

ఖర్చవుతున్నది. తాజా బడ్జెట్‌లో కేటాయించిన రూ.22,301 కోట్లల్లో రూ. 18 వేల కోట్లు వడ్డీలకు పోతే మిగిలిన రూ.4301 కోట్లతో సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎలా చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మళ్లీ అప్పులు చేయకతప్పదని సంబంధిత సాగునీటి శాఖ అధికారయంత్రాంగం చెబుతున్నది.

సాగునీటి రంగం (రూ.కోట్లలో)

ప్రాజెక్టులు	2021-22	2022-23	2023-24 (ఆర్.ఈ)	2024-25 (బీ.ఈ)
భారీ, మధ్య	14,342.16	18,622.04	29,438.52	21,081.82
చిన్న	1,410.55	708.87	308.17	892.39
సీఏడీ	12.61	16.22	18.23	28.59
వరద నిర్వహణ	5.34	2.11	1.67	282.24
మొత్తం	15,770.65	19,349.24	29,766.60	22,285.03





పారిశ్రామిక రంగానికి భారీ కోత

రూ. 2762 కోట్లు కేటాయింపు

గతేడాది కంటే తగ్గిన రూ.1,262 కోట్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వాణిజ్య, పరిశ్రమల రంగానికి బడ్జెట్లో భారీ కోత పడింది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో ఈ రంగానికి రూ. 2762 కోట్లు కేటాయించింది. గతేడాది (2024-25) రూ.4,037 కోట్లు కేటాయించగా, ఈ యేడు రూ.1,262 కోట్లు తగ్గాయి. గతేడాది కేటాయింపుల్లో రూ.567 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ సారి కేటాయింపుల్లోనే భారీ కోత విధించారనీ, ఇక ఖర్చు ఏ మేరకు చేస్తారో చూడాలని పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎమ్ఎస్ఎమ్ఈ) పరిశ్రమలకు ఈ సారి బడ్జెట్లో వరాల జల్లు కురిపిస్తారని భావించిన వారికి నిరాశే ఎదురైంది.

గత ఆరేండ్లుగా రాయితీలు అందక ఈ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2017 నుంచి వివిధ సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4 వేల కోట్లకు చేరుకున్నాయి. ఆరంభంలో అనుమతుల మంజూరు, వసతుల కల్పనలో వేగంగా స్పందించిన గత సర్కార్ ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఐదేండ్లలో దాదాపు 10 వేలకుపైగా పరిశ్రమలు మూతపడ్డాయి. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల వేలాది మంది చిన్న పరిశ్రమల యజమానులు రోడ్డున పడ్డారు. లక్షలాదిమంది ప్రజలు ఉపాధి కోల్పోయారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్లో సైతం ఈ రంగానికి నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వలేదు. అయితే మూతపడ్డ నిజాం షుగర్స్ లిమిటెడ్‌ను త్వరలో పునరుద్ధరిస్తామనీ, చేనేత రంగానికి అన్ని రకాలుగా చేయూత అందిస్తామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నోరెత్తని కేసీఆర్ : సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణకు ద్రోహం చేసిన కేంద్ర బడ్జెట్‌పై కనీసం స్పందించని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కే.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) కౌంటర్ ఇచ్చారు. గురువారం అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసేత కేసీఆర్ సభకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని ఆయన రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. బీజేపీ మెప్పు కోసమే రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శిస్తున్నారనీ, ఆరు నెలల తర్వాత అసెంబ్లీ సమావేశాలకు ఆయన రావడమే అందుకు నిదర్శనమని చెప్పారు. లోక్ సభ ఎన్నికల సమయం నుంచి బీజేపీతో అవగాహన కుదుర్చుకున్న కేసీఆర్ అసలు స్వరూపం త్వరలోనే బయట పడుతుందన్నారు.

కల్లుగీత కార్మికులకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలి : కేజీకేఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి కేవలం రూ.68 కోట్లు, నీరాకు రూ.25 కోట్లు మాత్రమే కేటాయించారనీ, వాటికి మరిన్ని కేటాయింపులు చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లం కొండ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కాటమయ్య రక్షణ కవచం ఆవిష్కరణ సభలో గీత కార్మికులందరికీ ఉచితంగా సేఫ్టీ మోకులు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. 2 లక్షలా 50 వేల మంది సభ్యత్వం కలిగి ఉన్న వారిలో లక్ష మందికి ఇచ్చినా రూ. 90 కోట్లు అవసరం పడతాయని తెలిపారు. నెక్లెస్ రోడ్‌లో ఉన్న నీరా కేఫ్‌కు అనుబంధంగా జిల్లాల్లో ఏర్పాటు చేసిన మిషనరీకి, దీనిని అన్ని జిల్లాలకు విస్తరించడానికి కనీసం రూ. 100 కోట్ల బడ్జెట్ కావాలని తెలిపారు. రుణాలు తదితర సంక్షేమం కోసం తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునరాలోచించి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. చెట్ల పెంపకానికి భూమి, కల్లుకు మార్కెట్, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు రూ.5000 కోట్లు కేటాయించాలని గత అనేక సంవత్సరాలుగా కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయని గుర్తు చేశారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 కోట్లైనా కేటాయిస్తుందని ఆశతో ఎదురు చూశామని తెలిపారు. కానీ నిరాశే మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళా సంఘాల సభ్యులకు రూ.10 లక్షల బీమా

రాష్ట్ర సర్కారు తీపి కబురు

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.29,816 కోట్లు
- చేయూత పింఛన్ల కోసం రూ. 14,628 కోట్లు
- ఆ శాఖకు గతేడు అదే బడ్జెట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర బడ్జెట్ తీపి కబురు అందించింది. ఇందిరా జీవిత బీమా పథకం కింద రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీల్లోని 63.86 లక్షల మంది మహిళా సభ్యులకు రూ. 10 లక్షల జీవిత బీమా చేస్తూ రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రుణ బీమా పథకానికి రూ.50.41 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద సంఘంలోని ఎవరైనా సభ్యులు చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రుణం మాఫీ అవుతుంది. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేలా సర్కారు ముందుకెళ్లబోతున్నట్టు బడ్జెట్ ద్వారా కనిపించింది. ప్రస్తుత బడ్జెట్ ప్రతిపాదనల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ. 29, 816 కోట్లను రాష్ట్ర సర్కారు కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయం, ఎస్సీ సంక్షేమ శాఖల



తర్వాత ఈ శాఖకే అత్యధికంగా నిధుల కేటాయింపు జరిగింది. అందులో వడ్డీలేని రుణాల కోసం 1302.15 కోట్లు కేటాయించబడ్డాయి. చేయూత పింఛన్ల కోసం రూ.14,628.91 ప్రతిపాదించారు. 2023-23 బడ్జెట్ ఎస్టిమేషన్‌లో ఈ శాఖకు రూ.30,976 కోట్లు ప్రతిపాదించగా వాస్తవానికి రూ.23,997 కోట్లను మాత్రమే ఖర్చుచేసింది. గతేడాది కంటే ప్రతిపాదనల్లో వెయ్యి కోట్లకుపైగా తక్కువ చూపింది. హామీలు పెద్ద ఎత్తున ఉన్న నేపథ్యంలో వాస్తవికంగా ఎంత ఖర్చు చేస్తుందనేది ముున్ముందు చూడాలి.



బడ్జెట్లో ఐటీకీ పెద్దపీట

గతేడాది కంటే పెరిగిన రూ. 308కోట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రూ.774 కోట్లు కేటాయింపు

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఈ సారీ బడ్జెట్లో పెద్దపీట వేశారు. గతేడాదికంటే రెండింతలు నిధులు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో రూ. 774 కోట్లు కేటాయించింది. గతేడాది (2024-25) ఈ రంగానికి రూ.366 కోట్లు కేటాయించగా, ఈ సారీ రూ.308 కోట్లు పెరిగాయి. అయితే గతేడాది కేటాయింపుల్లో రూ.194 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ సారీ కేటాయింపుల్లోనే భారీగా నిధులు పెంచారనీ, ఖర్చు ఏమేరకు చేస్తారో చూడాలని ఐటీ వర్గాలంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ)పై ప్రత్యేక దృష్టి పెట్టింది. హైదరాబాద్‌ను ఈ రంగంలో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కొత్తగా ఫైబర్ గ్రిడ్ అందుబాటులోకి తేవడం, సాంకేతికతను పల్లె గడపలకు అందించడానికి సర్కార్ ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు సమాచారం.

విద్యకు కేటాయింపులు సరిపోవు

అంగన్‌వాడీల్లో మూడో తరగతి వరకు బోధనతో పెద్దదెబ్బ • ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతేడాది రూ.2,90,000 కోట్ల బడ్జెట్‌లో విద్యకు 19,093 (6.58 శాతం) కోట్లు కేటాయించారనీ, ప్రస్తుత (2024-25) రూ.2,91,000 కోట్ల బడ్జెట్‌లో రూ.21,292 (7.31 శాతం) కోట్లు కేటాయించారని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. బడ్జెట్‌లో విద్యకు గతేడాది కంటే రూ.2,200 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ అవి సరిపోవని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న 15 శాతంలో సగానికి మించలేదని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఈ కేటాయింపు ఏ మాత్రం సరిపోవనీ, పున:సమీక్షించి విద్యకు బడ్జెట్ పెంచాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కోరారు. పలు పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వివరించారు. నూతన భవనాలను నిర్మించాలని తెలిపారు. టాయిలెట్లు, త్రాగునీటి వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించటానికి నిధులు కేటాయించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ పాఠశాల్లో సర్వీసు పర్సన్ల నియామకం, ఉచిత విద్యుత్ అమలు ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవటం విచారకరమని పేర్కొన్నారు. అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు మూడో తరగతి వరకు ప్రాథమిక విద్యను విలీనం చేయాలని నిర్ణయించటం ప్రభుత్వ విద్యారంగానికి పెద్ద దెబ్బ అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా గుర్తించడం లేదనీ, ప్రాథమిక తరగతులను అంగన్‌వాడీల్లో విలీనం చేయటం వల్ల పలు ప్రాథమిక పాఠశాలలు మూతబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో సంస్కరణలు చేసేముందు క్షేత్రస్థాయిలో ప్రధాన భాగస్వాములైన తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి వారు సూచించారు.

గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తున్న కాంగ్రెస్ : టీపీటీఎఫ్

విద్యారంగం బడ్జెట్ కేటాయింపులను గమనిస్తే గత ప్రభుత్వ విధానాన్నే కాంగ్రెస్ పాటిస్తున్నట్టుగా ఉందని టీపీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి విమర్శించారు. గతేడాది 6.56 శాతం నిధులు కేటాయిస్తే, ప్రస్తుతం 7.31 శాతం నిధులను విద్యకు కేటాయించిందని తెలిపారు. విశ్వవిద్యాలయాలకు గత ప్రభుత్వం మాదిరిగానే రూ.500 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. విద్యారంగంలో వినూత్న మార్పులు తెస్తామనీ, అంతర్జాతీయ పాఠశాలలను ప్రారంభిస్తామనీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నెలకొల్పుతామంటూ చెప్పినా అందుకు తగిన కేటాయింపులు చేయలేదని తెలిపారు. విద్యను ప్రయివేటుపరం చేస్తారనే అభిప్రాయానికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అరకొర నిధులతో అందరికీ ప్రమాణాలతో కూడిన విద్య అందని ద్రాక్షగా మారుతుందని వివరించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా 15 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యా ప్రాధాన్యతను విస్మరించిన ప్రభుత్వం : డీటీఎఫ్

విద్యారంగ ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని డీటీఎఫ్ అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 7.31 శాతం నిధులను కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. తగిన నిధులు కేటాయించకుండా నాణ్యమైన, సమానమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

విద్యకు కేటాయింపులు పెంచాలి : టీఆర్టీఎఫ్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు రూ.21,292 కోట్లు కేటాయించారని టీఆర్టీఎఫ్ అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి తెలిపారు. విద్యకు కేటాయింపులు పెంచాలనీ, మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 15 శాతం నిధులు కేటాయిస్తే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దు దిశగా అడుగులు వేయాలి : టీఎస్‌సీపీఎస్ఈయూ

నైపుణ్య కేంద్రాల ఏర్పాటు, ప్రపంచ స్థాయి పాఠశాలల స్థాయికి తీర్చిదిద్దుతా మంటూ ప్రభుత్వం ప్రకటించడం పట్ల టీఎస్‌సీపీఎస్ఈయూ ఉపాధ్యక్షులు మ్యాన పవన్ హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు దిశగా అడుగులు వేయాలనీ, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

విద్యాభివృద్ధిపై ఆశలు పెంచిన బడ్జెట్ : టీఎస్‌పీటీఏ

విద్యారంగానికి గత ప్రభుత్వం కంటే ఎక్కువ నిధులు కేటాయించడంతో విద్యాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలు పెంచిందని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ తెలిపారు. ప్రస్తుతం 7.31 శాతం నిధులను కేటాయించిందనీ, వచ్చే బడ్జెట్ నాటికి 20 శాతం నిధులు కేటాయించాలని సూచించారు.



విద్యారంగానికి తీవ్ర అన్యాయం

గత ప్రభుత్వ ఆనవాయితీ కొనసాగింపు

- ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలపై స్పష్టత కరువు
- నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.31 శాతం కేటాయించిందనీ, గత ప్రభుత్వ ఆనవాయితీని కొనసాగించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది గత ఓటాన్ అకౌంట్‌లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ అని పేర్కొన్నారు. ఇంత తక్కువ నిధులతో ప్రభుత్వ విద్య ఏ మాత్రం అభివృద్ధి కాదని తెలిపారు. రూ.500 కోట్లతో విశ్వవిద్యాలయాలు అభివృద్ధి ఎలా అవుతాయని ప్రశ్నించారు. పాఠశాల విద్యారంగంలో ఖాళీల భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, గ్రంథాలయాలు, మూత్రశాలలు, మౌలిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని తెలిపారు. గురుకులాల నిర్మాణం కోసం కూడా కనీస నిధుల్లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో 800పైగా గురుకులాలకు స్వంత భవనాల్లేవని వివరించారు. వాటిలో సరైన మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ బడ్జెట్‌లో గత ఆరేండ్ల నుంచి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.ఏడు వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించలేదని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నా నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌ను సవరించి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కేటాయింపులకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్టు వారు పిలుపునిచ్చారు.

విద్యకు అధిక నిధులు కేటాయించాలి : ఏఐఎస్ఎఫ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ప్రజాప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధికి నోచుకోదా?అని ప్రశ్నించారు. విద్యా బడ్జెట్‌ను సవరించాలనీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ

ఆత్మవిశ్వాసం, ఆత్మజ్ఞానం, ఆత్మ నిగ్రహం ఈ మూడు గుణాలు మనిషి జీవితాన్ని ఎంతో శక్తివంతంగా చేస్తాయి - టెనిసన్

శుక్రవారం 26 జూలై 2024
www.navatelangana.com

కేటాయింపులు సరే..!

సంపాదకీయం

ఆరునెలలు సాము చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ గురువారం నాడు సమర్పించిన బడ్జెట్ తీరు చూస్తే అమలు మీద ఎవరికైనా సందేహం కలుగుతుంది.గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన జిమ్మిక్కుల కొనసాగింపుగానే కనిపిస్తున్నది. మార్చినెలతో ముగిసిన సంవత్సర బడ్జెట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.రెండు లక్షల 90వేల కోట్లతో ప్రవేశపెట్టింది.ఇప్పుడు రేవంత్‌రెడ్డి మరోవెయ్యి కోట్లు ఎక్కువ చేసి ప్రతిపాదించారు.బీఆర్ఎస్ బడ్జెట్‌లో 64వేల కోట్ల మేరకు కోత పెట్టి రెండు లక్షల 26వేల కోట్లకు సవరించారు. గతేడాది రాబడి రెండులక్షల 16వేల కోట్లని అంచనా వేస్తే, వచ్చింది 1.69లక్షల కోట్లే అయినా కాంగ్రెస్ సర్కార్ 2.21లక్షల కోట్లు రాబడతామని పేర్కొన్నది. అందుకే ఇది వాస్తవాల ప్రాతిపదికన లేదని చెప్పాల్సి వస్తోంది.

> గత ప్రభుత్వం భారీ మొత్తంలో అప్పులు చేసిన మాట వాస్తవం. ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నది. ఈ ఏడాది 62వేల కోట్ల మేర రుణాలు తీసుకోనున్నట్లు ప్రతిపాదించారు. ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలకు లోబడి తీసుకున్న రుణాలు మార్చి నెలాఖరుకు 4.02లక్షల కోట్లుంటే వచ్చే మార్చి ఆఖరుకు 4.51లక్షల కోట్లకు చేరతాయని అంచనా వేశారు. 'లంకెబిందెలు ఉన్నాయనుకొని చూస్తే అలాంటివేమీ లేవని' వ్యాఖ్యానించిన రేవంత్‌రెడ్డి దగ్గర అల్లావుద్దీన్ అద్భుత దీపం లేదని తేలింది.


అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాల అమలుకు నిధులెక్కడి నుంచి తెస్తారన్నపుడు 'మా ఆలోచనలు మాకున్నాయి, చూస్తారుగా, మనసుంటే మార్గం ఉంటుంది' అంటూ దాటవేశారు. వాటి సంగతేమోగానీ ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క చెప్పినదాని ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 35,118 కోట్ల రుణాలు తెచ్చి గత ప్రభుత్వం చేసినదానికి గాను 42,892 కోట్ల అప్పుతీర్చారు. పరిస్థితి ఈ విధంగా ఉన్నపుడు చేసిన వాగ్దానాలను ఎలా అమలు జరుపుతారన్నదే ప్రశ్న. ఇక ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతుల రుణాల రద్దుకు చేసిన కసరత్తును చూస్తే మిగతా చోట్ల కోతలు పెట్టి దానికి కేటాయింపులు చేశారు తప్ప మంత్రదండంతో రాబడిని సృష్టించే తీరు కనిపించలేదు. రుణమాఫీ మొత్తం ఉన్న కారణంగా వ్యవసాయం–సహకార రంగానికి కేటాయింపు 28,594 కోట్ల నుంచి 49,383 కోట్లకు పెంచారు. ఇది హర్షణీయమే, కానీ దీని కోసం చేసిన గారడీ ఏమిటి? సంపదలను సృష్టించేందుకు చేసే మూలధన వ్యయం గతేడాది చేసిన 44,252 కోట్లను 33,486కు తగ్గించారు. సాగునీటి ప్రాజెక్టుల పద్దులో గతేడాది సవరించిన బడ్జెట్ మొత్తం 29,766 కోట్లకు గాను ఈ ఏడాది 22,285 కోట్లకు కోత పెట్టారు. ఈ తీరుతో సాగునీటి ప్రాజెక్టులు రానున్న రోజుల్లో నత్తనడక నడుస్తాయి.రుణమాఫీతో రైతాంగానికి ఒకేడాది లబ్ధి చేకూరితే ప్రాజెక్టులు పూర్తిగాకపోతే కొన్నేండ్లపాటు నష్టపోతారని వేరే చెప్పనవసరం లేదు.



పేదలు, బడుగు వర్గాలు కార్పొరేట్ ఆసుపత్రుల వైపు చూస్తే లేని రోగాలు వస్తాయని భయపడుతున్న స్థితి. అందువలన వైద్య, ఆరోగ్యరంగాలకు బడ్జెట్ పెంచితేనే ప్రభుత్వ ఆసుపత్రులు, వాటిలో పరికరాలు, ఔషధాల సరఫరాకు వీలుంటుంది. కానీ చేసిందేమిటి? గత బడ్జెట్‌లో 12,161 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది 9,135 కోట్లే, ఈ ఏడాది కేటాయింపే 11, 468 కోట్లు చేశారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖలో కూడా ఇంతే, 4,037 కోట్లు కేటాయించి చేసిన ఖర్చు కేవలం 567 కోట్లు కాగా ఈ ఏడాది ప్రతిపాదనే 2,762 కోట్లకు కుదించారు. పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖలో గతేడాది ఏడువేల కోట్లు కోతపెట్టారు. ఇలా అనేక రంగాల్లో జరిగింది. దీనికి బాధ్యతను కేవలం కాంగ్రెస్ సర్కార్ మీదనే మోపటం లేదు. బీఆర్ఎస్ సర్కార్ గత ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది నెలలు అధికారంలో ఉంది. ఎన్నికల సంవత్సరం గనుక బడ్జెట్‌ను గొప్పగా భారీ మొత్తంతో రూపొందించింది. అంతకు ముందు సంవత్సరంలో ఖరారైన బడ్జెట్ 2.04లక్షల కోట్లే అయినా ఓటర్లను ఆకర్షించేందుకు 2.9లక్షల కోట్లతో జనాన్ని ఊరించింది. రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో కూడా ఆ ఛాయలు ఉన్నాయి. త్వరలో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ కసరత్తు చేశారని వేరే చెప్పనవసరం లేదు.

గత ప్రభుత్వం భారీ మొత్తంలో అప్పులు చేసిన మాట వాస్తవం. ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నది. ఈ ఏడాది 62వేల కోట్ల మేర రుణాలు తీసుకోనున్నట్లు ప్రతిపాదించారు. ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలకు లోబడి తీసుకున్న రుణాలు మార్చి నెలాఖరుకు 4.02లక్షల కోట్లుంటే వచ్చే మార్చి ఆఖరుకు 4.51లక్షల కోట్లకు చేరతాయని అంచనా వేశారు. 'లంకెబిందెలు ఉన్నాయనుకొని చూస్తే అలాంటివేమీ లేవని' వ్యాఖ్యానించిన రేవంత్‌రెడ్డి దగ్గర అల్లావుద్దీన్ అద్భుత దీపం లేదని తేలింది. ఈ ఏడాది బడ్జెట్‌లోటు 49వేల కోట్లు, పన్నేతర ఆదాయం 23,819 కోట్ల నుంచి 35,208కోట్లకు పెంచుతామన్నారు. భూము లమ్ముతారా? మద్యం రేట్లు పెంచుతారా? మరేదైనా చేస్తారో తెలియదు.గత ప్రభుత్వం గ్రాంట్ల ద్వారా 41,259 కోట్లు వస్తా యని చూపితే వచ్చింది కేవలం 9,729కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మొత్తాన్ని 21,636కోట్లకు పెంచింది. రైతుల రుణమాఫీకే నిధుల సమీకరణకు నానా తిప్పలు పడుతున్న కారణంగానే అనేక ఎన్నికల వాగ్దానాల ఊసే ఈ బడ్జెట్‌లో లేదు. కేటాయింపులు భారీగా చేసి, ఆ నిధులను ఖర్చు చేయకపోతే ఏం ఉపయోగం?

బోలే బాబా, మోడీ బాబా ఇద్దరూ ఒకటే



డాక్టర్ దేవరాజు మహారాజు

2024 జులై 2న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనలో నూటా ఇరవై మూడుమంది మరణించారు. ఎనభై వేల మందికి పర్మిషన్ తీసుకుని, రెండున్నర లక్షల మందిని అనుమతించడం వల్ల తొక్కిసలాట జరిగింది. తనను తాను దైవాంశ సంభూతుడిగా ప్రకటించుకున్న బోలే బాబా అసలు పేరు అక నారాయణ శంకర్ హరి, ఉరఫ్ సూరజ్ పాల్ జాతవ్. అతను గతంలో పోలీసు కానిస్టేబుల్, రేప్ కేసులో ఇరుక్కు న్నందువల్ల ఉద్యోగం ఊడిపోయిందని చెపుతారు. అయితే, తనమీద కేసులేవీ లేవని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వోద్యోగం నుంచి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నానని ఈ బోలే బాబా చెప్పుకుంటాడు. దళితుడిగా ఉద్యోగంలో చేరినా, ఇక ఇప్పుడు ఆ విషయం ఎక్కడా ఎత్తడు. అలీఘర్ గ్రాండ్ ట్రంక్ రోడ్డులో సువిశాలమైన స్థలంలో విలాసవంతమైన 'ప్రవాస్ ఆశ్రమం' ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడు. ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఉండే వసతులన్నీ అక్కడ ఏర్పాటు చేసుకున్నాడు. ఆయన ఆస్తి వందల కోట్లు ఉంటుందని అంచనా. తన ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూసుకోవడానికి, లీగల్ కేసుల్ని పరిష్కరించడానికి ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశాడు. దాని పేరు శ్రీ నారాయణ హరి సకర్ ఛారిటబుల్ ట్రస్ట్.

బోలే బాబా తెల్లని త్రీపీస్ సూట్ వేసుకుని, టై కట్టుకుని, నల్లకళ్లద్దాలతో సినిమా హీరోలాగా స్టైలిష్‌గా అభిమానులకి దర్శనమిస్తుంటాడు. ఆయనకు పెళ్లికాని యువతులు స్నానం చేయిస్తారు. అన్నం తినిపిస్తారు. మిగతా అన్ని పనులు చేస్తారు. టయోటా ఫార్చునర్‌లో బయలుదేరాడంటే వెంట మోటార్ సైకిళ్ల మీద కమెండోలు అనుసరిస్తారు. ఒక వివిఐపి వెళుతున్నట్టుగా వాళు రోడ్డు ఆక్రమిస్తారు. ఏ అధికారం లేకపోయినా, ప్రజల మూర్ఖత్వమే తన బలం అన్నట్టు–అతని ప్రోటోకాల్ ఉంటుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ఈ విషయం ఏ మాత్రమూ పట్టించుకోవు. జన సామాన్యానికి అసౌకర్యం కలుగుతోందని పోలీసులు అడ్డగించరు. వివేకం నశించిన వారు ప్రభుత్వంలో, ప్రభుత్వ సంస్థల్లో ఉన్నారు కాబట్టి, ఈ దేశంలో ఇలాంటి దొంగ బాబాల, సన్యాసుల ఆటలు సాగుతున్నాయి. హత్రాస్ తొక్కిసలాట మరణాలకు సంబంధించి–ఎఫ్.ఐ.ఆర్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యనిర్వాహకుల పేర్లు చేర్చారు కానీ, అసలైన బోలే బాబా పేరు చేర్చలేదు. అంటే బోలే బాబాకు పరిపాలకులకు ఉన్న మైత్రీ బంధం స్పష్టంగా కనిపిస్తోంది కదా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ కు వ్యతిరేకంగా పాలకులు ప్రవర్తిస్తున్నట్లే కదా? ఈ దొంగ బాబా అభిమానులు, ఆరాధకులు మాత్రం పేద కుటుంబాలకు చెందినవారు, నిమ్న కులాల వారు, వెనుకబడిన జాతుల వారు.

ఈ బోలే బాబాకు అతీంద్రియ శక్తులున్నాయని, చనిపోయిన వారిని బతికిస్తాడని, అతని పాదాల కింద మట్టిని తీసుకుపోయి తమ దగ్గర ఉంచుకుంటే సుఖసంతోషాలు, భోగభాగ్యాలు ప్రాప్తిస్తాయని నమ్మే ప్రజలకు అసలు ఇంగిత జ్ఞానం ఉందా? అదే నిజమైతే బోలేబాబా తన అద్భుత, అతీంద్రియ శక్తులతో తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రాణం పోయాలి కదా? మరణించిన వారికి ఎందుకు అలా వదిలేశారూ? బోలేబాబా దర్శనం చేసుకున్న వారికి, ఆయన సత్సంగ్‌లో పాల్గొన్న వారికి ఆయురారోగ్యాలు లభించాలి కదా? ఐశ్వర్యవంతులు కావాలి కదా? మరి ఇన్నేళ్లుగా జనానికి ఇవి ఎందుకు లభ్యం కావడం లేదూ? దారిద్ర్యం వారిని ఇంకా ఎందుకు వెంటాడుతూ ఉంది? ఆలోచించే పనే లేదా?

బోలేబాబా లాగానే భారతదేశ ప్రధాని కూడా తను బయలాజికల్‌గా తన తల్లికి పుట్టినవాడిని కానని, భగవంతుడి బిడ్డననీ ప్రకటించుకున్నాడు కదా? బోలేబాబాను మించి ఈ మోడీ బాబా గంటకో డ్రస్ మార్చుకుని స్టైల్‌గా తిరుగుతుంటాడు కదా? అది అతని భావన! కోట్ల విలువైన దుస్తులు వేసుకున్నా మాకు బికారిలాగే కనిపిస్తున్నాడని కొందరు అంటుంటారు. అది మళ్లీ వేరే విషయం! ప్రధాని పదవికి ఒక ప్రోటోకాల్ ఉంటుంది కాబట్టి, దేశంలోనూ, విదేశాల్లోనూ గౌరవ మర్యాదలు లభిస్తాయి నిజమే కానీ, వ్యక్తి గత స్థాయిలో మోడీ స్థాయి ఏమిటీ? అంటే, ఈ దేశ ప్రజలు ఏం చెపుతారూ? అబద్దాల చక్రవర్తి–అని చెపుతారు. గుజరాత్, మణిపూర్ మారణకాండలకు మూలకారకుడు–అని చెపుతారు. దళితుల్ని, ముస్లింలని ఊచకోత కోయించిన వాడిగా కీర్తిస్తారు.


బాబాలందరూ అతి సామాన్యమైన నేపథ్యంలోంచి వస్తారు. కానీ, సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎదుగుతారు. ప్రయివేటు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకుంటారు. రాజకీయ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకుని, తమ దురాగతాలు బయటపడకుండా జాగ్రత్త పడతారు. ఆశారాం బాపూ కావొచ్చు, గురుమీత్ రామ్ రహీమ్ కావొచ్చు, ఇచ్ఛాధారి భీమానంద్ చిత్రకూట్ వాలే కావచ్చు, చంద్రస్వామి కావచ్చు, స్వామి అమృత చైతన్య కావొచ్చు, స్వామి సదాచారి కావచ్చు, కృపాలూ కావొచ్చు, జగ్గీ వాస్‌దేవ్ కావొచ్చు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ కావొచ్చు, నిత్యానంద్ కైలాస్ కావొచ్చు, దేవ నాథన్ కావొచ్చు, లిస్ట్ చాలా పెద్దది. ఇక్కడ కొందరి పేర్లే ఇచ్చాను. వీళ్లందరి మీద అత్యాచారం కేసులున్నాయి. లేదా ఆదివాసుల, పేదల భూములు ఆక్రమించిన కేసులున్నాయి. లేదా పర్యావరణానికి తీవ్రంగా నష్టం కలిగించిన కేసులున్నాయి. మరి పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ, షాలు ఏం చేస్తున్నట్టూ? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఈ బాబాల్లో కొందరిని జైల్లో వేసింది. మరి ఇప్పుడూ? దేశ నాయకులకు దొంగబాబాలకు తేడాయే లేకుండా పోయింది. ఇంకా వీరిని జైలుకు పంపేదెవరూ? స్వయాన భార్యను చంపినవాడు సద్గురుగా చలామణి అవుతున్నాడు. అతని యోగ సెంటరు నుంచి మాయమైన ఆరుగురి ఆచూకి ఇప్పటికీ తెలియరాలేదు.ఆదివాసుల భూములాక్రమించి ఈశా(ఈశ్వరా)ఫౌండేషన్ స్థాపించినవాడికి ఈ పరిపాలకులు శిక్ష విధించగలరా? విధించలేరు. కారణం ఏమిటంటే వారు చేస్తున్న దురాగతాలు అలాంటివే కాబట్టి!

> బాబాలందరూ అతి సామాన్యమైన నేపథ్యంలోంచి వస్తారు. కానీ, సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎదుగుతారు. ప్రయివేటు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకుంటారు. రాజకీయ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకుని, తమ దురాగతాలు బయటపడకుండా జాగ్రత్త పడతారు. ఆశారాం బాపూ కావొచ్చు, గురుమీత్ రామ్ రహీమ్ కావొచ్చు, ఇచ్ఛాధారి భీమానంద్ చిత్రకూట్ వాలే కావచ్చు, చంద్రస్వామి కావచ్చు, స్వామి అమృత చైతన్య కావొచ్చు, స్వామి సదాచారి కావచ్చు, కృపాలూ కావొచ్చు, జగ్గీ వాస్‌దేవ్ కావొచ్చు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ కావొచ్చు, నిత్యానంద్ కైలాస్ కావొచ్చు, దేవ నాథన్ కావొచ్చు, లిస్ట్ చాలా పెద్దది. ఇక్కడ కొందరి పేర్లే ఇచ్చాను. వీళ్లందరి మీద అత్యాచారం కేసులున్నాయి. లేదా ఆదివాసుల, పేదల భూములు ఆక్రమించిన కేసులున్నాయి. లేదా పర్యావరణానికి తీవ్రంగా నష్టం కలిగించిన కేసులున్నాయి. మరి పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ, షాలు ఏం చేస్తున్నట్టూ?

కని పెంచిన తల్లితో తనకు బయలాజికల్‌గా సంబంధం లేదన్న వారికి ఏ శిక్ష విధించాలి? విడాకులివ్వ కుండా భార్యను వదిలేసిన వారికి ఏ శిక్ష విధించాలి? జస్టిస్ లోయను చంపించారనే ఆరోపణలున్న వారికి దేశంలో శిక్షే లేదు. ఒక ఫేక్ డిగ్రీతో చలామణి అవుతున్న వారి దగ్గర మన విద్యార్థిలోకం 'నీట్' పేపర్ లీకయ్యిందని మొరపెట్టుకుంటున్నారు. ఎలా ఉన్న దేశం–ఎలా అయిపోయిందీ? దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నవారే ప్రజా స్వామ్య పరిరక్షణ గూర్చి మాట్లాడుతున్నారు. దొంగ సర్టిఫికెట్లు, దొంగ డిగ్రీలు సమర్పించి ఐఏఎస్‌లైన వారి మీద 'గోది' మీడియా తెగ ఉత్సాహం ప్రదర్శిస్తోంది. అది చేయాల్సిన పనే, దేశ ప్రజలు సంతోషిస్తున్నారు కూడా! మరి ప్రధాని మోడీ, అతని అనుచరుల సర్టిఫికెట్ల మీద ఈ మీడియా ఎప్పుడూ ఎందుకు ప్రశ్నించదూ? ఇలాంటి ఎన్నో విషయాల గూర్చి విసుగెత్తి ఈ దేశ ప్రజలు ప్రధాన మీడియాకు దూరమయ్యారు. విదేశీ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో వాస్తవాలు ఏరుకొంటున్నారు.

ఓటర్లను అంధ విశ్వాసంలో ముంచి, జనాన్ని తమ భక్తులుగా/ అనుచరులుగా/ బాబాలు మార్చుకుంటూ ఉంటే– అంధ విశ్వాసంలో మునిగిన ఆ భక్తుల్నే ఈ దేశ నాయకులు తమ ఓటర్లుగా మార్చుకుంటున్నారు. వివేకం, విజ్ఞత లేని గొర్రెల్లాంటి జనమే వీరిరువురికీ అవసరం! బాబాలు ప్రజల్లో పుణ్యం, పాపం లాంటి భయాల్ని కలిగించి, ధన ప్రాప్తి లాంటి ఆశలు కల్పిస్తారు. దేశ నాయకులు అదే పని చేస్తున్నారు కదా? పుల్వామా? అంటారు.

> ఓటర్లను అంధ విశ్వాసంలో ముంచి, జనాన్ని తమ భక్తులుగా/ అనుచరులుగా/ బాబాలు మార్చుకుంటూ ఉంటే- అంధ విశ్వాసంలో మునిగిన ఆ భక్తుల్నే ఈ దేశ నాయకులు తమ ఓటర్లుగా మార్చుకుంటున్నారు. వివేకం, విజ్ఞత లేని గొర్రెల్లాంటి జనమే వీరిరువురికీ అవసరం! బాబాలు ప్రజల్లో పుణ్యం, పాపం లాంటి భయాల్ని కలిగించి, ధన ప్రాప్తి లాంటి ఆశలు కల్పిస్తారు. దేశ నాయకులు అదే పని చేస్తున్నారు కదా? పుల్వామా? అంటారు. పాకిస్థాన్ అంటారు. మెజారిటీ హిందువులకు మైనార్టీలయిన ముస్లింల వల్ల భద్రత లేదంటారు. భారత్‌లోకి చైనా, ఎన్ని కిలో మీటర్లు చొచ్చుకుని వచ్చిందో, ఎంత భూమి ఆక్రమించిందో చెప్పండంటే మాత్రం నోరువిప్పరు. ఈ దేశ స్థాయిని ఇంతగా దిగజార్చిన నేటి ఈ 'దేశభక్తి' దేశ పాలకులకు-ఈ దేశ ప్రజలు ఏ విధమైన శిక్ష విధించాలీ? ఒకరు జాతీయ స్థాయిలో, మరొకరు ప్రాంతీయ స్థాయిలో ఉన్నారు కానీ-మోసం చేయడంలో, ప్రజల ప్రాణాలు హరిం చడంలో బోలే బాబా అయినా, మోడీ బాబా అయినా... ఇద్దరూ ఒకటే!



పాకిస్థాన్ అంటారు. మెజారిటీ హిందువులకు మైనార్టీలయిన ముస్లింల వల్ల భద్రత లేదంటారు. భారత్‌లోకి చైనా, ఎన్ని కిలో మీటర్లు చొచ్చుకుని వచ్చిందో, ఎంత భూమి ఆక్రమించిందో చెప్పండంటే మాత్రం నోరువిప్పరు. ఈ దేశ స్థాయిని ఇంతగా దిగజార్చిన నేటి ఈ 'దేశభక్తి' దేశ పాలకులకు–ఈ దేశ ప్రజలు ఏ విధమైన శిక్ష విధించాలీ? ఒకరు జాతీయ స్థాయిలో, మరొకరు ప్రాంతీయ స్థాయిలో ఉన్నారు కానీ–మోసం చేయడంలో, ప్రజల ప్రాణాలు హరిం చడంలో బోలే బాబా అయినా, మోడీ బాబా అయినా... ఇద్దరూ ఒకటే! బోలే బాబా అక్కడ నిలబడి, మరణించిన వారి కుటుం బాలకు భరోసా ఇవ్వాల్సింది పోయి దొంగ దారిన పారిపోయాడు. పదిహేను రోజుల తర్వాత తన ఆశ్రమానికి (సంఘటన స్థలానికి) తిరిగివచ్చి, చనిపోయిన వారికి సంతాపం/ నివాళి వంటివి ప్రకటించకుండా "చేసిన ఖర్మలకు ఎలాంటి వారైనా ఫలితం అనుభవిస్తారని, దాన్ని ఎవరూ తప్పించలేరన్న" మెట్ట వేదాంతం వల్లించాడు. అంటే, ప్రజలు వారి ఖర్మానుసారమే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారన్నమాట! మోడీ బాబా అదే చెపుతున్నాడు. చేసి చూపుతున్నాడు. గుజరాత్, మణిపూర్ మారణకాండలో మరణించిన వారు వీధుల్లో నగ్నంగా ఊరేగించబడ్డ మహిళలు, కేవలం వారి పాపకార్యాల వల్లనే అలా చేయబడ్డారన్న మాట ! అందుకే కదా ప్రధాని మోడీ దేశ విదేశాలు తిరుగుతుంటాడు కాని మణిపూర్ మొహం చూడడు. వరుసగా జరిగిన రైల్వే ప్రమాదాలయినా, వరుసగా కూలిన బీహార్ వంతెనలయినా, వరుసగా కూలిన విమానాశ్రయాల 'పైకప్పు' లయినా – అన్నింటికన్నా ఆ ప్రాంతం వారి ఖర్మ ఫలితాలే– అందులో మోడీ ప్రభుత్వం బాధ్యతగానీ, ఎన్డీయే కూటమి బాధ్యత గానీ లేదు. పెద్ద నోట్లు రద్దు చేసినప్పుడు బ్యాంక్ క్యూలలో నిలబడి మరణించిన వారి బాధ్యత మోడీ బాబా తీసుకున్నాడా?

సంప్రదాయ వాదులకు నచ్చే ఒక అభూత కల్పన గురించి చూద్దాం– వాళ్ల పురాణాల్లో రాసుకున్నట్టు – సముద్ర మథనం జరిగింది, ఫలితంగా అమృతం, కామధేనువు, గరళం, అవినీతి వంటివి బయట పడ్డాయి. మొదటి రెండు మంచివి, దేవతలు తీసుకుపోయారు. మిగిలిన రెండింటిని ఈశ్వరుని ముందు పెట్టారు. 'ఈ రెండింటినీ నేను స్వీకరించ లేను.ఒక్కటే స్వీకరిస్తాను. అయితే ఉన్న రెండింటిలో గరళాన్ని ఎవరూ భరించలేరు గనక, లోక కళ్యాణం కోసం నేను గరళం తాగుతున్నాను' – అని శివుడు తాగేశాడు. మిగిలిన 'అవినీతిని' కొందరు భూ మండలం మీదున్న భారతదేశానికి తీసుకొచ్చారు. అక్కడ ఉన్న అతి పెద్ద రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ ఆ అవినీతిని మనసారా ఆహ్వానించి, స్వీకరించింది. తమ దగ్గర వాషింగ్ మిషన్ ఉందనీ అందులో ఎంతటి అవినీతినైనా ఉతికి శుభ్రపరుచుకుంటామనీ ప్రకటించింది. అప్పటి నుండి అవినీతి పరులైన రాజకీయ నాయకులు ఎక్కడ ఉన్నా వారిని ఆ పార్టీ ఆకర్షిస్తోంది. ఆ రకంగా దేశాన్ని అవినీతి రహిత దేశంగా మార్చేస్తోంది. ఎంతటి అవినీతి జరిగినా, ఏమీ జరగనట్టు – తమ మూర్ఖత్వానికి అందమైన మేకప్ వేసి ఆ పార్టీ వారు దేశ ప్రజల ముందుకు తేగలుగుతున్నారు. ఎన్నికల బాండ్లు ఒక స్కామ్, రామాలయం ఒక స్కామ్, విదేశీ బొగ్గు అదానీ నుండి కొనాలనడం ఒక స్కామ్. ప్రధాని మోడీ రష్యా వెళ్లి రావడం ఎందుకూ? అంబానీ, అదానీల ప్రయోజనం కోసమే కదా? బహిరంగంగా అందరికీ కనిపిస్తున్న విషయాలివి. ఈ దేశంలోని యువకులు మాత్రం పకోడీలు అమ్ముకోవాలని, పంచర్‌షాప్‌లు తెరుచుకోవాలని బీజేపీ నాయకులు ఉద్బోధిస్తున్నారు. డిగ్రీలు తీసుకోవడం దండగ అని కూడా చెపుతున్నారు. నిజమే దండగే! చరిత్రను వక్రీకరించి మొఘలుల కాలాన్ని తీసెయ్యడం, న్యాయ శాస్త్ర విద్యార్థులు 'మనుస్మృతి' చదవాలనడం – చేస్తున్నప్పుడు ఇక ఆ చదువుకు ఏ విలువ ఉంటుందీ? విశ్లేషించుకోవాలి కదా?


- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత,
జీవశాస్త్ర వేత్త (మెల్బోర్న్ నుంచి)

కాలం కాని కాలంలో
ఏమీ కాని పాలనలో
జీరోనే పాలిస్తోంది
దీనికి విలువ లేదని కాదు
పదింతల రెట్టింపుతో
స్వభావాపేక్షకు చెరగని చిహ్నం

వేళ కాని వేళలో
ఎటూ జరగని ఆవిష్కరణలో
సున్నాదే ప్రథమ స్థానం
అలా అని అధమస్థానం కాదు
బల్ల కింద నాగు పడగల్లాంటి
కోరలు చాచిన చేతులకి
అతి విలువైన మార్మిక స్థానం

అలుపెరుగని ఆత్రుతలో
నిలువరించుకోని స్థితిలో
గుండు సున్నాదే గెలుపు
స్థాన బలం లేదని కాదు
మట్టిని లాక్కొని ఎత్తిపోసే

జీ..రో..!!



భూ బకాసురుల లెక్కల్లో
విజృంభించే స్థానానికి
ఇదొక కాసుల వర్షం

మాట కాని మాటతో
చేతకాని ప్రగల్భాలతో
సున్నాదే అసలైన చెలిమి
బడ్జెట్‌లకు బందీలుగా
నాలికలు చాపే ఆశలకు
ఇదొక నాంది వాచకం

జీ...రో... కాదు సుమీ
జేబుకు అంటించిన
నోటు మెరుపుల వెనుక
పచ్చ నోట్ల రెట్టింపులకిది
బాగా వాడబడే
అరుదైన మూల స్థానం
బడుగు జీవనం జీ..రో
అట్టడుగు జీవితం జీ..రో
అడ్డదారితనానికి
అదుపు లేని లెక్కలకిది
సులువుగా వాడే సూత్రం

- నరెడ్డుల రాజారెడ్డి
9666016636

ఈ హత్యల వెనుక హస్తమెవరిది?



డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి

> మన రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గోషామహల్ ఎమ్మెల్యేగా గెలుపొందుతూ ఉన్నాడు. అంతకుముందు 2009లో టీడీపీ నుంచి గోషామహల్ కార్పొరేటర్‌గా గెలిచాడు.ఈయన పూర్వికులు ఉత్తర్‌ప్రదేశ్ నుండి హైదరాబాద్‌కు వలసొచ్చారు.ఇతను ఇటీవల గోవాలో జరిగిన హిందూ జనజాగృతి సభలో మేధావుల హంతకుల తరుపున వకాల్తా పుచ్చుకున్న న్యాయవాదులను సన్మానించాడు. దీని ద్వారా సమాజానికి శాసనకర్తగా ఏమి చెప్పాలనుకుంటున్నాడో ప్రజలు గమనించాలి.

ఇటీవల గోవాలో జరిగిన జన జాగృతి సమితి అనే హిందుత్వ గ్రూపు సమావేశంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హేతువాది,ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ ధబోల్కర్, జర్నలిస్ట్ యాక్టివిస్ట్ గౌరీ లంకేశ్ హంతకుల తరుపున వాదించే న్యాయవాదులను సన్మానించి నట్టుగా వార్తను చూసాము.ఈ సమావేశాలు జూన్ 24 నుంచి 30 వరకు జరిగాయి. జన జాగఅతి సమితి అనే సంస్థ హిందూ తీవ్రవాద సంస్థగా ముద్రపడ్డ సనాతన సంస్థ నుంచి జాలువారిన మరొక రూపం. హంతకుల తరుపున వాదించే కర్నాటక, మహారాష్ట్ర న్యాయవాదులను సన్మానించిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై 101 కేసులు హైదరాబాద్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 18 కేసులు మత విద్వేషాలు రెచ్చగొట్టినవి కావటం గమనార్హం. ఇక హిందూ తీవ్రవాదానికి మాతృకయిన సనాతన సంస్థ పుట్టుక, కార్యకలాపాలను ఒకసారి పరిశీలిద్దాం.

హిందూ మతాన్ని ఉద్ధరించే ముసుగులో హిందుత్వ తీవ్రవాదాన్ని ప్రోత్సహించే సనాతన సంస్థను గోవాకు చెందిన హిప్నోసిస్ట్, సైక్రియాటిస్ట్ డాక్టర్ జయంత్ అథవాలే 1999లో గోవా కేంద్రంగా ఎన్జీవో ముసుగులో రిజిస్టర్ చేశాడు.సనాతన సంస్థ హిందూ మత ప్రచారాన్ని సాగిస్తూ మత గ్రంథాలను ప్రచురిస్తూ సనాతన ప్రభాత్ అనే పక్ష పత్రికను వివిధ భాషల్లో ప్రచురిస్తూ, గురుపూర్ణిమ లాంటి వేడుకలను నిర్వహిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా కార్యకలాపాలను నిర్వహించటం పరిపాటి. మహారాష్ట్రలోని పన్వేల్ పట్టణంలో 2008లో సనాతన సంస్థకు చెందిన ఆరుగురు వ్యక్తులను తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డారని అరెస్ట్ చేయటం జరిగింది. వీరు థానేలో, వశి ఆడిటోరియంలో, పన్వేల్ పట్టణంలోని సినిమా థియేటర్లో బాంబులు పెట్టి విధ్వంసం సృష్టించారు. ఇందులో ఇద్దరికీ 2011లో పది సంవత్సరాల సెషన్స్ కోర్ట్ విధించటం జరిగింది. గోవాలో కూడా బాంబులు పెట్టి విధ్వంసం సృష్టించినందుకు ఆరుగురిని ఉపా కింద అరెస్ట్ చేయగా ఎన్ఐఏ ఆధారాలు లేవని వదిలేసింది. ఇంకా ముగ్గురు నిందితులు ఇప్పటి వరకు పరారీలోనే వున్నారు.

ఆగష్టు 2018లో మహారాష్ట్ర తీవ్రవాద నిరోధక స్క్వాడ్ (ఏటిఎస్) నల్లసొపారా, పూణే, షోలాపూర్‌లో సనాతన సంస్థ కార్యకర్తల ఇళ్లల్లో 20 బాంబులు, రెండు జెలిటిన్ స్టిక్స్, 4 ఎలక్ట్రానిక్, 22 నాన్ ఎలక్ట్రానిక్ డేటా నోటర్స్, 150 గ్రాముల పేలుడు పదార్థాలు, రెండు విషం అని రాసిన బుల్లెట్లు, బ్యాటరీలు, సోల్డరింగ్ పనిముట్లు స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేశారు.సెప్టెంబర్ 2016 లో మహారాష్ట్ర తీవ్రవాద నిరోధక స్క్వాడ్ పన్వేల్‌లోని సనాతన సంస్థ ఆశ్రమంలో 20 పెట్టెలలో నిల్వచేసిన నిషేధిత డ్రగ్స్‌తో పాటు నిద్రమాత్రలు,సప్రెసెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మత్తు మందులు సనాతన సంస్థ కార్యకర్తలను మానసికంగా కంట్రోల్ చేయటానికి వాడుతారని వారే చెప్పారు. ఇదేసందర్భంలో ఏటిఎస్ అధికారి సీఎన్ఎన్, న్యూస్18తో హేతువాది, ఫిజిషియన్ ధబోల్కర్ హత్య తర్వాత మాట్లాడుతూ సనాతన సంస్థ కార్యకర్తలు బాగా బ్రెయిన్‌వాష్ చేయబడుతారని, వాళ్లతో నోరు విప్పించటం చాలా కష్టమని, కోడ్ భాషలో సమాచారం పంచుకుంటారని, వీరికి 84 పేజెస్ రూల్ బుక్ ఉంటుందని, బాగా మతోన్మాదంపై శిక్షణ ఇవ్వబడుతుందని, తుపాకీ పేల్చేముందు దేవుని పేరు ఉచ్చరించాలని ఆదేశాలున్నాయని విచారిస్తున్న ఆ అధికారి ఆ టీవీ ఛానెల్స్‌కు చెప్పటం జరిగింది.ఈ సంస్థ మహారాష్ట్రలోని నాలుగు ప్రముఖ పట్టణాల్లో, కర్నాటకలోని బెళగావి, బెంగళూరు లాంటి పట్టణాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయని అయన చెప్పాడు.



డాక్టర్ ధబోల్కర్ పూణే పట్టణంలో ప్రముఖ పేరున్న ఫిజిషియన్, ఈయన ప్రముఖ హేతువాది.రచయిత, అంధశ్రద్ధ నిర్మూలన సంస్థను స్థాపించి మూఢనమ్మకాలకు, బాబాల మోసాలను, మత మౌడ్యాలను బట్టబయలు చేసేవాడు. పేరున్న యాక్టివిస్ట్. 20 జూన్ 2013న ఓంకారేశ్వరి ఆలయం దగ్గర ఇద్దరు పిస్తోలుతో కాల్చి చంపారు. గోవింద్ పన్సారే మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన ప్రముఖ కమ్యూనిస్ట్, ట్రేడ్ యూనియనిస్ట్ , ప్రముఖ హేతువాది, యాక్టివిస్ట్, రచయిత ఈయన రాసిన 17 శతాబ్దికి చెందిన శివాజీ బయోగ్రఫీ మరాఠి భాషలో శివాజీ కౌన్ హోతా బాగా ప్రసిద్ధి చెందింది.ఈయన్ను 16 ఫిబ్రవరి 2015న చంపివేశారు. ఎం.ఎం కల్బుర్గీ. కన్నడ భాషలో ప్రముఖ పండితుడు, రచయిత కన్నడ యూనివర్సిటీ, హంపికి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసాడు.ఈయనకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి కూడా లభించింది.ఈయన వచన సాహిత్యములో దిట్ట.

ఈయన్ను 30 ఆగష్టు 2015 అయన ఇంటివద్ద ధార్వాడలో 'గుర్తు తెలియని' హంతకులు కాల్చి చంపారు. గౌరీలంకేశ్‌ను బెంగళూర్‌లోని ఆమె ఇంటి వద్దే 5, సెప్టెంబర్ నాడు పిస్తోల్‌తో కాల్చి చంపారు. ఈమె ప్రముఖ జర్నలిస్ట్, యాక్టివిస్ట్. ఈమె 'లంకేశ్' పత్రిక ఎడిటర్. ఈమె మతోన్మాదానికి వ్యతిరేకంగా జనాన్ని జాగృతి చేస్తుండేవారు. ఈ నాలుగు హత్యల్లో వాడింది ఒకే పిస్తోలు అని చెబుతున్నారు.ఇటీవల ఒక్క ధబోల్కర్ హత్యపై సెషన్స్‌కోర్ట్ ఇద్దరికీ పదేండ్లు శిక్ష విధించింది.ఇందులో సిబిఐ పాత్రను, కేసును తప్పుతోవ పట్టేలా చేసినందుకు జడ్జి తీవ్రంగా తప్పు పట్టారు.

హత్య కావించబడ్డ ఈ నలుగురు హిందూ తీవ్రవాదాన్ని, మూఢనమ్మకాలను వ్యతిరేకించి ప్రజలను జాగృతం చేసినవారు. మనుధర్మాన్ని, అంధ విశ్వాసాలను ప్రేరేపించే సనాతన సంస్థ మతం ముసుగులో తీవ్రవాదాన్ని ప్రేరేపిస్తూ దేశంలో మేధావులను సత్య శోధకులను ఖతం చేయటమే ఈ సంస్థ లక్ష్యంగా కనిపిస్తుంది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు ఒకసందర్భంలో మాట్లాడుతూ తాను మానసిక ట్రీట్మెంట్ చేసిన రోగులలో 30శాతం మందికి హిందూ మత గ్రంథాలను, శ్లోకాలను చదివి వినిపిస్తే మానసిక రోగం తగ్గిందని, మందులకు తగ్గలేదని చెబుతాడు. అంటే ఈయన ఆ సనాతన సంస్థ ద్వారా సమాజానికి ఏమి చెబుతున్నాడో అర్థం చేసుకోవచ్చు.

ఇక మన రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గోషామహల్ ఎమ్మెల్యేగా గెలుపొందుతూ ఉన్నాడు. అంతకు ముందు 2009లో టీడీపీ నుంచి గోషామహల్ కార్పొరేటర్‌గా గెలిచాడు. ఈయన పూర్వికులు ఉత్తర్‌ప్రదేశ్ నుండి హైదరాబా ద్‌కు వలసొచ్చారు.ఇతను ఇటీవల గోవాలో జరిగిన హిందూ జనజాగృతి సభలో మేధావుల హంతకుల తరుపున వకాల్తా పుచ్చుకున్న న్యాయవాదులను సన్మానించాడు. దీని ద్వారా సమాజానికి శాసనకర్తగా ఏమి చెప్పాలనుకుంటున్నాడో ప్రజలు గమనించాలి.

అప్పు చేసి పప్పు కూడు..

- కొత్త రుణాలు రూ.69 వేల కోట్లు
- మార్కెట్ లోన్లు రూ.57 వేల కోట్లు
- అప్పులు, వడ్డీలు, రీపేమెంట్లు...తడిసిమోపెడు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ సర్కారు మాదిరిగానే ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం సైతం అప్పుల మీదే ఆధారపడి బండిని లాగించేందుకు ప్రయత్నిస్తోందా..? అంటే అవుననే అంటున్నాయి బడ్జెట్ గణాంకాలు. పాత అప్పులకు వడ్డీలు కట్టటంతోపాటు కొత్తగా అప్పులు తీసుకోవటం అనివార్యమనే పరిస్థితికి ప్రభుత్వం నెట్టబడిందని ఆ లెక్కలు చెబుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గురువారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రతిపాదించిన పూర్తి స్థాయి పద్దులో వివిధ మార్గాల ద్వారా మొత్తం రూ. 69,572.48 కోట్ల మేర అప్పులు తీసుకుంటామంటూ ప్రకటించారు. ఇందులో బహిరంగ మార్కెట్ లోన్ల ద్వారా రూ.57.112.48 కోట్లను, కేంద్రం నుంచి తీసుకునే రుణాల రూపంలో మరో రూ.3.900 కోట్లను సంగ్రహిస్తామంటూ ప్రభుత్వం పేర్కొంది. ఇవిగాక ఇతర రుణాల రూపంలో మరో రూ.వెయ్యి కోట్లు, డిపాజిట్లు, బాండ్ల ద్వారా రూ.4 వేల కోట్లు, అడ్వాన్సుల రూపంలో రూ.3,560 కోట్లు సమీకరిస్తామని సర్కారు వెల్లడించింది. మరోవైపు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీల రూపంలో రూ.17,729.77 కోట్లను చెల్లించనున్నారు. ఇంత పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం భరించగలదా..? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. అలా భరించలేని పరిస్థితి కాబట్టి మళ్లీ అనివార్యంగా ప్రభుత్వం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితికి లోబడి గతంలో తీసుకున్న రుణాల తాలూకూ చెల్లింపుల(రీ పేమెంట్లు) కోసం మరో రూ.13,117 కోట్లను వెచ్చించాలి. అంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, వాటికయ్యే వడ్డీలు, రీ పేమెంట్లనేవి రేవంత్ సర్కారుకు తడిసిమోపెడు కానున్నాయన్నమాట.

కాంగ్రెస్+రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా? : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ + రాష్ట్ర బడ్జెట్‌ను కలిపితే వచ్చేది గాడిద గుడ్డేనా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. గాడిద గుడ్డు పెట్టడం ఎంత నిజమో..కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం అంతే నిజమనే దానికి కాంగ్రెస్ బడ్జెటే నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు బుధవారం బండి ఒక ప్రకటన విడుదల చేశారు. భట్టి విక్రమార్క చదివింది బడ్జెట్‌నా? అప్పుల పత్రాన్నా? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో నిధులెందుకు కేటాయించలేదని నిలదీశారు. ఆరు గ్యారంటీల అమలుపై చర్చ జరుగకుండా ఉండేందుకే కేంద్రాన్ని బదనాం చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. 12 వేల పోస్టులకే నోటిఫికేషన్లు ఇచ్చి 31 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చి డిఫాల్టర్ల జాబితా నుంచి తొలగిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. జాతీయ వృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధిరేటు తక్కువ కావడమే పదేండ్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు అద్దం పడుతున్నదని విమర్శించారు. బీజేపీ క్యాబినెట్ మంత్రుల మధ్య సఖ్యత లేదనేది ఈ శతాబ్దం జోక్ అని కొట్టిపడేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో కేంద్ర నిధులున్నాయని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమని పేర్కొన్నారు.

రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలి

- తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2024- 25 వార్షిక బడ్జెట్‌లో సేవా వృత్తిదారులకు తీవ్ర వివక్షత చూపిందని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం విమర్శించింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రజకవృత్తిదారుల సంక్షేమ రుణాలకు కేవలం రూ. 30కోట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ సర్వీసులైన (దోబీఘాట్లకు) కేవలం రూ3 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పొందుపరిచారని తెలిపారు. రాష్ట్రంలో 3400కుపైగా రజక వృత్తిదారుల సొసైటీలుండగా ఆ సొసైటీల సంక్షేమ రుణాలకు రూ,500 కోట్లు అవసరముండగా కేవలం రూ.30కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. మోడ్రన్ ధోబీఘాట్ల నిర్మాణానికి, డ్రై క్లినిక్, వృత్తి శిక్షణ, ఉపాధి కల్పన కొరకు రూ. 500కోట్లు అవసరం ఉండగా కేవలం రూ.3 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. రజక ఫెడరేషన్‌కి రూ.వెయ్యి కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని గత కొంతకాలంగా తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2024లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని నాగర్ కర్నూల్ లోక్‌సభ ఎంపీ మల్లు రవి విమర్శించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే అమలు చేసేలా బడ్జెట్‌లో హామీలు, కేటాయింపులు ఉన్నాయన్నారు. తెలంగాణలోని పాత జిల్లాలలో 9 జిల్లాలకు వెనుకబడిన ప్రాంత నిధులు ఇస్తామని హామీ ఇచ్చి దాని గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. తెలంగాణకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి లేఖలు రాశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులను వ్యతిరేకించడం లేదని, తెలంగాణకు కేటాయింపులు జరపాలని కోరుతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్, బీజేపీతో రాజీపడిందన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని లేవనెత్తుతామన్నారు. తెలంగాణకు న్యాయం జరిగేంతవరకు పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని మల్లు రవి అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ కు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ఢిల్లీ వేదికగా జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టి కేంద్రాన్ని నిలదీద్దామని ఎంపీ సురేష్ షెట్కార్ తెలిపారు. కేసీఆర్ వస్తే, రేవంత్ రెడ్డి కూడా వస్తారన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు కూడా ధర్నాకు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని బీజేపీ ఎంపీలు వమ్ము చేశారని భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రి వర్గంలో ఉన్నప్పటికీ న్యాయం జరగలేదని తెలిపారు. విభజన చట్టం 2014లో ఉంటే అప్పటి నుంచి లేని కేటాయింపులు ఈసారి బడ్జెట్‌లోనే ఎందుకు చేశారని ప్రశ్నించారు. ప్రధాని కుర్చీ కాపాడుకునేందుకే బడ్జెట్‌లో నితీశ్, చంద్రబాబు రాష్ట్రాలకు న్యాయం చేశారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సహకరించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు కాంగ్రెస్ పై విమర్శలు చేస్తున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఎంపీలు తెలంగాణకు జరిగిన అన్యాయం పై పోరాటం చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.



ఓడలు బళ్లు...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓడలు బళ్లు అవుతాయంటే ఇదేనేమో! పొలిటికల్‌గా ఇప్పుడీ నానుడి బీఆర్‌ఎస్‌ అధినేత, శాసనసభలో ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్‌)కు వర్తిస్తుందనే చమత్కారాలు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వినిపించాయి. ఉమ్మడి రాష్ట్రం మొదలు, పదేండ్లు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్‌ ఏనాడూ అసెంబ్లీ మీడియా పాయింట్‌ వద్దకు వచ్చిందే లేదు. అధికారం కోల్పోయాక, తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఆయన, అలాగే తొలి సారిగా మీడియా పాయింట్‌కు కూడా వచ్చారు. అక్కడే విలేకరులతో మాట్లాడారు. అయితే విలేకరులు అడిగిన ప్రశ్నలకు మాత్రం ఆయన సమాధానం చెప్పలేదు. కేవలం బడ్జెట్‌ మీద తన అభిప్రాయం చెప్పేసి వెళ్లిపోయారు. సార్‌...మళ్లీ అసెంబ్లీకి వస్తారా అని విలేకరులు అడిగితే విశ్వ రూపం చూపిస్తామని అన్నారు. పదేండ్లు ప్రగతి భవన్‌ గేట్ల బయట పడి గాపులు కాసిన మీడియా ప్రతినిధులు, ముఖ్యమంత్రి హోదాలో ఓ వెలుగు వెలిగిన కేసీఆర్‌ మీడియా పాయింట్‌కు రావడాన్ని ఆశ్చర్యంగా చూసి... 'ప్రజాస్వామ్యం గొప్పతనం ఇదే' అని కామెంట్స్‌ చేయడం వినిపించింది.

కరెంటుకు కాసుల కష్టాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్ర బడ్జెట్‌లో ఇంధనశాఖకు రూ.16,410 కోట్లు కేటాయిస్తూ ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దీనిలో ప్రగతి పద్దుకింద రూ.11,905.62 కోట్లు కేటాయించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కోసం రూ.8,260 కోట్లు, గృహజ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్‌ స్కీం కోసం రూ.2,418 కోట్లు కేటాయించారు. స్పిన్నింగ్‌ మిల్లుల రాయితీకి రూ.50 కోట్లు, ఉదయ్‌ స్కీం ద్వారా డిస్కంల నష్టాల రీయింబర్స్‌మెంట్‌ రూ.250 కోట్లు కేటాయించారు. వ్యవసాయం, గృహజ్యోతి ఉచిత విద్యుత్‌ కోసమే దాదాపు రూ.10,600 కోట్లు వ్యయం అవుతుంది. టీఎస్‌ట్రాన్స్‌కో, డిస్కంలకు ఇతరత్రా ఎలాంటి ఆర్థిక సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించలేదు. మిగిలిన నిధులు అరకొరగానే ఉండటంతో భవిష్యత్‌పై ఆందోళన నెలకొంటున్నది. గత అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్‌రంగంపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో ప్రభుత్వ శాఖల బకాయిలు రూ.28,842.72 కోట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. కనీసం వాటిని తిరిగి చెల్లిస్తామనే మాటను కూడా ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ ప్రసంగంలో పేర్కొనకపోవడం గమనార్హం. కనీసం ఆ సొమ్ము వస్తేనన్నా డిస్కంలు ఆర్థికంగా కొంతైనా కోలుకొనే అవకాశం ఉంటుంది. అలాగే రాష్ట్రంలోని విద్యుత్‌ సంస్థల అప్పులు దాదాపు రూ.88 వేల కోట్లు ఉన్నాయని ప్రభుత్వం శ్వేతపత్రంలో పేర్కొంది. వాటిలో ప్రభుత్వ గ్యారెంటీ అప్పులు 2023 ఏప్రిల్‌ 1 నాటికి పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌కు రూ.2,130.40 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వ హామీతో రుణాలు తీసుకొని, విద్యుత్‌ సంస్థలే సొంతంగా చెల్లించాల్సిన అప్పులు పై తేదీ నాటికి రూ.29,698.99 కోట్లు ఉన్నాయి. 2023-24 మధ్యకాలంలో వీటికి మరో రూ.11,840.37 కోట్ల అప్పులు తోడయ్యాయి. దీనితో విద్యుత్‌ సంస్థలు చెల్లించాల్సిన అప్పుల మొత్తం రూ.41,339.36 కోట్లకు చేరాయి. ఇవి కాకుండా ఎలాంటి ప్రభుత్వ హామీ లేని రుణాలు కూడా విద్యుత్‌ సంస్థలు తీసుకున్నాయి. ఈ విధంగా తీసుకున్న రుణాల్లో...తెలంగాణ స్టేట్‌ పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌కు 2024 మార్చి 31 నాటికి రూ.34,453.37 కోట్ల రుణం ఉంది. ట్రాన్స్‌కోకు రూ.10,437.38 కోట్లు, దక్షిణ తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్‌)కు రూ.6,039.50 కోట్లు, ఉత్తర తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ (టీజీఎస్‌ఎన్పీడీసీఎల్‌)కు రూ.3,977.16 కోట్ల రుణాలు ఉన్నాయి. వీటన్నింటినీ ఆయా సంస్థలే వడ్డీతో సహా చెల్లించాలి. ఆశించిన మేరకు బడ్జెట్‌ కేటాయింపులు లేకపోవడంతో, ఇన్ని రకాల రుణాల చెల్లింపులకు నిధులు ఎలా సమకూర్చుకోవాలనే దానిపై విద్యుత్‌ సంస్థలు తలపట్టుకుంటున్నాయి.

బడ్జెట్‌లో యువతకు నిరాశే : డీవైఎఫ్‌ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం యువతను విస్మరించిందని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్‌, ఆనగంటి వెంకటేష్‌ విమర్శించారు. స్కిల్‌ యూనివర్సిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కానీ ప్రయివేట్‌ భాగస్వామ్యం కాకుండా ప్రభుత్వమే పూర్తిగా ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. 17 ప్రాధాన్య రంగాలను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ ప్రకటించిందని వివరించారు. పీపీపీ మోడల్‌లో ఈ వర్సిటీని నెలకొల్పుతామంటూ ప్రకటించడం సరైంది కాదని తెలిపారు. ప్రయివేట్‌ భాగస్వామ్యం కాకుండా పూర్తిస్థాయిలో ప్రభుత్వమే నిర్వహణ భాద్యతను తీసుకుని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వర్సిటీకి నిధులు కేటాయించకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ విధంగా అందుబాటులోకి తెస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ ఎన్నికల మ్యానిఫెస్టో యూత్‌ డిక్లరేషన్‌లో భాగంగా జాబ్‌ క్యాలెండర్‌, నిరుద్యోగ భృతి, యూత్‌ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారని గుర్తు చేశారు. కానీ ఈ హామీల ప్రస్తావనే లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మాదిరిగానే ప్రకటనలకు పరిమితమవుతున్నట్టుగానే ఈ ప్రభుత్వ వ్యవహారం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి యువజన, క్రీడారంగాలకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు.

ఏజెన్సీకి మళ్లీ గోదావరీ

(మొదటిపేజీ తరువాయి)

ముంచుకొస్తుంది. ఇప్పటికే పట్టణంలోని ఎటపాక సరిహద్దు ప్రాంతంలో ఉన్న స్లూఈజ్‌ల నుంచి భారీగా వరద నీరు శివారులోని ఏఎంసీ, కొత్త కాలనీలకు చేరుతోంది. మరోసారి గోదారి ఉప్పొంగడంతో ముంపు మరింత పెరిగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌ అధికారులను ఆదేశించారు. సుభాష్‌ నగర్‌ కాలనీ చప్ట దిగువ కొత్త కాలనీ, అయ్యప్ప కాలనీ వద్ద ఉన్న స్లూఈజ్‌ లోంచి భారీగా వరద నీరు లీకయ్యే ప్రమాదం ఉందని లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలో పలు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసిన రెవెన్యూ అధికారులు అవసరమైన మేరకు లోతట్టు ప్రాంత ప్రజలు అధికారులకు సహకరిస్తూ పునరావాస కేంద్రాలకు తరలి రావాలని స్పష్టం చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం కలెక్టర్‌ పట్టణంలోని ఐటీడీఏ, ఆర్డీఓ, తహసీల్దార్‌ కార్యాలయంలో ఉన్న కంట్రోల్‌ రూమ్‌లను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, వరదలతో ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశాలు సైతం జారీ చేశారు. మళ్లీ వరద వృద్ధి ప్రారంభంతో భద్రాచలం నుంచి కూనవరం-చింతూరుకు వెళ్లే జాతీయ రహదారి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. అదేవిధంగా భద్రాచలం నుంచి ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వెళ్లే రహదారి సైతం బూర్గంపాడు వద్ద ముంపునకు గురికాగా అధికారులు ఈ దారిని కూడా మూసివేసి రాకపోకలను నిలిపివేశారు. ఇటు చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు వెళ్లే జాతీయ రహదారి సైతం తూర్పాక, కన్నాయిగూడెం గ్రామాల వద్ద ముంపునకు గురైంది.

విలీన మండలాలకు మరోసారి ముంపు

పోలవరం ముంపు మండలాల ప్రజలు గురువారం మధ్యాహ్నం నుంచి మరోసారి ముంపు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కూనవరం మండలంలోని అనేక ఏజెన్సీ గ్రామ ప్రజలు పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్నారు.

పోలవరం బ్యాక్‌ వాటర్‌తో చింతూరు, వీఆర్‌ పురం మండలాల్లోని అనేక గ్రామాలు ముంపునకు గురికాగా మళ్లీ పెరుగుతున్న వరదతో మరింత నష్టాన్ని చవిచూస్తున్నారు. ఇప్పటికే భారీ వర్షాల నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా పాఠశాలలకు సెలవులు ప్రకటించగా పెరుగుతున్న గోదావరి నేపథ్యంలో మరో మూడు రోజులపాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ముంపు మండలాల్లో వారం రోజుల నుంచి విద్యుత్‌, రవాణా సౌకర్యం లేకుండా పోయింది. దోమల స్వైరవిహారంతో విష జ్వరాల బారిన పడుతున్న ప్రజలు ఇంకెన్ని రోజులు ఈ వరద కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

శ్రీశైలం సొరంగ మార్గానికి రూ.2200 కోట్లు కేటాయించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డికి వినతిపత్రం
- ప్రాజెక్టుల పెండింగ్‌ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్‌

శ్రీశైలం సొరంగ మార్గం పనుల సత్వర పూర్తికి సుమారు రూ.2200 కోట్లు కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హైదరాబాద్‌లో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లాలో సుమారు 3.20 వేల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. 19 సంవత్సరాల కిందట రూ.1925 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ పనులు ప్రస్తుతం రూ.4658 కోట్ల అంచనా వ్యయానికి చేరాయని పేర్కొన్నారు. ఇంకా 9.5 కి.మీ. సొరంగం తవ్వాల్సి ఉన్నదని తెలిపారు. గత ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం వల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. లిఫ్ట వల్ల మాత్రమే ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు, హైదరాబాద్‌ ప్రాంతానికి తాగునీటికి సగం నీరు, సేద్యానికి మరో సగం నీటిని ఉపయోగించడం వల్ల స్థిరీకరించిన ఆయకట్టుకు నీరు అందటం లేదని తెలిపారు. సొరంగం పూర్తయితేనే పూర్తిస్థాయిలో సాగు, తాగు నీరు అందే అవకాశం ఉందన్నారు. సుమారు 2.20 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన పెండ్లిపాకల ప్రాజెక్టు పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. దాని కింద 950 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. సొరంగం, పెండ్లిపాకల ప్రాజెక్టుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని మంత్రిని కోరారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డిని కోరారు. డిండి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి మహబూబ్‌నగర్‌, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని సుమారు 3.61 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు 2015లో జీవో 107ను విడుదల చేసినట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 3.41 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారన్నారు. దాని కింద కొన్ని నిధులు మంజూరు చేసి సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నా గత ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన ఏదుళ్ల రిజర్వాయర్‌ నుంచి రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజులపాటు 30 టీఎంసీల నీటిని తీసుకునే విధంగా డీపీఆర్‌ను ఆమోదించాలని, త్వరగా పనులు ప్రారంభించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. మూసీ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు.. కుడి, ఎడమ కాలువల మరమ్మతులు (లైనింగ్‌, పూడిక, షట్టర్ల నిర్మాణం), పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించాలని కోరారు.

మూసీ నీటి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, మూసీని ఆధునీకరించి సుందరీకరణ చేస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన ప్రభుత్వాధికారులు

పరకాలలో సబ్‌ రిజిస్ట్రార్‌, పాల్వంచలో ఎస్‌ఐ



నవతెలంగాణ-పరకాల/పాల్వంచ

ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కిన ఘటనలు హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గురువారం చోటుచేసుకున్నాయి. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా పరకాల పట్టణ పరిధి విలీన గ్రామం సీతారాంపురం(మాదారం) శివారు సర్వే నెంబర్‌ 481(సి)లోని 9గంటల ఇంటి స్థలాన్ని లడే రాజేశ్వరరావు-సాంబలక్ష్మి దంపతుల కుమారులు లడే శ్రీనివాస్‌, శ్రీకాంత్‌ సమభాగాలుగా గిఫ్ట్‌ రిజిస్ట్రేషన్‌ చేయించుకోవడానికి అధికారులను సంప్రదించారు. రిజిస్ట్రేషన్‌ ప్రభుత్వ విలువతో పాటు అదనంగా రూ.80వేలు అవుతుందని ప్రయివేట్‌ డాక్యుమెంటరీ రైటర్‌ బొట్ల నరేష్‌, సబ్‌ రిజిస్ట్రార్‌ సునిత లంచం అడిగారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితులు ఈనెల 22న జిల్లా ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దాంతో పరకాల సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో గిఫ్ట్‌ రిజిస్ట్రేషన్‌ అవుతున్న సమయంలో ప్రయివేటు డాక్యుమెంటరీ రైటర్‌ బొట్ల నరేష్‌కు బాధితులు రూ.80,000 ఇచ్చారు. ముందస్తు పథకం ప్రకారం బొట్ల నరేష్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ సునితకు డబ్బులు అందజేస్తున్న క్రమంలో ఇద్దరిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.80,000 స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు ఏసీబీ ఏసీపీ సాంబయ్య తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్టణానికి చెందిన శ్రావణి చేసిన ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో 286/2024 క్రైమ్‌ నెంబర్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో నిందితులైన ఐదుగురిని అరెస్ట్‌ చేసి చార్జిషీట్‌ దాఖలు చేయడానికి ఎస్‌ఐ ఆమెను రూ.20 వేలు డిమాండ్‌ చేశాడు. దాంతో ఈ విషయాన్ని శ్రావణి తన లాయర్‌ లక్ష్మారెడ్డికి చెప్పడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్‌ నేతృత్వంలో సిబ్బంది రెడ్‌ హ్యాండెడ్‌గా ఎస్‌ఐ నివాసంలో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేశారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్‌ చేస్తే టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1064కు సమాచారం అందించాలని తెలిపారు.



రాజకీయ కక్షతో నేతన్నలను ఇబ్బంది పెట్టొద్దు

అసెంబ్లీలో చర్చించి సమస్యలు పరిష్కరించాలి

- ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలి
- లేదంటే 27న చలో హైదరాబాద్‌ చేపడతాం : సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌ బాబు
- నాలుగో రోజు కొనసాగిన జేఏసీ నిరాహార దీక్ష
- నేతన్న చౌక్‌ వద్ద మానవహారం



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్‌

"సిరిసిల్ల చేనేతకు నిలయం.. అలాంటి వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు.. రాజకీయ కక్షతో నేతన్నలను ఇబ్బంది పెట్టొద్దు.. వెంటనే ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలి.." అని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షల నాలుగో రోజు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని నెలల నుంచి ఉపాధి లేక నేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, పరిశ్రమ మూతపడే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమ మనుగడ కోసం దానిపై ఆధారపడి జీవిస్తున్న అనుబంధ రంగాల కార్మికులు రోడ్డెక్కారని, దీనికి గత, ప్రస్తుత ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ రాజకీయ కక్షలో భాగంగా నేతన్నలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌ బకాయిలు చెల్లించక, ప్రస్తుత ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వక పనులు లేక కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నేతన్నల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. వస్త్ర పరిశ్రమకు ఉచిత విద్యుత్‌, త్రిఫ్ట్‌ పథకం, యారన్‌ సబ్సిడీ, నూలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జనతా వస్త్ర పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని, పెండింగ్‌ బకాయిలు చెల్లించి పరిశ్రమను రక్షించాలని డిమాండ్‌ చేశారు.

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నేతన్నల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలన్నారు. లేకుంటే 27న చలో హైదరాబాద్‌ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం పాత బస్టాండ్‌లోని నేతన్న చౌక్‌ వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ముషం రమేష్‌, పంతం రవి, సీపీఐ నాయకులు గుంటి వేణు, తాటిపాముల దామోదర్‌, ఆడెపు భాస్కర్‌, సిరిసిల్ల రవీందర్‌, గోనె పర్శరాములు, కోడం నరహరి, గడ్డం ప్రసాద్‌, దుబాల సతీష్‌, కారంపురి సురేష్‌, వంగ శేఖర్‌, చింతకింది సుదన్‌, దోమల రమేష్‌, దోమల తుకారాం, సాంబారి మహేందర్‌, నాయకులు ఉన్నారు.

సిరిసిల్ల పట్టణ బంద్‌ విజయవంతం

వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా పిలుపునిచ్చిన సిరిసిల్ల పట్టణ బంద్‌ గురువారం విజయవంతమైంది. ఉదయం నుండే వాణిజ్య వ్యాపార యజమానులు స్వచ్ఛందంగా బంద్‌ చేపట్టారు. ఈ బంద్‌ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. బంద్‌కి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హైటెక్‌ సిటీలో రేవ్‌ పార్టీ

- అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు
- ఐదుగురు నిర్వాహకుల అరెస్ట్‌
- విదేశీ మద్యం, డ్రగ్స్‌ స్వాధీనం : ఎన్‌ఫోర్స్‌మెంట్‌ జాయింట్‌ కమిషనర్‌ కేవై కురేషీ



నవతెలంగాణ-మియాపూర్‌

నగరంలో మరోసారి రేవ్‌ పార్టీ కలకలం రేపింది. రంగారెడ్డి జిల్లా మాదాపూర్‌ హైటెక్‌ సిటీ సైబర్‌ టవర్స్‌లోని క్లౌడ్‌ 9 హెూమ్స్‌ సర్వీస్‌ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న రేవ్‌ పార్టీని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు భగ్నం చేశారు. ఈ రేవ్‌ పార్టీని ఆర్గనైజ్‌ చేసిన ఐదుగురితో పాటు పార్టీలో పాల్గొన్న 14 మంది పురుషులు, ఆరుగురు యువతులను అరెస్ట్‌ చేశారు. వేడుకల్లో ఓ బడా బిల్డర్‌ వినియోగించిన విదేశీ మద్యం, డ్రగ్స్‌ పట్టుబడ్డాయి. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్టేట్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ జాయింట్‌ కమిషనర్‌ కెవై కురేషీ, ఎస్పీ ప్రదీప్‌ రావుతో కలిసి చందానగర్‌ ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌ కార్యాలయంలో గురువారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 12 వ తేదీన ఎ.నాగరాజుయాదవ్‌ అతని స్నేహితులతో కలిసి గోవా వెళ్లారు. అక్కడ 3గ్రా కొకైన్‌ కొనుక్కొని.. బస్సులో హైదరాబాద్‌ వచ్చిన జి.నితిన్‌కి అందజేశారు. సాయికుమార్‌ యాదవ్‌ అనే వ్యక్తి దుబాయ్‌ నుంచి విదేశీ మద్యాన్ని తీసుకొచ్చాడు. కిషోర్‌ అనే వ్యక్తి క్లౌడ్‌ 9 సర్వీస్‌ అపార్ట్‌మెంట్‌ ఫ్లాట్‌ నెం 601ని బుక్‌ చేశాడు. వీరంతా బుధవారం అర్ధరాత్రి రేవ్‌ పార్టీ నిర్వహిస్తుండగా టాస్క్‌ఫోర్స్‌ బృందం పార్టీపై దాడిచేశారు. ఈ దాడిలో నిర్వాహకులు ఎ.నాగరాజు యాదవ్‌, ఎ.సాయికుమార్‌ యాదవ్‌, టి. ఇమ్మాన్యుయేల్‌, చట్టి కిషోర్‌, జి.నితిన్‌ను అరెస్టు చేశారు. వీరిలో రియల్టర్లు, విద్యార్థులు, నిర్వహకులు ఉన్నారు. వీరి వద్ద 1 గ్రాము కొకైన్‌, 0.84 గ్రాముల హైబ్రిడ్‌ గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ పట్టుబడింది. అలాగే, 12 ఫుల్‌ బాటిళ్ల విదేశీ మద్యం, 2 కార్టన్ల బీరు, ఇన్నోవా క్రిష్టో కారును స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ వినియోగించని వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చి పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కమిషనర్‌ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో శేరిలింగంపల్లి ఎక్సైజ్‌ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఆర్థిక కష్టాలే!

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)కి సముచిత కేటాయింపులు జరగలేదు. మొత్తం బడ్జెట్‌లో మూడు శాతం నిధులు కేటాయించాలని కార్మిక సంఘాలు కోరుతున్న విషయం తెలిసిందే. ఆ డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్‌ కింద నిధులు కేటాయించింది. 2023 డిసెంబర్‌ నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు 68.69 కోట్ల ప్రయాణాలు చేశారనీ, అందువల్ల తెలంగాణ మహిళలకు రూ.2,351 కోట్లు ఆదా అయ్యాయని ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్‌ ప్రసంగంలో చెప్పారు. అంటే ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించాల్సిన సొమ్ము రూ.2,351 కోట్లు. 2023 డిసెంబర్‌ నుంచి మార్చి 31 వరకు నాలుగు నెలల సొమ్ము 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ కేటాయింపుల్లో చేరాయి. 2024 ఏప్రిల్‌ 1 నుంచి మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ లెక్కలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోకి వస్తున్నాయి. అంటే ఈ ఏడాది ఏప్రిల్‌ 1 నుంచి 2025 మార్చి 31 వరకు అమల్లో ఉండే మహాలక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది కేవలం రూ.3,082.53 కోట్లు మాత్రమే. అంటే నెలకు రూ.331.87 కోట్లు. ఈ స్కీంలోకే జర్నలిస్టులు, విద్యార్థులు సహా అన్నిరకాల బస్‌పాస్‌ రాయితీలన్నింటినీ కలిపేసినట్టు తెలుస్తుంది. నెలకు రూ.331.87 కోట్ల కేటాయింపు చొప్పున సంవత్సరానికి రూ.4,030.44 కోట్లు అవసరమవుతాయి. దీనిలో ప్రభుత్వం నేరుగా ఇచ్చే సొమ్ము రూ.3,082.53 కోట్లు కాగా, గిరిజన సంక్షేమ శాఖ రూ.370 కోట్లు, సాంఘీక సంక్షేమ శాఖ ద్వారా రూ.631 కోట్లు కలిపి మొత్తం రూ.4,030.44 కోట్లు కేటాయించారు. ఇంతకు మించి ఆర్టీసీకి అదనంగా ఎలాంటి కేటాయింపులు జరగలేదు. ఆర్టీసీ విస్తరణ, కొత్త బస్సుల కొనుగోళ్లకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు ఇవ్వలేదు. కార్మికులకు యాజమాన్యం చెల్లించాల్సిన పలురకాల బకాయిలకూ ఎలాంటి కేటాయింపులు లేవు. వేతన సవరణ ఊసు కూడా లేదు. ఆర్టీసీకి ప్రభుత్వ గ్యారెంటీ లేని రుణాల ఔట్‌స్టాండింగ్‌ 2024 మార్చి 31 నాటికి రూ.1,131.55 కోట్లు ఉన్నట్టు బడ్జెట్‌ లెక్కల్లో పేర్కొన్నారు. వీటిని ఆర్టీసీనే చెల్లించాల్సి ఉంది. ఆర్టీసీకి ఏమిచ్చినా...మహాలక్ష్మితోనే సరి అన్నట్టు ప్రభుత్వం వ్యవహరించింది.

అంగన్‌వాడీ కేంద్రాలు ప్లేస్కూళ్లా? ప్రీస్కూళ్లా?

- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆందోళన
- సీఎం, డిప్యూటీ సీఎం ప్రకటనలతో గందరగోళం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

'చిన్న పిల్లలకు సొంత గ్రామాల్లోనే సౌకర్యవంతంగా ఉండేలా ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతాం. వాటిలో మూడో తరగతి వరకు విద్య అందించే దిశగా చర్యలు చేపడతాం. ప్రతి కేంద్రంలో విద్యాబోధనకు ఒక టీచర్‌ను నియమిస్తాం. నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్‌ స్కూళ్లను త్వరలో ఏర్పాటు చేస్తాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు.'బాలబాలికలకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు విద్యను కూడా అందించాలనే సంకల్పంతో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్లుగా మార్చాలని నిర్ణయించాం.'అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ ప్రసంగంలో అన్నారు.మేధావులు, విద్యావేత్తలతో సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూళ్లుగా మారుస్తామంటూ ప్రకటించారు. బడ్జెట్‌ ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్లుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రెండు నిర్ణయాలను ప్రకటించడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ విద్య వరకే పరిమితం చేయాలని కోరుతున్నారు. ప్రాథమిక పాఠశాలలకు అంగన్‌వాడీలను అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం అంగన్‌వాడీలను ప్లేస్కూళ్ల తరహాలో చేస్తామని ఒకసారి, ప్రీస్కూళ్లుగా మారుస్తామంటూ ప్రకటించడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వ ప్రాథమిక విద్య ప్రమాదంలో పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్లేస్కూళ్ల తరహాలో మార్చి మూడో తరగతి వరకు అంగన్‌వాడీల్లో బోధన సాగిస్తే కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడే అవకాశముందంటూ ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం (ఎన్‌ఈపీ-2020)లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన సాగించాలన్న నిర్ణయానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చినట్టుగా తెలుస్తున్నది.

మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్‌ వార్డెన్‌ సస్పెండ్‌

- బాలికపై లైంగికదాడి ఘటనపై విచారణ
- ముగ్గురు సభ్యులతో నిజ నిర్ధారణ జాయింట్‌ కమిటీ
- హైదరాబాద్‌ కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి ఆదేశాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో / నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

హైదరాబాద్‌ మలక్‌పేటలో ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలో 8 ఏండ్ల బాలికపై లైంగికదాడి ఘటనలో హాస్టల్‌ వార్డెన్‌ను సస్పెండ్‌ చేస్తూ కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి అంధ బాలికల పాఠశాల హాస్టల్‌ ఇన్‌చార్జి వార్డెన్‌ బి.స్వప్నను హైదరాబాద్‌ కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి సస్పెండ్‌ చేశారు. అలాగే, పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వడానికి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి జాయింట్‌ కమిటీని ప్రభుత్వం నియమించిందని కలెక్టర్‌ తెలిపారు. ఈ జాయింట్‌ కమిటీలో చైర్మెన్‌గా వికలాంగుల సాధికారత శాఖ డైరెక్టర్‌, కమిషనర్‌ బి.శైలజ, సభ్యులుగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డి.ఆశన్న, వికలాంగుల సాధికారత శాఖ సహాయ సంచాలకులు ఏ.రాజేందర్‌ను నియమించినట్టు చెప్పారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌ జిల్లాకు చెందిన బాలిక(8) మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్‌లోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నది. ఈ నెల 7న బాలికకు రక్తస్రావం కావడంతో హాస్టల్‌ వార్డెన్‌.. తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. బాధితురాలిని చికిత్స కోసం నిలోఫర్‌ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు బాలికపై లైంగిక దాడి జరిగిందని నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు 16న హాస్టల్‌ స్కావెంజర్‌పై అనుమానంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ఘటనపై మంత్రి సీతక్క ఆగ్రహం

మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో జరిగిన లైంగిక దాడి ఘటనపై పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్‌ దనసరి అనసూయ(సీతక్క) ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహ వార్డెన్‌ను సస్పెండ్‌ చేయాలనీ, ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. లైంగిక దాడి ఘటన తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారుల నుంచి సీతక్క నివేదికను కోరారు. బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఘటనతో సంబంధం ఉన్న, విధుల పట్ల అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలికి సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు.

లోక్‌సభ్‌ మాజీ స్పీకర్‌ సోమనాథ్‌ ఛటర్జీకి నివాళి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌ వర్షాకాల సమావేశాల నాలుగో రోజైన గురువారం ముందుగా లోక్‌సభ మాజీ స్పీకర్‌ సోమనాథ్‌ ఛటర్జీకి నివాళ్లర్పించారు. ఆయన జయంతి సందర్భంగా పార్లమెంట్‌లోని సోమనాథ్‌ చటర్జీ చిత్రపటానికి లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్‌ హరివంశ్‌ నారాయణ్‌ సింగ్‌, ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశాలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష 'ఇండియా' ఫోరం నేతలు ఆందోళన చేపట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ ప్రవేశపెట్టిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఇండియా ఫోరం ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. సభ్యుల గందరగోళం మధ్యే సమావేశాలు కొనసాగాయి.

విద్యారంగానికి రూ.21,292 కోట్లు

- ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కంటే తగ్గిన కేటాయింపులు
- 15 శాతం కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ
- పూర్తిస్థాయి బడ్జెట్‌లో 7.31 శాతం నిధులు ప్రతిపాదన
- తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ.500 కోట్లు
- విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులకు రూ.500 కోట్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 2024-25లో పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,292 (7.31 శాతం) కోట్లు కేటాయించింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు రూ.21,389 (7.75 శాతం) కోట్లు ప్రతిపాదించింది. అంకెల్లో చూసినా, శాతంలో చూసినా ప్రస్తుత బడ్జెట్‌లో విద్యకు నిధుల కేటాయింపు తగ్గింది. 2023-24 బడ్జెట్‌లో విద్యకు రూ.190,51.25 (6.56 శాతం) కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే విద్యారంగానికి నిధులు పెరగడం గమనార్హం. అంకెల్లో చూస్తే రూ.2,241 కోట్లు, శాతంలో చూస్తే 0.75 శాతం నిధులు పెరిగాయి. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ అందుకనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం గమనార్హం. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా 15 శాతం నిధులైనా కేటాయించాలి. కానీ అందులో సగం కూడా కేటాయించకపోవడం గమనార్హం. మొత్తం బడ్జెట్‌లో విద్యకు 15 శాతం అయితే రూ.43,673.85 కోట్లు, 10 శాతం అయితే రూ.29,115.9 కోట్లు కేటాయించాలి. ప్రతి మండలానికి అధునాతనమైన సౌకర్యాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపింది.

త్వరలోనే వీసీల నియామకం

గత ప్రభుత్వం విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాలరాసిందని బడ్జెట్‌లో ప్రభుత్వం విమర్శించింది. చాలాకాలం పూర్తికాలపు వీసీలను నియమించకుండా ఇన్‌చార్జీల నియామకంతో కాలం గడిపిందని తెలిపింది. దానివల్ల వర్సిటీల పాలన, విద్యావ్యవస్థ అస్తవ్యస్థమైందని పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పూర్తికాలపు వీసీలను నియమించడానికి సెర్చ్ కమిటీ వేసిందని ప్రకటించింది. త్వరలోనే ఈ నియామకాలను పూర్తి చేస్తామని తెలిపింది. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో ఉస్మానియాకు రూ.వంద కోట్లు, మహిళా విశ్వవిద్యాలయానికి రూ.వంద కోట్లు, మిగతా రూ.300 కోట్లు కాకతీయతోపాటు ఇతర విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల సదుపాయాల కోసం కేటాయించింది.

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఐటీఐల్లో ఆరు కొత్త కోర్సులు

రాష్ట్రంలో 65 ఐటీఐలను ప్రయివేటు సంస్థల సహకారంతో నైపుణ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళికలో భాగంగా టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని ప్రభుత్వం ప్రకటించింది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఆరు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపింది. 5,860 మంది విద్యార్థులు ఏటా శిక్షణ పొందుతారని వివరించింది. శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పనలో టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకరిస్తుందని ప్రకటించింది.

2024-25 బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు (రూ.కోట్లలో...)

విభాగం	కేటాయింపు నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం
పాఠశాల విద్య	రూ.14,929.82	రూ.3,001.59	రూ.17,931.41
ఉన్నత విద్య	రూ.2,242.05	రూ.617.05	రూ.2,859.1
సాంకేతిక విద్య	రూ.476.53	రూ.14.11	రూ.490.64
మొత్తం	రూ.17,648.4	రూ.3,632.75	రూ.21,281.15

విద్యారంగానికి ఏటా బడ్జెట్ కేటాయింపులు (కోట్లలో...)

ఆర్థిక సంవత్సరం	మొత్తం బడ్జెట్	విద్యకు కేటాయింపు	శాతం
2024-25	రూ.2,91,159	రూ.21,292	7.31
2023-24	రూ.2,90,296	రూ.19,051	6.56
2022-23	రూ.2,56,958	రూ.16,043	6.24
2021-22	రూ.2,30,825	రూ.13,564	5.88
2020-21	రూ.1,82,914	రూ.12,127	6.63
2019-20	రూ.1,46,492	రూ.9,899	6.76
2018-19	రూ.1,74,453	రూ.13,278	7.61
2017-18	రూ.1,49,646	రూ.12,705	8.49
2016-17	రూ.1,30,415	రూ.10,738	8.23
2015-16	రూ.1,15,689	రూ.11,216	9.69
2014-15	రూ.1,00,637	రూ.10,956	10.88

వైద్యారోగ్యానికి తగ్గిన కేటాయింపులు

- గతేడాది కన్నా రూ.693 కోట్లు తక్కువ
- రాష్ట్ర బడ్జెట్‌లో 3.9 శాతమే
- 8 శాతం కేటాయించాలంటున్న నిపుణులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్యశాఖకు కేటాయింపులు తగ్గాయి. ఈ రంగానికి గతేడాది కన్నా రూ.693 కోట్లు తగ్గించారు. వైద్యఖర్చులు భారంగా మారిన క్రమంలో ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి కనీసం 8 శాతం కేటాయించాలని నిపుణులు, ప్రజారోగ్య ఉద్యమకారులు కోరుతున్నా... నాలుగు శాతానికి మించడం లేదు. వైద్యారోగ్య రంగానికి కేటాయింపుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అడుగులేసింది. ఈ శాఖకు కేటాయింపులు చూస్తే గత పదేండ్లలో 2014-15లో 4.1 శాతం, 2015-16లో 3.9 శాతం, 2016-17లో 4.1 శాతం, 2017-18లో 4.2 శాతం, 2018-19లో 4 శాతం, 2019-20లో 4.3 శాతం నిధులను కేటాయించింది. గతేడాది వైద్యారోగ్యశాఖకు రూ.12,161 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ.11,468 కోట్లు (3.9 శాతం) ఇచ్చింది. వైద్యారోగ్య బడ్జెట్‌లో కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, సామాగ్రి, ప్రజల ఆరోగ్య బీమా, నర్సింగ్ కాలేజీల నిర్మాణం ప్రాధాన్యతనిచ్చారు. అదే సమయంలో పాత మెడికల్ కాలేజీల బడ్జెట్‌ను భారీగా తగ్గించారు. గత బడ్జెట్‌లో డీఎంఈకి 31 శాతం ఉండగా ఈ బడ్జెట్‌లో అది కాస్తా 42 శాతానికి పెరిగింది. రూ.4,844 కోట్లు వైద్యవిద్య సంచాలకుల పరిధిలో వాటికి ప్రతిపాదించారు. కొత్త మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరతపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని జాగ్రత్త పడ్డారు. డీఎంఈ పరిధిలో ప్రగతి పద్ద కింద రూ.1,948 నుంచి రూ.2,656, నిర్వహణ ఖర్చులను రూ. 1,723 నుంచి రూ.2,188 కు పెంచారు. ఆరోగ్యశ్రీ పరిధిలో చేసే చికిత్సల రేట్లను సవరించిన నేపథ్యంలో ఈహెచ్ఎస్‌కు రూ.52 కోట్ల నుంచి రూ.211 కోట్లకు, జేహెచ్ఎస్‌కు రూ.11 కోట్ల నుంచి రూ.45 కోట్లకు పెంచుతూ ఆరోగ్యశ్రీకి మొత్తంగా రూ.344 కోట్ల నుంచి రూ.695 కోట్లకు పెంచారు. ఆరోగ్యశ్రీకి వైద్యారోగ్యశాఖ బడ్జెట్‌లో గతేడాది 3.4 శాతం కేటాయిస్తే ఈ ఏడాది 8 శాతం కేటాయించడం విశేషం. కొత్త నర్సింగ్ కాలేజీల నిర్మాణానికి రూ.260 కోట్లు కేటాయించారు.

గిరిజన ప్రాంతాలకు వెళ్లే వారిని ప్రోత్సహించాలి -డాక్టర్ కిరణ్ మాదల



రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్యశాఖలో ఉద్యోగులకు సకాలంలో జీతాల చెల్లించేందుకు చర్యలు తీసుకున్నారని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదల హర్షం వ్యక్తం చేశారు. కొత్త మెడికల్ కాలేజీల్లో సౌకర్యాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పన వాటికి ప్రాధాన్యతనివ్వడం ముదావహమన్నారు. మారుమూల, గ్రామీణ మెడికల్ కాలేజీల్లో పని చేసే బోధనా సిబ్బందికి వేతనాలు పెంచితే హైదరాబాద్‌కు రోగుల రద్దీ తగ్గుతుందని సూచించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ చికిత్సల లభ్యత పెరిగి రోగులకు అందుబాటులో వైద్యం అందుతుందని తెలిపారు.

మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్ పెంచడం హర్షణీయం : ఆవాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో తగిర విధంగా కేటాయింపులు చేయటం హర్షణీయమని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకనుగుణంగా కేటాయింపులు జరగలేదని తెలిపారు. కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలని కోరారు. గత బడ్జెట్ తో పోలిస్తే మైనార్టీ సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారని పేర్కొన్నారు. కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయలేదని గుర్తు చేశారు. ఈ ఒరవడికి భిన్నంగా ఉండాలని కోరారు. కేటాయించిన బడ్జెట్‌లో అధిక భాగం విద్య, ఉపాధి రంగాలపై ఖర్చు చేయడం ద్వారా మైనార్టీలు అభివద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఆ పద్ధతులలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లోన్లు , స్కాలర్‌షిప్‌లు, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల పై కేంద్రీకరించి ఖర్చు చేయాలని కోరారు.

గిరిజన హామీలకు తిలోదకాలిచ్చిన బడ్జెట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గిరిజనులకు ఇచ్చిన హామీలన్నిటినీ 100 రోజుల్లో అమలు చేస్తామన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే గిరిజనులను మోసం చేసిందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీరాం నాయక్ గురువారం ఒక ప్రకటనలు విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్‌తోపాటు ఎన్నికల ప్రణాళికలో గిరిజనులకు 15 రకాల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీలలో కొన్నింటినైనా అమలు చేయటానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూసిన గిరిజనులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా ఏమీ లేదని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో గిరిజన సంక్షేమానికి రూ.17,056 కోట్లు కేటాయించామని గొప్పగా చెప్పడం వాస్తవం కాదని తెలిపారు. గిరిజన సంక్షేమానికి ప్రగతి పద్దులో వాస్తవ కేటాయింపులు రూ.14,457 మాత్రమేనని పేర్కొన్నారు. సబ్ ప్లాన్ నిధుల్లో ఇతర శాఖలు కేటాయించిన వాటిని గిరిజన సంక్షేమ శాఖలో కలిపి పెంచామని చెప్పి అంకెలు గారేడికి పాల్పడిందని విమర్శించారు. బడ్జెట్‌లో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగ బద్ధంగా కేటాయించాల్సిన సబ్ ప్లాన్ నిధులను కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం రాష్ట్ర రెవెన్యూ వ్యయం రూ.2,20,945 లక్షల కోట్లలో గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం (10శాతం) రూ.22వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా గిరిజన సంక్షేమానికి కేటాయించిన నిధులతో కలిపి కేవలం రూ.17,056 కోట్లు మాత్రమే కేటాయించడం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటమేనని విమర్శించారు. ట్రై కార్ సంస్థ ద్వారా గిరిజనులందరికీ 90 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తామన్న ప్రభుత్వం గత ప్రభుత్వం కేటాయించిన రూ.426 కోట్లలో తగ్గించి ఈ ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో అంబేద్కర్ అభయస్తం పేరుతో ప్రతి గిరిజన కుటుంబానికి గిరిజన బంధు తరహాలో రూ.12 లక్షల రుణ సౌకర్యం కల్పిస్తామన్న హామీకి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. సమ్మక్క సారక్క గ్రామీణ అభివృద్ధి పథకం కింద ప్రతి గూడెం, తండా గ్రామపంచాయతీలకు ప్రతి ఏటా రూ.25 లక్షలు ఇచ్చే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తామన్న హామీని గాలికొదిలేశారని ఆరోపించారు. మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధి కోసం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఐదు ఐటీడీఏలను ఏర్పాటు చేస్తామన్న హామీకి బడ్జెట్‌లో కేటాయింపులే చేయలేదని తెలిపారు. గిరిజనులకు ప్రత్యేకంగా హక్కుల కమిషన్ ఏర్పాటు వంటి హామీలపై కనీస గ్యారెంటీ కూడా ఇవ్వకుండా గిరిజనులకు మోసం చేసిందని విమర్శించారు.



వికలాంగుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం

- నేడు రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్‌పై ఎన్‌పీఆర్‌డీ నిరసనలు

ఆసరా పెన్షన్లకు బడ్జెట్‌లో చోటేది?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో వికలాంగుల పట్ల పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసరా పెన్షన్లకు బడ్జెట్‌లో చోటేదని ప్రశ్నించారు. రూ. 2,91,159 కోట్ల బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించక పోవటం వారిని కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపుతో చూస్తున్నట్టు అర్థమైందని పేర్కొన్నారు. బడ్జెట్‌ను సవరించి ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల పట్ల నిర్లక్ష్యానికి నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్ పత్రాలు దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చేసిన బడ్జెట్ ప్రసంగంలో 137 అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారనీ, కానీ.. ఆ ప్రసంగంలో ఎక్కడా వికలాంగుల ప్రస్తావన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 12.02శాతం ఉన్న వికలాంగుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి ఎపాటిదో అర్థమవుతున్నదని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణఅభివృద్ధి శాఖకు రూ.29,816 కోట్లు కేటాయించారనీ, ఈ కేటాయింపులతో ఆసరా పెన్షన్ల పెంపు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వికలాంగుల పింఛన్‌ను రూ.ఆరువేలకు, ఇతర పింఛన్లు నాలుగు వేలకు పెంచేందుకు ఎందుకు నిధులు కేటాయించలేదని నిలదీశారు. వికలాంగుల రుణాలు, సహాయ పరికరాలు, స్కాలర్ షిప్‌లు వంటి వాటికి నిధులు ఎందుకు కేటాయించలేదని తెలిపారు. అభయ హస్తం ఆరు గ్యారంటీలలో చేయూతకు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఆదాయాన్ని తగ్గించుకునేందుకు సంస్కరణలు అమలు చేస్తామని ఆర్థిక మంత్రి చెప్పడమంటే సంక్షేమ పథకాలను రద్దు చేయాలనే కుట్ర దాగి ఉందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు రూ.3,836 కోట్లు కేటాయించారనీ, దీంతో వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వడం ఆచరణలో సాధ్యం కాదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిధుల కోతకు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బడ్జెట్ ప్రతుల దగ్గంను జయప్రదం చేయాలని పనిలుపునిచ్చారు.

భారీ బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమం మాటేది?

- ఇది కార్మిక వ్యతిరేక బడ్జెట్ : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్‌లో కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం గురించి ప్రస్తావన లేకపోవడాన్ని సీఐటీయూ రాష్ట్ర కమిటీ తప్పుబట్టింది. గురువారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి కల్పన, రిక్రూట్‌మెంట్ పాలసీ విధానాన్ని ప్రస్తావించలేదని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రస్తావన కానీ, ప్రభుత్వోద్యోగులకు రెండో పీఆర్సీ ప్రకటనగానీ చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెసు పార్టీ మ్యానిఫెస్టోలో కార్మికుల సంక్షేమం కోసం పెట్టిన అంశాలు ఈ బడ్జెట్‌లో లేవని పేర్కొన్నారు. బీడీ కార్మికులకు "చేయుత" జీవిత బీమా ఈఎస్ఐ, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, దీనికి బడ్జెట్‌లో కేటాయింపులు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డైవర్లు, స్విగ్గి జోమాటో కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ రాజస్థాన్ తరహా చట్టాన్ని తెస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విషయం మర్చిపోయారని తెలిపారు. అదే విధంగా చిరువ్యాపారులు, పుట్ పాత్ వ్యాపారులకు వడ్డీలేని రుణ సదుపాయం కల్పిస్తానన్న వాగ్దానాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. తెలంగాణలో 19.7శాతం పారిశ్రామిక రంగం పై 33 శాతం మంది సర్వీస్ రంగంపై ఆధారపడి బతుకుతున్నారని బడ్జెట్‌లో కంటితుడుపుగా చెప్పారన్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాలు జి.వోల సవరణ బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని తెలిపారు. అభయ హస్తం పేరుతో వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్స్ ఏర్పాటు, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, హెల్త్ కార్డులతో సహా ప్రతి మండలంలో "హమాలీనగర్" ఏర్పాటు చేస్తామని చెప్పినా వాటి గురించి ప్రస్తావనే లేదని వివరించారు. మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు గ్రామ పంచాయతీ కార్మికుల, మధ్యాహ్నభోజన కార్మికుల, బకాయి వేతనాలు చెల్లింపునకు సంబంధించి ఎలాంటి చర్యలు ఈ బడ్జెట్‌లో తీసుకోలేదని విమర్శించారు. పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పించే చర్యలే లేవని పేర్కొన్నారు. కార్మికులు తమ పరిష్కరించుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రజా పంపిణీ వ్యవస్థకు రూ.3,836 కోట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థకు రూ.3,836 కోట్లు కేటాయించారు. 2010-11 నుంచి 2022-23 మధ్యలో దాదాపు వెయ్యి మంది మిల్లర్లు ప్రభుత్వానికి రూ.3 వేల కోట్లు బకాయి పడినట్టు . గత ఆరు నెలలుగా విజిలెన్స్ విభాగం అలాంటి మిల్లర్లపై దాడులు చేసి వారి నుంచి రూ.450 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. రూ.509 కోట్ల బకాయిలు వసూలు చేసేందుకు 60 మిల్లులపై రికవరీ రెవెన్యూ చట్టాన్ని ప్రయోగించినట్టు బడ్జెట్ లో పేర్కొన్నారు. వేగవంతమైన కొత్త వ్యూహాలతో భారత ఆహార సంస్థతో గత మూడు నెలల్లో రూ.3,561.64 కోట్లు సంపాదించి, రూ.1,323.86 కోట్ల బకాయి రుణాన్ని తగ్గించినట్టు తెలిపారు. దీంతో పౌరసరఫరాల శాఖలో సేవలు మెరుగుపడ్డాయని ప్రభుత్వం వెల్లడించింది.

బీజేపీ చెబితేనే సభకు కేసీఆర్

హడావుడిగా వచ్చి.. అంతే హడావుడిగా వెళ్లిపోయారు

- కేంద్ర బడ్జెట్‌పై చర్చలో మాజీ సీఎం ఎందుకు పాల్గొనలేదు..?: విలేకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- చిత్తశుద్ధి ఉంటే అన్నీ సాధ్యమేనంటూ వ్యాఖ్య
- సంస్కరణలు తీసుకొస్తాం : శ్రీధర్‌బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇప్పటి వరకూ అసెంబ్లీకి రాని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్.. ఇప్పుడు బీజేపీ చెబితేనే వచ్చారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సభలో చర్చ జరిగినప్పుడు కూడా ఆయన అసెంబ్లీకి హాజరు కాలేదని గుర్తు చేశారు. ఆ చర్చలో కేసీఆర్ పాల్గొని, ప్రభుత్వానికి సూచనలు, సలహాలనిస్తే బావుండేదని వ్యాఖ్యానించారు. మోడీ సర్కార్ తెలంగాణపై వివక్ష చూపటాన్ని నిరసిస్తూ తాము తీర్మానం చేసిన దరిమిలా...'అక్కడేదో జరిగేట్టుంది, మీరు అర్జెంటుగా సభకు వెళ్లండంటూ బీజేపీ సూచించింది కాబోలు.. అందుకే కేసీఆర్ సభకు వచ్చారు...' అని ఎద్దేవా చేశారు.

గురువారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రతిపాదించిన అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌తో కలిసి భట్టి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. బడ్జెట్ ప్రతిపాదించే సమయంలో కేసీఆర్ హడావుడిగా సభకు వచ్చారనీ, అంతే హడావుడిగా వెళ్లిపోయారని అన్నారు. తన ప్రసంగం పూర్తయ్యే వరకూ సభలో ఉండకుండా బయటకెళ్లి (మీడియా పాయింట్ వద్ద) ప్రెస్‌మీట్ పెడితే ఎలా అని ప్రశ్నించారు. బడ్జెట్ ప్రసంగాన్ని కేసీఆర్ పూర్తిగా వింటే తమ ప్రభుత్వం ఏం చేస్తోందనే విషయం ఆయనకు అర్థమయ్యి ఉండేదని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు కోసం రూ.17,700 కోట్లను కేటాయించి, ఒక్క రూపాయి విడుదల చేయలేదని భట్టి ఈ సందర్భంగా విమర్శించారు. అలాంటిది కేసీఆర్ ఆ పథకం గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వం మాదిరిగా తాము దారి మళ్లించబోమని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు ఎన్నడూ లేని విధంగా రూ.10 వేల కోట్లను కేటాయించామని తెలిపారు. ఇక్కడ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి పరుస్తామని చెప్పారు. తద్వారా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే మానవ వనరులను, నైపుణ్యాలను మెరుగుపరుస్తామని అన్నారు. హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్శిటీ (యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ) ఏర్పాటు అనేది ముందు చూపుతో తీసుకున్న నిర్ణయమని వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తమ ప్రభుత్వం పెద్ద పీట వేయనుందని వివరించారు. రుణమాఫీపై అందరూ పలు సందేహాలను వ్యక్తం చేశారనీ, అయినా దాన్ని అమలు చేసి చూపామని భట్టి ఈ సందర్భంగా చెప్పారు. అదే తరహాలో మిగతా పథకాలు, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ఆర్థిక వనరులు, ఆదాయ మార్గాలకు కావాల్సిన సంస్కరణలను తమ ప్రభుత్వం చేపట్టబోతోందని తెలిపారు. అందులో భాగంగా సర్కారు భూములను అమ్మబోతున్నారా..? అనే ప్రశ్నకు మాత్రం ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. విలేకర్ల సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

సంక్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజానుకూల బడ్జెట్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రూ.6.71 లక్షల కోట్ల అప్పున్న సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలోనూ రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంతోషదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72 వేల కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న సానుకూలతకు అద్దం పడుతున్నదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజక వర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మొత్తం 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేస్తామంటూ ప్రకటించడం మంచి పరిణామమని తెలిపారు. విద్యావైద్య రంగాలకు మరికొంత నిధులు కేటాయించాలని కోరారు. నిరుద్యోగ సమస్యను నివారించడానికి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, హమాలీ వంటి అసంఘటిత రంగానికి చెందిన వారిని ఆదుకోవడానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అప్పులున్నా వివిధ రంగాలకు మంచి కేటాయింపులు చేయడం పట్ల సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలపై భారం మోపే బడ్జెట్ : న్యూడెమోక్రసీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై అంతులేని పన్నుల భారాన్ని మోపేదిగా ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. రాష్ట్ర పురోభివృద్ధికి తోడ్పడేదిగాలేదని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగం, పేదరికాన్ని నిర్మూలించడానికి ఏమాత్రం దోహదపడదని పేర్కొన్నారు. వచ్చే ఆదాయాన్ని, అయ్యే ఖర్చును లెక్కిస్తే వ్యత్యాసం ఉందని వివరించారు. ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం అనివార్యంగా ప్రజలపై భారాలు మోపుతారని తెలిపారు. ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు.

అంకెల గారడీ బడ్జెట్ : ఎంసీపీఐ(యూ)

రాష్ట్ర బడ్జెట్‌లో సమతుల్యత, శాస్త్రీయత లోపించిందని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. అంకెల గారడీ తప్ప మరేమీ లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ల జేబులు నింపే బడ్జెట్ తప్ప ప్రజల బడ్జెట్ కాదని తెలిపారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నిలదీయాలనీ, ఆందోళనలు చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వాస్తవ పరిస్థితులకు బడ్జెట్ ప్రతిబింబం

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనివ్వాలి

- వ్యవసాయానికి కేటాయింపులు అభినందనీయం
- కౌలు రైతుల ప్రస్తావనేది?
- సవరణలు అవసరం : అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం 2024-25న వార్షిక బడ్జెట్ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రూపొందించిందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభినందించారు. అయితే విద్య, వైద్యానికి మరింత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కీలకమైన వ్యవసాయరంగానికి భారీ కేటాయింపులపై హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయం చేసే వారికే రైతుభరోసా ఇవ్వాలని ప్రాతపాదించడం బాగుందనీ, అయితే కౌలురైతుల ప్రస్తావన లేదని గుర్తుచేశారు. ఉరుములు, మెరుపులు లేకుండా ప్రశాంతంగా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ అయినప్పటికీ కొన్ని సవరణలు చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. గురువారం శాసనమండలి మీడియాపాయింట్ వద్ద ఆయన మాట్లాడారు.

విద్యాశాఖకు బడ్జెట్‌లో 7.5 శాతం కేటాయించారని తెలిపారు. ఇవి కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా, శిశు సంక్షేమ, వ్యవసాయ, వైద్యారోగ్య శాఖల పరిధిలో విద్యకు కూడా కేటాయించినవి కలుపుకుంటే ఇది పెరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వం కన్నా ఈ కేటాయింపులు మెరుగ్గా ఉన్నాయని స్వాగతించారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలకు రూ.500 కోట్లు కేటాయించినా ఖర్చు చేయలేదని గుర్తుచేశారు. తాజా బడ్జెట్‌లోనూ రూ.500 కేటాయించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా వాటిని మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయాలని కోరారు.

మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్ వాడీల్లో ప్రీ స్కూల్స్‌ను ప్రారంభిస్తామనే ప్రభుత్వ ఆలోచనను తిరిగి సమీక్షించుకోవాలని సూచించారు. అంగన్ వాడీల్లో ప్రీ స్కూల్స్‌ను తల్లిదండ్రులు ఇష్టపడటం లేదనీ, వారంతా ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీ ప్రైమరీ ఉండాలని కోరుకుంటున్నారని చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాల్లో చాలా వరకు అద్దె భవనాల్లో ఉన్నాయని గుర్తుచేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఏర్పాటు చేసి అక్కడ అవసరమైన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను నియమించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను పెంచాలని అలుగుబెల్లి ప్రభుత్వానికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్నదని చెప్పారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 82 శాతం మంది విద్యార్థులు ప్రయివేటు బడులకు వెళ్తుంటే 18 శాతం మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారని ఉదహరించారు. కులాల ఆధారంగా హాస్టళ్ల స్థానంలో అన్ని కులాల వారికి ఒకే దగ్గర చదువు చెప్పేలా ఇంటిగ్రేటెడ్ వ్యవస్థను తీసుకురావాలనే ఆలోచన బాగుందని కితాబిచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తారనే విషయంపై స్పష్టతనివ్వాలని కోరారు. అదే విధంగా హైదరాబాద్ నాలుగు వైపులా టిమ్స్ ఆస్పత్రుల ద్వారా ఏ విధంగా సేవలందిస్తారో చెప్పాలన్నారు. జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బడ్జెట్‌పై ఉద్యోగుల గుర్రు!

పీఆర్సీ, పెండింగ్ డీఏల ప్రస్తావన లేదు

- సీపీఎస్ రద్దుపైనా స్పష్టత కరువు
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీల అమలేదీ
- మొదటి తారీఖున జీతాలిస్తున్నామన్న ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి కుంటుపడిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం పెనుసవాల్. తలకుమించిన రుణభారం ఉన్నప్పటికీ, దుబారా ఖర్చులు కట్టడి చేసి ఆర్థిక క్రమశిక్షణతో పాలన ప్రారంభించాం. తద్వారా ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు సకాలంలో జీతాలు చెల్లించడానికి వెసులుబాటు కలిగింది. ఈ ఏడాది మార్చి నుంచి 3.69 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 2.87 లక్షల పెన్షన్‌దారులకు క్రమం తప్పకుండా ప్రతినెలా మొదటి తారీఖున జీతాలు, పెన్షన్లు చెల్లించడానికి మా ప్రభుత్వం చర్యలు తీసుకుంది'అని బడ్జెట్ ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

రాష్ట్రంలోని ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలిస్తున్నామంటూ ప్రభుత్వం ప్రకటించింది. కానీ వారు ఎదుర్కొంటున్న సమస్యలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. దీంతో వారు ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారు. పీఆర్సీ కమిటీ చైర్మెన్‌గా శివశంకర్, సభ్యుడు బి రామయ్యను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. పీఆర్సీపై కసరత్తును ప్రారంభించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. కానీ ఇంత వరకు నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించలేదు. గతేడాది జులై ఒకటో తేదీ నుంచి రెండో పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదు శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పీఆర్సీ గురించి, ఫిట్‌మెంట్ గురించి బడ్జెట్‌లో ఏమైనా ప్రకటన వస్తుందని ఆశించారు. కానీ దాని ప్రస్తావన లేకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి చెల్లింపుపైనా ప్రభుత్వం బడ్జెట్‌లో ఏమైనా ప్రకటిస్తుందని భావించారు. కానీ నిరాశే ఎదురైంది. వాటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఈ-కుబేర్‌లో వివిధ రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి గురించి ప్రస్తావించలేదు. మొదటి తారీఖున జీతాలిస్తున్నామనే మాట తప్ప వారి సమస్యలను ఏవీ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరిస్తామంటూ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. బడ్జెట్‌లో ప్రసంగంలో దాని గురించి ఏమైనా ప్రస్తావన ఉంటుందేమోనని ఆశించారు. కానీ ఉద్యోగులకు భంగపాటు ఎదురైంది.

వైద్యారోగ్య రంగానికి మొండిచేయి

- రాష్ట్ర బడ్జెట్‌పై టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్లో వైద్యారోగ్య రంగానికి మొండిచేయి చూపించిందని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) విమర్శించింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్య రంగానికి కేటాయించిన రూ.11,468 కోట్లు జీతాలకు కూడా సరిపోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 10 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ శాఖ పరిధిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ తదితర పేర్లతో లక్షన్నర మందికిపైగా ఉద్యోగులు సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రతి 20 వేల మందికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలనీ, రాష్ట్రంలో 1,750 కేంద్రాలు అవసరముండగా కేవలం 885 మాత్రమే ఉన్నాయని తెలిపారు. వీవీపీ పరిధిలో 179 ఆస్పత్రులు, డీఎంఈ పరిధిలో 34 మెడికల్ కాలేజీలు, 15 టీచింగ్ హాస్పిటళ్లతో పాటు ఎన్‌హెచ్ఎం, 104 ఎఫ్ డీహెచ్ఎస్, 108 ఎమర్జెన్సీ, 102, తదితర పథకాలు అమల్లో ఉన్నాయని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం జరుగుతుం డటంతో రాబోయే కాలంలో కార్మికులు, ఉద్యోగుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. ఇంతటి కీలకశాఖకు బడ్జెట్‌లో 3.9 శాతం, జీఎస్డీపీలో 0.7శాతం కేటాయిస్తారా? అని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలను బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించలేదని ఆక్షేపించారు. స్కీంలలో పని చేస్తున్న వారిని పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉద్యోగుల పీఆర్సీపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ఎంలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్డీ ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్‌ను పట్టించుకోలేదని తెలిపారు.

ఏఎన్ఎంల బకాయి వేతనాలు రూ.33 కోట్లకు పెరిగినా బకాయిలు చెల్లించలేదని గుర్తుచేశారు. ఎన్ హెచ్ఎంలో 17 వేల మందిలో నాలుగు వేల మందికి ఆరు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదని తెలిపారు. గతంలో కాంగ్రెస్ తెచ్చిన 104 సేవలను బీఆర్ఎస్ సర్కారు రద్దు చేసింది. ఆ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దాదాపు 800 మంది ఆరోగ్యమిత్రలకు 4వ తరగతి వేతనాలు ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. వారికి జీవో 60 ప్రకారం రూ.22,750 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని టీచింగ్ హాస్పిటల్స్, జనరల్ హాస్పిటల్స్ వైద్య విధాన పరిషత్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15,600 నిర్ణయించి కాంట్రాక్టర్ల ద్వారా రూ.11,000 మాత్రమే చెల్లిస్తుందన్నారు. అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 108 ఎమర్జెన్సీ అంబులెన్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ, జీతభత్యాలు పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టి సాక్స్, మలేరియా, ఫైలేరియా, టిబి తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లో ఆసక్తి చూపలేదని విమర్శించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను వైద్యారోగ్యశాఖలో విలీనం చేస్తామని గతంలో ఆరోగ్య మంత్రి చేసిన ప్రకటనను బడ్జెట్ ప్రసంగంలో విస్మరించారని తెలిపారు. వీవీపీలో పని చేస్తున్న వేల మంది పర్మినెంట్ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు, పదోన్నతులు లేవని తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 317 జీవో ఇబ్బందులు తొలగించాలనీ, 142 జీవో రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్య శాఖలోని సమస్యలపై అసెంబ్లీలో సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు.

మహిళల భద్రతకు బడ్జెట్‌లో భరోసా లేదు : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2024- 25 రాష్ట్ర బడ్జెట్‌లో మహిళల భద్రతకు భరోసా లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు. స్త్రీ ,శిశు సంక్షేమానికి, మహిళల భద్రతకు తగిన విధంగా నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. ఇందిరా జీవిత బీమా పథకం ద్వారా మహిళలకు రూ.10 లక్షల రూపాయలు బీమా సౌకర్యం కల్పించడం, స్వయం సహాయక సంఘాలకు రూ. రెండు లక్షలు, రుణ గ్రహీతల ఆకస్మికమృతికి రుణమాఫీ వంటి అంశాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. రూ. 2 లక్షల వడ్డీ లేని రుణమిస్తామని చెప్పటం కూడా హర్షించదగిందేనని పేర్కొన్నారు. కానీ ఈ పథకాలు అమలు జరగడానికి తగిన రీతిలో బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ఎన్నికల ముందు మహిళలకిచ్చిన హామీలు అమలు చేసే విధంగా నిధుల కేటాయింపులు జరగలేదని తెలిపారు. మహిళలకి నెలకు రూ. 2500లు, కళ్యాణ లక్ష్మి ద్వారా రూ.లక్ష నగదుతో పాటు, తులం బంగారం ఇస్తామనీ, గృహజ్యోతి పథకం పేదలందరికీ అమలు చేస్తామని చెప్పినదానికి అనుగుణంగా నిధుల కేటాయింపులు చేయలేదని పేర్కొన్నారు.

వారి బాటలోనే వీరు..

- బి.వి.యన్.పద్మరాజు

- రాబడులకు భిన్నంగా లెక్కలేసుకున్న విత్తమంత్రి
- ఆదాయ మార్గాలపై స్పష్టత కరువు
- అప్పులు, బకాయిలపై గందరగోళం

'ఆర్నెల్లు సావాసం చేస్తే వారు.. వీరవుతారు...' అంటూ మన పెద్దలు చెబుతుంటారు. కానీ అందుకు భిన్నంగా రాజకీయ ప్రత్యర్థి అయిన కేసీఆర్ సర్కారు తరహాలోనే ఇప్పటి రేవంత్ ప్రభుత్వం కూడా కొనసాగుతున్నట్టుగా అనిపిస్తోంది. ఆ చెప్పుల్లోనే కాళ్లు పెట్టి నడుస్తున్నట్టుగా కనబడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రేవంత్ సర్కారు ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను చూస్తే ఇదే విషయం తేటతెల్లమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల ఆదాయ వనరుల ద్వారా రూ.2,16,566 కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేసుకుంది. వచ్చింది మాత్రం రూ.1,69,089 కోట్లే. అంటే వేసుకున్న అంచనాల్లో రూ.47,000 కోట్లు తగ్గాయన్నమాట.

ఈ నేపథ్యంలో గత డిసెంబరులో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం... తాము వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్‌ను ప్రవేశపెడతామంటూ చెప్పుకొచ్చింది. కానీ అందుకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ పద్దు కింద రూ.2.75 లక్షల కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కానీ వాస్తవ ఆదాయాలు ఆ అంచనాలను అందుకునేలా లేవు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లెక్కల ప్రకారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తర్వాత గత ఏప్రిల్ నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కేవలం రూ.14,068 కోట్లు. మే నాటికి అది రూ.30,584 కోట్లకు చేరింది. వాస్తవాలు ఈ విధంగా ఉంటే ఓటాన్ అకౌంట్‌లో చూపిన రూ.2.75 లక్షల కోట్ల ఆదాయం సర్కారుకు ఎలా సమకూరుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పుడు దాన్ని మించి రూ.2.91 లక్షల కోట్లతో పద్దును ప్రవేశపెట్టటం గమనార్హం.

2023-24లో వచ్చిన మొత్తం ఆదాయానికి (రూ. రూ.1,69,089 కోట్లు) ఓ పది శాతమో, ఇరవై శాతమో పెంచి చూపితే అది కొంతలో కొంత సమంజసంగా ఉంటుంది. కానీ అంతకు మించి భారీ స్థాయిలో రూ.2.91 కోట్లతో పద్దును ప్రవేశపెట్టటం విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయమై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను ప్రశ్నించగా... 'మా ఆదాయ వనరులు మాకున్నాయి...' అంటూ సమాధానం దాటవేశారే తప్ప స్పష్టతనివ్వలేదు.

మరోవైపు కేంద్రం నుంచి రుణాల రూపంలో రూ.3,900 కోట్లు వస్తాయంటూ విత్తమంత్రి అంచనాలేసుకున్నారు. కానీ గత రెండు బడ్జెట్లను పరిశీలిస్తే ఆయన అంచనాలు తలకిందులయ్యే అవకాశాలే ఎక్కువగా కనబడుతున్నాయి. 2023-24 బడ్జెట్‌లో కేంద్రం నుంచి రూ.4,102 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే, అక్కడి నుంచి వచ్చింది కేవలం రూ.1,948 కోట్లే. దీన్నిబట్టే కేంద్రం నుంచి వచ్చే రుణాల పరిస్థితి ఏ విధంగా ఉందో విదితమవుతున్నది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో (2014లో) ఉమ్మడి రాష్ట్రంతో పోటీపడి... ఒక్క తెలంగాణకే రూ.లక్ష కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి గత పదేండ్ల కాలంలో కేసీఆర్ సర్కారు వాస్తవ ఆదాయాలతో నిమిత్తం లేకుండా భారీ అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో డాంబికాలకు పోయింది. అదేమంటే మనది ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రమంటూ కేసీఆర్ సమర్థించుకున్నారు.

వాస్తవంలో తేలిందేమంటే బీఆర్ఎస్ హయాంలో బడ్జెట్ కేటాయింపులు ప్రతీయేటా పెంచుకుంటూ పోయినా, ఖర్చు మాత్రం ఆ స్థాయిలో లేదు. ఈ అంశాన్నే ఆయుధంగా చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం 'వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్' అంటూ ప్రకటించింది. తీరా గురువారం నాటి పద్దును చూస్తే 'బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్' అని చెప్పుకోక తప్పటం లేదు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శుక్రవారం | జూలై 26, 2024 | www.navatelangana.com

డీసీపీకి బోనాల పండుగ ఆహ్వానం



నవతెలంగాణ - చంపాపేట్

డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌కు ఆలయ చైర్మెన్ టీ. సుధీర్, ఉపాధ్యక్షులు బాబురావు ఆధ్వర్యంలో గురువారం బోనాల పండుగ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ యాకుత్‌పురా నియోజకవర్గం కుర్మగూడ డివిజన్ పరిధిలోని మాదన్నపేట్‌లో ఈ నెల 28న బోనాల పండుగను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ బోనాల పండుగకు రావాలని డీసీపీకి ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి విరిగిన చెట్టు

ధ్వంసమైన ఆటో



నవతెలంగాణ-వనస్థలిపురం

అకాల వర్షానికి బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బీఎన్‌రెడ్డి చౌరస్తా ఆటో స్టాండ్ వద్ద చెట్టు విరిగిపడింది. దీంతో ఓ ఆటో ధ్వంసమైంది. వెంటనే ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి విరిగిపడిన చెట్టును అక్కడి నుండి డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు.

ప్రజా ప్రభుత్వం

జీహెచ్ఎంసీకి అధిక ప్రాధాన్యం ఇచ్చింది



• మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్య మిచ్చిందని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి తెలిపారు. గురు వారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జె ట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3065 కోట్లు కేటాయించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మేయర్ ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు అన్ని రంగంలో అభివృద్ధి సంక్షేమం రెండు సమానంగా బడ్జెట్‌లో కేటాయించడం మంచి పరిమాణం అని అన్నా రు. హైదరాబాద్ మౌలిక సదుపాయాలకు మొత్తం అభి వృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించడం పట్ల హైదరాబాద్ అభివృద్ధికి పెద్ద పీట వేశారని, మెరుగైన రవాణా వ్యవస్థను మెరుగుకు మెట్రో రైలు విస్తరణ కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్ల నుండి మూసి పరివాహక ప్రాం తాల్లో ప్రజలు మురికి కూపంగా ఉం డడం వలన వర్ష కాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యాధులు ప్రభలి అనా రోగ్యంతో బాధ పడుతున్నారన్నారు. మూసి అభివృద్ధికి రూ. 1500 కోట్లు కేటాయించి అభివృద్ధికి దోహదపడే విధంగా నిధులు కేటాయించడం శుభ పరిణామన్నారు. అంతర్జాతీయంగా హైదరాబాద్ నగరం మరింత గుర్తిం పు పొందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



• కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్

నవతెలంగాణ - మీర్‌పేట్

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా 45వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరీపై ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు సమన్వయంతో మొక్కలు నాటాలని కోరారు. మున్ముందు తరాలకు కాలుష్య రహిత సమాజం అందించిన వారవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాము, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



• చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి గురువారం ఉపేందర్ రెడ్డి ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు కాలనీ పరిసరాలతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల బెడద తలెత్తకుండా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు మందులను పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది నర్సింహ, రాంబాబు, రాజు, ఎన్టీఆర్ నగర్ ఫేస్ 2 అధ్యక్షులు రవి, కార్యదర్శి నాగరాజు, లక్ష్మణ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలపై ఉన్న

అక్రమ నిర్మాణాలను తొలగించాలని నిరసన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేటలో అసంపూర్తిగా ఉన్న నాళాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, నాళాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ గురువారం ప్రధాన రహదారిపై బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ గ్రామంలో పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న నాళాలు పూర్తిగా ఆక్రమణకు గురై పూడ్చుకపోయి వరద నీరు బయటకు వెళ్ళకుండా ఉందన్నారు. ఈ విషయంపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు.

గత ప్రభుత్వం నాలాపై కాలువల నిర్మాణం కోసం హెచ్ఎండిఏ నుండి రూ.64కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. దేవతాల గుట్ట నుండి బడంగ్‌పేట్ మీదుగా వెళ్తున్న నాలా పూర్తిగా ఆక్రమణకు గురైందని ఆరోపించారు. సర్వే నెంబర్ 59, 60లలో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయడం జరిగిందని, ఇలాంటి నిర్మాణాలు ఎన్నో ఉన్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న నాళాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి, జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మేయర్, బాలాపూర్ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో వారం రోజుల్లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నిరసనలో బడంగ్‌పేట్ మాజీ సర్పంచ్ నదికుడి యాదగిరి, బీజేవైఎం అధ్యక్షులు రాళ్ళగూడెం శ్రీనివాస్ రెడ్డి, చిత్రం శ్రీనివాస్, నర్సింగ్, పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చెత్త డంపింగ్ సమస్యకు పరిష్కారం లేదా..?



గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన చెత్త

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

జల్‌పల్లి మున్సిపల్ అంటేనే సమస్యలకు నిలయం. మున్సిపల్ ఏర్పడి 8 సంవత్సరాలు దాటిన నేటికీ చెత్త డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లేదు. ఈ విషయంపై అనేక సార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలను అందజేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ ఏర్పడి 8 సంవత్సరాలు దాటిన నేటికీ అనేక సమస్యలతో సతమతమవుతున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా చెత్త డంపింగ్ సమస్య, డ్రైనేజీలు, రోడ్లు తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్‌పల్లి సమీపంలో ఉన్న కార్గో రోడ్డు పక్కన ఉన్న బీజాన్ గుట్టపై మున్సిపల్ పరిధిలో ఉన్న పలు కాలనీల నుండి శానిటేషన్ సిబ్బంది సేకరించిన చెత్తను అక్కడ డంపు చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో ఉన్న చెత్తను మాత్రమే జీహెచ్ఎంసీకి తరలిస్తున్నారు. ఎక్కువ కాలనీల నుండి సేకరించిన చెత్తను బీజాన్ గుట్టపైకి తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ గుట్ట సమీపం నుండి మామిడి పల్లి గ్రామం నుండి జల్‌పల్లి పెద్ద చెరువులోకి వర్షపు నీరు ప్రవహించి చెరువులోకి చేరుతుందని, వర్షా కాలంలో డంపింగ్ యార్డు పక్కన ఉన్న వాగులో చెత్త చెదారం చేరటంతో చెరువు నీరంతా కలుషితం అవుతుందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డు నుండి బయటకు వచ్చిన దుర్వాసనతో ప్రజలకు విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. అంతే కాకుండా చెత్తా చెదారం చెరువు నీటిలో చేరి నీరు కలుషితమై చెరువులో ఉన్న చేపలు చనిపోతాయని చేపల పెంపకం దారులకు జీవనాధారం పోతుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అనేక సార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కొరత...

మున్సిపల్ సిబ్బంది కొరత కారణంగా కాలనీలల్లోని ప్రజలు చెత్త, చెదారాన్ని కాలనీల్లోనే వేయడంతో పాటు రోడ్లకు ఇరువైపుల కుప్పలు తెప్పలుగా వేస్తున్నారు. మున్సిపల్‌లో 3 వందలకు పైగా ఉండాల్సిన శానిటేషన్ సిబ్బందికి గాను 70మంది మాత్రమే ఉన్నారు. దీంతో కాలనీలల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుంది. కొంత కాలం గ్రామస్తులు డంపింగ్ యార్డును తరలించాలని ఆందోళన చేయడంతో అధికారులు స్పందించి.. జల్‌పల్లి పెద్ద చెరువు కట్ట పక్కన చెత్తను వేయించి..వ్యర్థాలను బయో మెట్రిక్ ద్వారా శుద్ధి చేసి జీవ ఎరువులను కూడా తయారు చేయడం జరిగింది.



చెత్త డంపింగ్ యార్డును ఇక్కడి నుండి తరలించాలి

మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది ఇంటింటి నుండి సేకరించిన చెత్తను జీహెచ్ఎంసీకి తరలించాలి. బీజాన్ గుట్ట సమీపం నుండి ప్రవహిస్తున్న వర్షపు నీటిలో చెత్త, చెదారం చేరి జల్‌పల్లి పెద్ద చెరువు నీరు పూర్తిగా కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడి నుండి చెత్త డంపింగ్ యార్డును ఇతర ప్రదేశానికి తరలించి, స్థానిక ప్రజలను ఆదుకోవాలి

- స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు శివకుమార్



చెత్త డంపింగ్ యార్డు తరలించే ప్రయత్నం చేస్తాం

జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో చెత్త డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బీజాన్ గుట్ట సమీపం నుండి వెళ్తున్న వర్షపు నీటిలో చెత్త, చెదారం తరలి వెళ్లి పెద్ద చెరువు నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది.

- కమిషనర్ వాణిరెడ్డి

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు

ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ - చైతన్యపురి

విద్యుత్ స్తంభాన్ని ఓ కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురు వారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొహమ్మద్ అద్నాన్(19), సయ్యద్ సోఫియాన్(20), మహమ్మద్ యాసిర్(20), అబ్దుల్ మావియా(19) ఇన్నోవా వాహనంలో కర్మన్ఘాట్ నుండి సంతోష్ నగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో అబ్దుల్ మావియా అతివేగంతో కారును నడపడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టారు. గమనించిన స్థానికులు వెంటనే సమీపంలోని ఓనస్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు ఎండి. అద్నాన్, సయ్యద్ సుఫియాన్ అప్పటికే మృతిచెందినట్టు వెల్లడించారు. యాసిర్, అబ్దుల్ మావియాలు చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'గురుకుల' కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-బడంగ్ పేట్

రంగారెడ్డి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు(కందుకూరు, కిందుర్గు, శంషాబాద్, పరిగి, శివారెడ్డి పేట్, కొడంగల్, పెద్దేముల్) నందు గల ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 27న ఉదయం 9గంటలకు నాదర్ గుల్ నోబుల్ పీజీ కళాశాల నందు గల కందుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి మార్చి 2024 సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో

ప్రజా ఆమోదయోగ్యమైన బడ్జెట్

చిలక మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-2025 వార్షిక బడ్జెట్ రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమాన్ని సమన్వయం చేసుకుని రూపొందించిన బడ్జెట్‌గా ఉన్నదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రూ.72 వేల కోట్లు కేటాయించి వ్యవసాయ చరిత్రలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం గొప్ప మైలు రాయిగా నిలిచిందన్నారు. విద్య వైద్యం సంక్షేమానికి అధికని ధులు కేటాయించి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించి ప్రపంచ నగరాలకు ధీటుగా హైదరాబాద్ నగరాన్ని హైడ్రాగా విస్తరించి పెట్టుబడులకు కేరాఫ్‌గా నగరాన్ని తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం కోసం దాదాపు రూ.30 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. సబ్బండ వర్గాలకు అండగా ప్రజాప్రభుత్వం ఉంటుందని మరోసారి రుజువుఅయిందని అన్నారు. గత బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి గత ప్రభుత్వాలు వివక్ష చూపితే ఈ ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి, వారి ఆర్థికాభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించడం సంతోషదాయకమని అన్నారు. ఆరు గ్యారెంటీలకు హామీ పత్రంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఆర్భాటపు అంకెలు కాదు, వాస్తవపు లెక్కల బడ్జెట్ ఇది అని అన్నారు. అనంతరం ఈ బడ్జెట్‌ను రూపొందించిన తెలంగాణ ప్రజా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టీ విక్రమార్కకి, మంత్రి వర్గానికి, శాసనసభ్యులకు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేతివృత్తులకు మొండి చెయ్యి

• అందోజ్ సత్యం చారి



నవతెలంగాణ - హస్తినాపురం

స్వరాష్ట్రంలో చేతివృత్తుల కార్మికుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా వారికి మొండి చెయ్యి చూపించిందని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అందోజ్ సత్యం చారి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ చేతి వృత్తులనే నమ్ముకొని మనుగడ సాగిస్తున్న వారి సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం హేయమైన చర్య అని మండిపడ్డారు. చేతి వృత్తుల వారికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్య, వైద్యం, వెనుక బడిన తరగతుల ప్రజల అభ్యున్నతి కోసం బడ్జెట్ లో ఎలాంటి నిధిల్క్ అంశాలు ప్రస్తావించక పోవడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శమనని సత్యం చారి అన్నారు.

'అన్ని దానాలలోకెల్లా అన్నదానం గొప్పది'



నవతెలంగాణ- నాగోల్

అన్ని దానాలలో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని విశ్వశాంతి సృష్టి సేవా సమితి అధ్యక్షుడు బద్దం రఘుపతి గౌడ్ అన్నారు. నాగోల్ చౌరస్తాలో ఆయన కుమారుడి జ్ఞాపకార్థం విశ్వశాంతి సృష్టి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశాంతి సృష్టి సేవా ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పేద విద్యార్థుల చదువుల కోసం సహాయం చేస్తామని, ఎవరైనా పేద విద్యార్థులు ఉంటే తమను సంప్రదించాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు వారు కూడా తమను సంప్రదిస్తే సహాయం చేస్తామని చెప్పారు. ఏవిధమైన ఆర్థిక సహాయం కావాలన్నా నాగోల్ కార్యాలయంలో ఉన్న తమ ట్రస్ట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మెన్ బద్దం సంతోష్ కుమార్ గౌడ్, ట్రస్ట్ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

జపనీస్ ఏన్సెఫలైటిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి

• కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

విద్యార్థులందరూ జపనీస్ ఏన్సెఫలైటిస్ వ్యాక్సిన్ టీకాను వేయించుకోవాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో జపనీస్ ఏన్సెఫలైటిస్ వ్యాక్సిన్ టీకాలను గురువారం వేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. జపనీస్ ఎన్సెఫాలిటిస్ వైరస్ అనేది డెంగ్యూ, ఎల్లో ఫీవర్, వెస్ట్ నైల్ వైరస్‌లకు సంబంధించిన ఫ్లేవి వైరస్ ఇది, దోమల ద్వారా వ్యాపిస్తుందన్నారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాలు నిండిన వారికి ఈ వ్యాక్సిన్ టీకాను ఇస్తారని తెలిపారు. అనంతరం దోమల ఆవాసాలను గుర్తించి వాటిని తొలగించే విధానం, పరిసరాల శుభ్రత, నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, దోమతెరల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాహెబనగర్ పల్లె దవాఖాన డాక్టర్ మౌనిక, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దినేష్, రాధా కృష్ణ రెడ్డి నాయకులు రాజ్ కుమార్, దుర్గా ప్రసాద్, హాస్పటల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కాలనీ కార్యవర్గ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీలక్ష్మి నరసింహ స్వామి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని, కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని భరోసానిచ్చారు. సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ నరసింహ, సుధాకర్, ట్రెజరర్ శ్రీనివాస్, పరమేష్ చారి, దాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు తోడ్పాటు అందించేలా రాష్ట్ర బడ్జెట్

- ఎస్సీ సంక్షేమానికి రూ.33,124 వేల కోట్లు హర్షణీయం
- కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ సబ్బండ వర్గాలకు న్యాయం చేసేలా ఉందని కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శిశు, విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మూసి సుందరీకరణకు, హైదరాబాద్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇచ్చిందని తెలిపారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను ప్రోత్సహించేలా బడ్జెట్ ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు ప్రతీకగా ఉందన్నారు. ఎస్సీ సంక్షేమానికి రూ.33,124 వేల కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

బోనాలకు రావాలని మైనంపల్లికి ఆహ్వానం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజ్గిరి డివిజన్‌లో ఈ నెల 28, 29వ తేదీన నిర్వహించే బోనాల పండుగకు హాజరు కావాలని టెంపుల్ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావును గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, బీ బ్లాక్ వెంకటేష్ యాదవ్, జీఎన్‌వీ సతీష్ కుమార్, శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, సంతోష్ రాందాస్, వినోద్ యాదవ్, సంపత్ గౌడ్, సాయినాథ్ గౌడ్, కొండగౌడ్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కన్నా, సిరిగిరి రాజు, సయ్యద్ మబ్బు, ఫారుక్, పిట్టల నాగరాజు, రాంచందర్, శంకర్, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పాలకుల చిత్తశుద్ధి ఏది?



- సమస్యలకు నిలయంగా రామంతాపూర్

నవతెలంగాణ-ఉప్పల్

ఎన్నికలు వచ్చాయంటే హడావుడి చేసే నాయకులు, ఎన్నికలు ముగిశాక ప్రజా సమస్యలను పట్టించుకునేందు ఎవరూ కన్పించడం లేదు. రామంతాపూర్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పాలకుల చిత్త శుద్ధి పూర్తిగా లోపించింది. రామంతాపూర్ భగాయత్, వెంకట సాయి నగర్, బీరప్ప దేవాలయం రోడ్డు లెవెల్ లేకపోవడంతో చినుకు పడితే బురదమయంగా మారుతోంది. బీరప్ప ఆలయం వద్ద ఉన్న రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పాలకులకు పట్టింపు లేకుండా పోయిందని ప్రజలు వాపోయారు.

అవిశ్వాసానికి వేళాయే..

- ఆగస్టు 9న పీర్జాదిగూడలో అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి మల్లారెడ్డి రోజు రోజుకూ పట్టు కోల్పోతున్నారు. జవహర్ నగర్, బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్లను పదవీచ్యుతులను చేసిన కాంగ్రెస్ ఇప్పుడు పీర్జాదిగూడపై దృష్టి సారించింది. అందులో భాగంగానే పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం ఆగస్టు 9న నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న మూడు కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో చేరినట్టేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సాయినగర్ ఫేజ్-2లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని సాయినగర్ ఫేజ్-2 కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం పర్యటించారు. స్ట్రీట్ లైట్స్, రోడ్లు, డ్రయినేజీ సమస్యలు, వంగిన ఎలక్ట్రిక్ పోల్స్ తొలగించి కొత్త పోల్స్ వేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. వెంటనే కాలనీ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కార్పొరేటర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట కాలనీ వాసులు భిక్షపతి గౌడ్, స్వామి, ప్రసాద్ గౌడ్, రమేష్, మహేష్, నర్సింహ గౌడ్, రమేష్ నాయక్, కల్యాణి, సఫీయ, స్వాతి, మాధవి, భార్గవి, సుజాత, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ-కాప్రా

శ్రీ వాసవీ శివనగర్ కాలనీలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో ఈ వారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వారం నాగిళ్ల నరసింహారెడ్డి, మాలతీ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయిబాబా కాలనీ ప్రజలు, దేవస్థానం చైర్మెన్ దాశ అశోక్, నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, బాల నరసింహ, సురేష్ రెడ్డి, శ్రీశైలం, చెంచు రెడ్డి, శ్రీను, ప్రజలు పాల్గొన్నారు.

ఏకపక్ష విధానాలతోనే మరో అసోసియేషన్ ఏర్పాటు



- వెస్ట్ క్రాంతి నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భక్తీశ్వర్, ప్రధాన కార్యదర్శి కల్యాణ్

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన వెస్ట్ క్రాంతి నగర్ అసోసియేషన్ ఏర్పాటుకు పాత అసోసియేషన్ ఏకపక్ష నిర్ణయాలే కారణమని వెస్ట్ క్రాంతి నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భక్తీశ్వర్, ప్రధాన కార్యదర్శి కల్యాణ్‌లు అన్నారు. గురువారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వెస్ట్ క్రాంతి కాలనీ అసోసియేషన్ పేరుతో తాము ఇష్టపూర్వకంగానే నూతన కాలనీని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గతంలో తాము కలిసి ఉన్న కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తయ్య తన వ్యక్తిగత ప్రయోజనాలే తప్ప కాలనీ అభివృద్ధిపై ఏనాడూ దృష్టి పెట్టలేదన్నారు. నూతన కాలనీ ఏర్పాటులో కార్పొరేటర్ హరి శంకర్‌రెడ్డి ప్రమేయం లేదన్నారు. కొందరి ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వ ధోరణి కారణంగానే నూతన అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఈ విషయంలో స్థానిక కార్పొరేటర్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కృష్ణయ్య గౌడ్, రాఘవేంద్ర రెడ్డి, కాలనీ వాసులు చక్రపాణి, మారయ్య, సత్యనారాయణ గౌడ్, సురేందర్ రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, శివరాజ్, నానీ,రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించి

బడ్జెట్‌ను ఖర్చు చేయాలి

- హైదరాబాద్‌లో గృహ వసతి కల్పించడానికి బడ్జెట్ పెంచాలి
- సీపీఐ(ఎం) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం



నవతెలంగాన-సిటీబ్యూరో

2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా వైద్య రంగాలకు, హైదరాబాద్ నగర అభివృద్ధికి కేటాయింపులను, స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయటలేదన్నారు. అందువల్ల ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ కోరుతున్నది అని తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుభీమాతో పాటు, వ్యవసాయ పరిశోధనలకు రూ.72,659 కోట్లు కేటాయింపులు చేశారని తెలిపారు. విద్యా, వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయి అన్నారు. దేశం అక్షరాస్యత సగటు కంటే తెలంగాణ అక్షరాస్యత శాతం తక్కువ ఉందన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత 66శాతం దాటడం లేదని తెలిపారు. సాక్షర భారత్ మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు ఆకర్షించబ డుతున్నారని తెలిపారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు సరిపోవు అన్నారు. విద్యా, వైద్య రంగంలో ప్రభుత్వాలు తగు శ్రద్ధ చూపకపోవడంవల్ల ప్రయివేటు రంగాలకు ఆకర్షించబడు తున్నారు అని, ఈ రెండు రంగాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రూ.5లక్షలు, దళితులకు రూ.6లక్షలు ఇస్తామని, నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఇందుకు రూ.8,424 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. వాస్తవానికి రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు దశబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రూ.10లక్షల చొప్పున ఇవ్వాలి అని, అందుకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ఉన్నది అన్నారు. హైదరాబాదులో పేద మధ్య తరగతి ప్రజలకు గృహ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని, అందుకు తగిన విధంగా బడ్జెట్ ను పెంచాలి అన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ కేలండర్‌ను వెంటనే విడుదల చేయాలని, మహిళలకు రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని వడ్డీ లేకుండా రు.2లక్షలకు పెంచాలని సీపీ(ఎం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ కోరుతున్నదని అన్నారు. మూసి అభివృద్ధి ప్రణాళికలో నిర్వాసితుల సమస్యను కూడా ప్రభుత్వం తగిన పద్ధతుల్లో ఆలోచించాలన్నారు. ఉప్పల్ - నారపల్లి వరంగల్ హైవే పై ఉన్న ఫ్లై ఓవర్ పనులు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పూర్తయ్యేలా చూడాలి అని అన్నారు.

రజకుల సంక్షేమానికి పెద్ద పీట వేయాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-ఉప్పల్

ప్రభుత్వం రజకుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని రజక వృత్తిదాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. ఉప్పల్, బీరప్ప గడ్డ సీఐటీయూ కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షరాలు ఎస్. సుభద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన తరగతులకు రూ.9200 కోట్లు ప్రకటించడాని స్వాగతిస్తున్నామని తెలిపారు. రజకుల సంక్షేమానికి కూడా తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న రజకులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించి, ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. వృత్తిపై శిక్షణ ఇవ్వాలని, మోడ్రన్ దోభీ ఘాట్లు నిర్మించాలని, రజక సొసైటీలకు రుణాలు, ప్రతి వృత్తిదారుడికి రూ.10 లక్షల ఆర్థిక సహకారం ఇచ్చేలా ప్రభుత్వం జీవో ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్ మాట్లాడుతూ.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యాలయంలో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులను జీవో నెంబర్ 27 ప్రకారం భర్తీ చేయాలన్నారు. ఆ సమస్యపై త్వరలోనే జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిలు సట్టు రవి, పెద్దాపురం భాస్కర్, శనిగారం స్వరూప, నాంపల్లి ఈశ్వర్, లింగం, క్రాంతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: మున్సిపల్ చైర్ పర్సన్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్‌లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీతో కలిసి ఆరో వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బస్ స్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రధాన రహదారిలో వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లను వెనక్కి జరపాలని ఆదేశించారు. తోపుడు బండ్లు, వివిధ దుకాణాదారులకు వారం క్రితమే సమాచారం ఇచ్చామని తెలిపారు. అయిన వారిలో మార్పు లేనందున మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ రవీందర్, సిరాజ్, కరుణాకర్ యాదవ్, విక్రాంత్ రెడ్డి, సలీం, ప్రేమ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాజేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతి, సన్నీ , స్థానిక ప్రజలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై రాజీ పడొద్దు : సీపీ



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజలకు శాంతి భద్రతలు అందించడంలో రాజీపడొద్దని రాచకొండ సీపీ సుధీర్ బాబు పోలీసు అధికారులకు సూచించారు. గురువారం మేడిపల్లి ఠాణను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు శాంతి భద్రతలు అందించడానికి ముందు వరుసలో ఉండాలన్నారు. మహిళలకు ఎక్కడ ఇబ్బంది కలిగినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్రోలింగ్ విభాగం అప్రమత్తంగా ఉంటూ అందరినీ సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, మేడిపల్లి సీఐ గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ 9వ వార్డులో కౌన్సిలర్ కోమీరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయ పురి కాలనీలో రూ.11లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు చైర్మెన్, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయపురి కాలనీ అధ్యక్షులు సత్యంరాజు, బాపూజీ నగర్ కాలనీ అధ్యక్షులు యాకయ్య, శాంతినగర్ కాలనీ అధ్యక్షులు నర్సింహ, నాయకులు పైళ్ల మల్లారెడ్డి, శ్రీనివాస్, నర్సింహ, మోడల నర్సింహ, శ్రీనివాస్, సోమరాజు, యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని తివారి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న తుడుం మంజుల మహిళ అనారోగ్యంతో మరణించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వార్డు కౌన్సిలర్ పంగ హరిబాబు మృతురాలి అంత్యక్రియల కోసం ఆమె కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.



ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ ప్రధాన రహదారిపై ఉన్న గుడ్ ల్యాండ్ హోటల్ ఏర్పరచుకున్న చీమిని పైప్ గాలివానలకు ఎలక్ట్రికల్ తీగలకు తగిలి విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, కాలనీ అధ్యక్షులు రాఘవరెడ్డిలు విద్యుత్ అధికారుల మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

-నవతెలంగాణ,కాప్రా

భక్తులకు అసౌకర్యం కలగొద్దు



- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి

నవతెలంగాణ - జవహర్ నగర్

బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. బాలాజీ నగర్‌లో ఆదివారం నిర్వహించనున్న బోనాల సందర్భంగా మహంకాళి దేవాల యం వద్ద శానిటేషన్ సిబ్బంది చేస్తున్న పనులను గురువారం పర్యవేక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయాని కి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల ని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింగుల రాజు గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కొయ్యడ వెంకటేష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణప్ప, మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో భాగమని మేడ్చల్ మాజీ జెడ్పీటీసీ జే.శైలజ హరినాథ్ అన్నారు. గురువారం మేడ్చల్‌లోని ఎస్ఎస్‌జీ స్కూల్‌లో నిర్వహించిన బోనాల వేడుకలకు హాజరైన మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు నైవేద్యాలు, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. హెచ్ఎం సామ రాధాకృష్ణ మాట్లాడుతూ.. పట్టణాల నుంచి పల్లెల దాకా బోనాలను అన్ని వర్గాల ప్రజలు జరుపుకుం టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మెన్ చీర్ల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన రియాజ్



నవతెలంగాణ- మేడ్చల్

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు రియాజ్ మేడ్చల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా దాతలు ఇచ్చిన నూతన ఫర్నిచర్‌ను పాఠకులకు అంకితం చేశారు. ఫర్నిచర్ అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ బట్టు నాగిరెడ్డి భువనగిరి జిల్లాలో విధులు నిర్వహించిన సమయంలో భువనగిరి జిల్లా గ్రంథాలయ భవనానికి ఫర్నిచర్‌కు నిధులు విడుదల చేసినందుకు కమిషనర్ నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం రియాజ్ మాట్లాడుతూ.. మేడ్చల్ పట్టణంలోని గ్రంథాలయంలో కంప్యూటర్ విభాగాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గ్రంథాలయాలు ప్రజలకు విజ్ఞాన బండాగారలుగా విరజిల్లుతున్నాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులతో సంభాషించారు. అనంతరం లైబ్రరీ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్ చెరువులో మహిళ మృతదేహం లభ్యం



నాగమ్మ (ఫైల్)

నవతెలంగాణ-జవహర్ నగర్

మతిస్థిమితం లేని ఓ మహిళ మృతదేహం అంబేద్కర్ నగర్ చెరువులో లభ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మిక నగర్‌కు చెందిన నాగమ్మ (48) కొద్ది రోజులగా మతిస్థిమితం కోల్పోయింది. బుధవారం ఉదయం నుంచి ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం అంబేద్కర్ నగర్ చెరువులో మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి నాగమ్మగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీపై వెళ్లిన టీచర్‌కు సన్మానం



నవతెలంగాణ-కీసర

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సాధారణమని రాంపల్లి బీఆర్ఎస్ నాయకులు బందెలా పరమేష్, మంచాల నర్సింగ్ రావులు అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామం లోని హరిజనవాడ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో 13 ఏండ్లుగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు ఉమాను శాలువాతో సన్మానించారు. నూతనంగా వచ్చిన హేమలత, విజయలక్ష్మిలకు స్వాగతం పలికారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి



- మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్
- డివిజన్ అధ్యక్షుడు బూడిద వెంకటేష్

నవతెలంగాణ-జవహర్‌నగర్

యువత స్వయం శక్తితో వ్యాపార రంగంలో రాణించాలని జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28 వ డివిజన్ సాయి బాబా కమాన్ రోడ్డులో ఏర్పాటు చేసిన బేకరిని డివిజన్ అధ్యక్షుడు బూడిద వెంకటేష్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాప్ ఓనర్ స్వామి, వెంకటేష్, కిషోర్, రవి, శ్రీను, స్వామి, అశోక్ పాస్టర్, అనిల్, పాల్గొన్నారు.



బోనామెత్తిన బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధమైన ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సొంత గ్రామమైన బాలాపూర్ గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకుని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బోనమెత్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రజలందరికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ అమ్మలగన్న అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురిసి రైతులందరు పాడి పంటలతో సుఖ సంతోషంగా ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.
నవతెలంగాణ-బడంగ్ పేట్

బీసీలకు నిరాశ మిగిల్చిన రాష్ట్ర బడ్జెట్

- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తము బడ్జెట్‌లో బీసీలకు నిరాశనే మిగిలిందని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో 55 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం రూ.9,200 కోట్లు కేటాయించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర మంత్రి వర్గం లో, కార్పొరేషన్ పదవులలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం పదవులు ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో బీసీల ఓట్లతోనే కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌కు బీసీలు గుర్తుకు రావడం లేదన్నారు. 8 నెలలు గడుస్తున్నా కామారెడ్డి డిక్లరేషన్ హామీని మరిచిపోయారన్నారు. జన గణనలో బీసీ కులగణన చేయడంలో ప్రభుత్వం విఫలమైం దన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. నేటికీ ఆచరణ పెట్టడం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీసీలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం

- గత ప్రభుత్వ ఆనవాయితీనే కొనసాగింపు
- ఫీజు రీయంబర్స్ మెంట్స్, మెస్ ఛార్జీలపై స్పష్టత కరువు
- యూనివర్శిటీల అభివృద్ధికి నిధులు శూన్యం
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్
- ప్రగతి నగర్ లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాన-సిటీబ్యూరో/దుండిగల్

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడానికి నిరసనగా ప్రగతి నగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 7.3శాతం మాత్రమే నిధులు కేటాయించడం, గత ఓటాన్ బడ్జెట్ కేటాయింపు కంటే తక్కువ అన్నారు. గత బడ్జెట్ లో విద్యా రంగానికి రూ.21,389 కోట్లు కేటాయిస్తే, ఈ సారి రూ. 21,292 కోట్లు మాత్రమే కేటాయించినట్టు తెలిపారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య ఏ మాత్రం అభివృద్ధి కాదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పినది. కానీ దాని ఊసు ఈ బడ్జెట్లో లేదు అన్నారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు. దాని గురించి చర్చే లేదన్నారు. యూనివర్శిటీల అభివృద్ధి రాష్ట్రంలో రూ.500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుంది అన్నారు. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీకి రూ.200 కోట్లు పోనూ 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారని తెలిపారు. యూనివర్శిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్శిటీలు నోచుకోవు అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెల పాలని అన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బ తిన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదు పాయాలు కల్పిస్తామని, ప్రతి యూనివర్శిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారని తెలిపారు. ఉస్మానియాకు రూ. 1,000 కోట్లు, మహిళ యూనివర్శిటీ అభివృద్ధి కోసం రూ. 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐఐటి అభివృద్ధి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివ ర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్శి టీలు అభివృద్ధి కోసం రూ.500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులువు కుంది అన్నారు. రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్శిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులు రావు అన్నారు. ఒక్క ఉస్మానియా యూనిర్శిటీకే రూ.350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం అని, కాకతీయ, మహాత్మా గాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్‌టీయూహెచ్, ఫైన్ ఆర్ట్స్, మహిళా యూనివర్శిటీ, అగ్రికల్చర్ యూనివర్శిటీ, వెటర్నరీ, హర్టీ కల్చర్ లాంటి వాటికి నిధులు కేటాయింపు లు లేవు అన్నా రు. తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం బాసర ఐఐఐటీల లాగా మరో రెండు కేటాయిస్తా మని చెప్పి వాటి గురించి కూడా ప్రస్తావన లేదు అన్నారు. పాఠశాల విద్యా రంగలో ఖాళీలు భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపా ధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, ముత్రశా లలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని ఎస్ఎఫ్ఐ భావిస్తోందని ఆయన అన్నారు. మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లడుతూ గురు కులాల నిర్మాణం కోసం కూడా కనీస నిధులు లేవు అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌళిక సదుపాయాలు లేవు అన్నారు. ఈ బడ్జెట్‌లో ఆరేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్ మెంట్స్ రూ.7 వేల కోట్ల పైగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించ లేదు అన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిన స్పష్టమైన నిధులు లేవు అని, ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం లాగా కాకుండా 15 శతానికి పైగా నిధులు విద్యారంగానికి కేటా యిస్తామని చెప్పి 7.3శాతం నిధులు మాత్రమే కేటాయిం చారు అన్నారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నియో జకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ కూడా ఎలాంటి చర్చలేదు. తక్షణమే బడ్జెట్ సవరించి, విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయా లని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది అని పేర్కొన్నారు. ఈ కేటాయింపులకు నిరసనగా రేపు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ అరుణ్, వంశీ, మనోజ్, జిల్లా కమిటీ సభ్యులు భగత్, శ్యామ్, శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, సుబ్బు, నిఖిల్, రాహుల్, ప్రణయ్, అజయ్, నవీన్, వాసు, రమ్య, కీర్తన, రేణుక, సుష్మ, సురేఖ, లావణ్య యమునా, పాల్గొన్నారు.

శివ రామాంజనేయ ఆలయ కమిటీ పుస్తక పంపిణీ..



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అన్ని దానాలలోకి విద్యాదానం గొప్పదని..పేద విద్యార్థులకు అవసరమైన సహాయం చేయడం అభినందనీయమని కూకట్‌ల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేటలోని కబీర్ నగర్‌కు చెందిన రమేష్ అయ్యంగార్ శివ రామాంజనేయ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో..గురువారం నేతాజీ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, షూస్, సాక్స్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆర్థిక కారణాలతో ఏ పేద విద్యార్థి చదువు మానకూడదు అన్న ఉద్దేశంతో...తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూము వేణు, రాఘవేంద్ర, సతీష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, బుచ్చన్న, ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరధిలోని మైసమ్మనగర్‌లో బొడ్రాయి మహోత్సవ వేడుకలు గురువారం బస్తీ వాసులు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ చారీ, స్థానిక నాయకులు పిల్లి అంజనేయులు ఎం.రవీందర్ రెడ్డి, వేణుగౌడ్, కళ్యాణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బోనాల పండుగ పురస్కరించుకుని.. మూసాపేట్‌లోని భవానీ నగర్, లచ్చయ్య నగర్, అంబేద్కర్ నగర్, బాబు జగ్జీవన్ రామ్ నగర్, మారుతి నగర్, మూసాపేట్ విలేజ్, జనతా నగర్ ప్రాంతాల్లో వెలిసిన అమ్మవారి ఆలయాలను మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగుడాల బాబురావులతో కలిసి దర్శనం చేసుకుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు సాంప్రదాయ బద్ధంగా, ప్రతి ఏటా ఆషాఢ మాసంలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. అమ్మవార్ల కృపా కటాక్షంతో ప్రజలంతా సంతోషముతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు నపారి చంద్రశేఖర్, తుకారాం, విష్ణు, రాజు, మల్లేష్, మనోజ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓబిసీల అభ్యున్నతికి కృషి చేయాలి



- వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఓబిసీల అభ్యున్నతికి పాటుపడుతూ, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సీనియర్ నాయకులు, వీరమల్ల కేశవరావు నియమితులైన సందర్భంగా.. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని కలిశారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు, కేశవరావుని అభినందించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓబీసీల అభ్యున్నతికి పాటుపడుతూ పార్టీ యొక్క పటిష్టతకు అందరం కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని, ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు దానబోయిన నర్సింగరావు, దుర్గా ప్రసాద్ రావు, శంకర్ రెడ్డి, ఫణి కుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో బోనం సమర్పించిన వడ్డేపల్లి రాజేశ్వర్ రావు..

జగజ్జనని జగన్మాత ఎల్ల లోకాలనేలుతున్న ఆదిపరాశక్తి ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా.. కూకట్‌పల్లిలోని గ్రామ దేవత ఏడు గుడిల శ్రీ పోచమ్మ తల్లి ఆలయంలో, నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల్లో, సతీ సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ఒడిబియ్యం, బోనం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని సమర్పించారు. ఆలయ అర్చకులు రాజేశ్వరరావు దంపతులను ఆశీర్వదించి, ఆలయ కమిటీ సభ్యులు ఆయన సన్మానించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి చల్లని ఆశీర్వాదంతో ప్రతి ఏటా కుటుంబ సమేతంగా బోనం సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ కూడ సుఖసంతోషాలతో ఆనందంగా ఆరోగ్యకరంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించడం జరిగిందన్నారు.



శివరాత్రి యాదగిరి జన్మదిన సంబరాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ట్రస్మ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, జగద్గిరిగుట్ట జేఏసీ చైర్మెన్, చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మెన్ శివరాత్రి యాదగిరి 54 వ జన్మదిన వేడుకలు గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్, భగత్ సింగ్ మార్గ్‌లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో కుటుంబ సభ్యులు, రాష్ట్ర, మేడ్చల్ జిల్లా, పలు మండలాల ట్రస్మ ప్రతినిధులు, పరిసర ప్రాంతాల పాఠశాల కరస్పాండెంట్లు, పాత్రికేయులు, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల లెనిన్ నగర్ బ్రాంచ్ ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య జన్మదిన సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ జన్మదిన వేడుకలకు హాజరైన పలువురు పుష్పగుచ్చాలు అందజేయడంతో పాటు కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించి శివరాత్రి యాదగిరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ఇంతటి పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం కృషి చేస్తాన ని తెలిపారు. మీ అందరి ఆధరాభిమానాలు ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు పి.ఎల్.ఎన్.రెడ్డి, సలహా దారులు వి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు డి.శ్రీనివా స్, మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్ష కార్యదర్శులు జే.నాగరాజు, జి. అశోక్, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్ చారి, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, ఉప్పల్ బాలానగర్ మేడిపల్లి ఘట్‌కేసర్ బాచుపల్లి కూకట్ పల్లి, కాప్రా మండల అధ్యక్షులు మనోహర్, ట్రస్మా ప్రతిని ధులతో పాఠశాల డైరెక్టర్ల బృందం శివరాత్రి మంగ శివరాత్రి నిఖిల్,డాక్టర్ శివరాత్రి శృతివిద్య, శివరాత్రి సాయితేజలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆరోగ్య సంరక్షణ పై సదస్సు



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎఐసీటీఈ- వాణి వారి సహకారంతో మూడు రోజుల ప్రాయోజిత సదస్సు నిర్వహించారు. గురువారం ముగింపు సదస్సులో ముఖ్య అతిథులు డీన్.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 'ఇంట్రడక్షన్ టు డీప్ లెర్నింగ్ అండ్ మెషిన్ లెర్నింగ్', 'డీప్ లెర్నింగ్ ఫర్ కార్డియోవాస్క్యులర్ ఇమేజ్ ఎనాలిసిస్' అంశాల మీద అద్భుతమైన ప్రసంగాలను అందించారు. ఈ అంశాల ద్వారా విద్యార్థులు, ఫ్యాకల్టీ డీప్ లెర్నింగ్ టెక్నాలజీ మీద ప్రయోజనకర విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా ఉపన్యాసం ఇచ్చారు. డీప్ లెర్నింగ్ టెక్నాలజీ ఉపయోగించి కార్డియోవాస్క్యులర్ ఇమేజ్ ఎనాలిసిస్ ఎలా చేస్తారు.. అనే విషయాల పైన సమాచారం అందించడం జరిగింది. అనంతరం డీన్-ఐసీటీ దండు శ్రీనివాస్ మాట్లాడుతూ "డీప్లెర్నింగ్ ఉపయోగించి హెల్త్‌కేర్‌లో మెడికల్ ఇమేజింగ్, డయాగ్నోసిస్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్" అంశం పైన మెడికల్ ఇమేజ్ రికంస్ట్రకషన్, సెగ్మెంటేషన్ ఎనాలిసిస్ యొక్క ముఖ్య ఉద్దేశం వాటి నిత్య జీవితంలో ఉపయోగం గురించి కూలంకుషంగా విశ్లేషణాత్మక వివరణతో వివరించారు. అదేవిధంగా మరొక ఉపన్యాసకులు డీన్- అకాడమిక్స్ శ్రీలక్ష్మి "అప్లికేషన్స్ ఆఫ్ హెల్త్ కేర్ యూజింగ్ డీప్ లెర్నింగ్", "ప్రాక్టికల్ బయో-మెడికల్ సిగ్నల్ ఆక్విజిషన్ సాఫ్ట్వేర్-బేస్డ్ ఎనాలిసిస్" అంశాల మీద ప్రాక్టికల్ బేస్డ్ ప్రసంగాలను అందించారు. ఈ మూడు రోజుల ఆరోగ్య సంరక్షణ ప్రాయోజిత సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాధం చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. 'ఎఐసీటీఈ - వాణి' ప్రాయోజిత సదస్సులను స్థానిక భాషలలో అందించడం ఎంతో ప్రశంసించదగిన విషయం అని కొనియడారు. స్థానిక భాషలో సాంకేతికత అందుబాటులోకి వస్తే ప్రతి సామాన్యుడు టెక్నాలజీ ఉపయోగం అనేది చాలా సులభతరం అవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాధం 'ఎఐసీటీఈ. - వాణి' ని ఉద్దేశించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జక్కుల నర్సింహారెడ్డి, సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జక్కుల త్రిలోక్ రెడ్డి, వివిధ డిపార్ట్‌మెంట్స్ యొక్క డీన్స్ రామసుబ్బారెడ్డి, డా.దిలీప్ కుమార్ రెడ్డి, శ్రీలక్ష్మి, దండు శ్రీనివాస్, హెచ్ఓడిలు డా.జి.రాము, డా.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంఘసేవకులు, వి.ఆర్ ఎలక్ట్రికల్స్ అధినేత వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలని లయన్స్ క్లబ్ కార్యాలయములో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, బంధుమిత్రుల, సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి రాజలక్ష్మి ఇండస్ట్రీస్ అదినేత, లయన్ క్లబ్ ఆఫ్ గాంధినగర్ ఆర్యా వ్యవసాపకులు, సాహిత్య కళా పోషకులు, లయన్ డాక్టర్.చిల్లా రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జన్మదిన వేడుకలు మా లయన్స్ ప్రతినిధులతో జరుపుకోవటం, నిరుపేదలకు సహాయం అందిస్తూ సమాజసేవలో తనవంతు కృషి చెస్తున్న వెంకటేశ్వర్ రెడ్డిని శాలువతో సన్మానించిమొక్కను బహుమానంగా అందించారు. లయన్స్ సేవలో మీ జీవితం కొనసాగాలని నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లడుతూ మా గురు స్వామీ రాజశేఖర్ రెడ్డి లయన్స్ కార్యలయంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందని అమ్మానాన్నలాంటి పెద్దలకు అన్నదానం చేయటం గొప్ప అదృష్టంగా బావిస్తున్నాని తెలిపారు. ప్రభుత్వ పూర్వ అయుర్వేధ డాక్టర్ జయరాం మాట్లడుతూ జీవితంలొ ఎన్నో అనుబావాలను నేర్చుకుని స్వయం కృషితో జీవిస్తూ యువతరానికి స్పూర్తిగా నిలిచిన వెంకటేశ్వర్ రెడ్డిని నిండు మనసుతో దీవించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి పుడమి రత్న అవార్డు గ్రహీత,మానస టూల్ టెక్ అదినేత వాకిటి రామ్ రెడ్డి , డిఫెన్సు విశ్రాంతి ఉద్యోగి గోపాలకృష్ణ రెడ్డి, సాహితీ సంఘ సేవకులు రాఘవ రెడ్డి, లయన్ డి.ఎల్లా సుబ్బారెడ్డి, లయన్ విష్ణువర్ధన్ రెడ్డి, లయన్ గోవింద్ రెడ్డి, లయన్ హేమాద్రి నాయుడు, లయన్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొని జన్మదిన శుభాకంక్షాలుతెలిపారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి..



- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మహిళలు స్వశక్తితో ఎదగాలి అని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ఇందిరా రెడ్డి ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యేని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన ఇందిరా రెడ్డిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సమాఖ్య సభ్యులు అందరూ కలిసికట్టుగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు పద్మా గౌడ్, కార్యదర్శి సత్యవాణి, సంయుక్త కార్యదర్శి కుర్షీదా, కోశాధికారి శ్యామల, డైరెక్టర్లు అనిత, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు టికెట్ పై రాయితీ కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేత...

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని కలిసి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో వయోవృద్ధులకు టికెట్‌పై రాయితీ కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలలో వయోవృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న రాయితీ మాదిరిగానే తెలంగాణలో రాయితీ అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా చూసేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి మురళి గౌడ్, ఉపాధ్యక్షులు లింగం గౌడ్ సభ్యులు నాగేష్, వీరారెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.



బస్తీ సమస్యలపై పర్యటన..

- బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ...



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అల్విన్ కాలనీ డివిజన్ పీజెఆర్ నగర్ కాలనీలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో.. సీనియర్ నాయకులు కేశవరావు బీజేపీ నాయకులతో కలిసి బస్తీ పర్యటన చేసి, స్థానికంగా నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో కలిసి అక్రమ మంచినీటి కనెక్షన్లు తొలగించాలని, వాటర్ వర్క్స్ డీజీఎం నాగ ప్రియని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు పర్యటనలు తప్ప పరిష్కారం చేయట్లేదు అన్నారు. అభివృద్ధి సాకుతో పార్టీలు మారి పబ్బం గడుపుకోవడం తప్ప, ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. అలాగే ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్, ఎన్టీఆర్ నగర్, దత్తాత్రేయ కాలనీ తదితర కాలనీలలో కాసులకి కక్కుర్తి పడి వాటర్ వర్క్ సిబ్బంది అదనపు అక్రమ మంచినీటి కనెక్షన్లను ఇవ్వడం వలన, అందరికీ సరిపడా నీళ్ల రాక ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని అన్నారు. వెంటనే అక్రమ కనెక్షన్లను తొలగించి, సమృద్ధిగా నీళ్లను అందించాలని, భవిష్యత్తులో మళ్లీ పునరా వృత్తం కాకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రయినేజీ లైన్ల మరమ్మత్తులను కూడా వెంటనే చేపట్టి ప్రజలకు డ్రయినేజీ సమస్య నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, శ్రీనివాస్, రఘు, శివాజీ, కవిత, అనిత, సురే,ష్ రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఐ మల్లేష్‌ను కలిసిన డివిజన్ నాయకులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130 డివిజన్ నాయకులు నూతన బాధితులు స్వీకరించిన జీడిమెట్ల సీఐ మల్లేష్‌ని గురువారం కలిసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అపురూప, ఎస్ఆర్ నాయక్ నగర్ కాలనీలలో కొంతమంది యువత మద్యం మత్తు పదార్థాలు అలవాటు పడుతున్నారని చెడు మార్గం నుంచి మంచి మార్గానికి వచ్చేలా కృషి చేయాలని వారు కోరారు. కాలనీలో జరిగే కొన్ని నేరాలను అదుపు చేయాలని మనవి చేశారు. సీఐ సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపట్టి సమస్య పరిష్కారం కొరకు కాలనీ పెద్దలతో మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కార దిశగా ముందుకు సాగుదామని సీఐ మల్లేష్, ఎస్ఐ హరీష్ తెలిపారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గగుబ్బల లక్ష్మీ నారాయణ, ఎస్ఆర్ నాయక్ నగర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పూర్ణచంద్రగుప్త, కుడు పూడి వెంకటేష్, శివ శంకర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ జన్మదినం సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, నిరుద్యోగ అభ్యర్థులకు గ్రూప్2 మెటీరియల్‌ను ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ వద్ద గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి వ్యవస్థాపకులు డా. వెంకటేష్ చౌహాన్, రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మెన్ నాగు నాయక్,గిరిజన శక్తి రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, ఓయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమంతు నాయక్, సతీష్ నాయక్, రాజశేఖర్, శివ, మహేష్ , నిరుద్యోగులు పాల్గొన్నారు.

బీసీల బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లకు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ రూ.2,91,159 కోట్ల బడ్జెట్‌లో జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీలకు కేవలం రూ.9,200 కోట్లు కేటాయించడం చాలా దారుణమని అన్నారు. ఈ బడ్జెట్ బీసీలకు ఏమాత్రం సరిపోదని.. బీసీల బడ్జెట్ ఎజూ. 20 వేల కోట్లకు పెంచాలని కోరారు. నిరు ద్యోగ బీసీ యువతకు బీసీ కార్పొరేషన్ ద్వారా నిధులిచ్చి ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని ఇప్పుడు ఆ ఊసేలేదని అన్నారు. వెంటనే బీసీలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

మెట్రో పరుగులు పెట్టేనా..!

- బడ్జెట్‌లో మొత్తం రూ.1100 కోట్ల కేటాయింపు
- పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు
- ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు
- కేటాయింపులేనా? నిధులిచ్చేనా?



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్(2024-25)లో మెట్రో రైల్ ప్రాజెక్టులకు రూ.1100 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వం మాదిరి కేటాయింపులకే పరిమితం కాకుండా నిధులు ఖర్చు చేస్తేనే అనుకున్న లక్ష్యాలు సాధ్యమవుతాయని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కావడంతో మెట్రోకు భారీగా నిధులు కేటాయింపులు ఉంటాయని అంచనా వేశారు. కానీ తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు కేటాయించగా.. పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు కేటాయించారు. ఇదిలావుంటే గత ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో మెట్రో ప్రాజెక్టులకు రూ.1500 కోట్లు, పాతబస్తీ మెట్రో, శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి రూ. 877.35 కోట్లు కలిపి మొత్తం రూ.2,377 కోట్లు కేటాయించినప్పటికీ.. నిధులు ఇవ్వలేదు.

పనులు ముందుకు సాగేనా..!

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా మెట్రో మొదటి దశలో కలిగిన అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం రెండో దశ ప్రతిపాదనలను సమీక్షించి, వాటిని సవరించి, కొత్త ప్రతిపాదనలను రూపొందించింది. ప్రస్తుతం మూడు కారిడార్లు కలిపి 69.2కి.మీటర్లు మేర మెట్రో రైలు అందుబాటులో ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో.. ప్రభుత్వం 78.4కి.మీ పొడవున్న అయిదు అదనపు కారిడార్లను రూ. 24,042 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మెట్రో రైలును పాతబస్తీకి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానించనున్నారు. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్బీ నగర్ వరకు విస్తరిస్తారు. నాగోలు, ఎల్బీ నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేయనున్నారు. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా సర్కారు ప్రణాళిక సిద్ధం చేసింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు మెట్రో ప్రయాణం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతోనే మెట్రో ఫేజ్-2ను తీసుకొస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఈ ఏడాది మార్చి 8న మెట్రో రైలు రెండో దశ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం ఎయిర్‌పోర్టు మెట్రో విస్తరణ పనులు వేగం అందుకున్నాయి. రెండో దశ డీపీఆర్‌ను సిస్ట్రా కన్సల్టెన్సీకి అప్పగించారు. ప్రస్తుతం ఇది తుది దశకు చేరకుంది. ఇటీవల ఎయిర్‌పోర్ట్ కారిడార్, హయత్‌నగర్ కారిడార్‌లలో అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, ఎన్‌హెచ్‌ఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అలైన్‌మెంట్‌లు, స్టేషన్‌లను ఖరారు కూడా చేశారు. 78.4కి.మీటర్ల మెట్రో రెండో దశకు రూ.24,042 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. డీపీఆర్‌లో జాప్యం కారణంగా ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యత దక్కలేదు. ప్రస్తుతానికి గురువారం శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టు మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. దీంతో దాదాపు రూ.24కోట్ల వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.100 కోట్లు కేటాయించడమేంటనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి.

కేటాయింపులతో సరి..!

మెట్రో నిర్మాణం పనులు ప్రారంభమై ఏడేండ్లకుపైనే గడుస్తుంది. మొదటి దశ ప్రతిపాదిత కారిడార్‌లో 72 కిలో మీటర్లకు 69 కి.మీ. మేర రైళ్లు పరుగులు తీస్తున్నాయి. కానీ పాతబస్తీ మెట్రోకి సంబంధించి 5.5 కి.మీ రూట్ పనులు ఏడేండ్లు గడిచినా అడుగు ముందుకు పడడం లేదు. అయితే మెట్రో రైలు రెండో దశ నిర్మాణ పనుల్లో భాగంగా పాతబస్తీ మెట్రో విస్తరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 8న శంకుస్థాపన చేశారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల మెట్రో మార్గానికి పనులు ప్రారంభించారు. ఫలక్‌నుమా నుంచి శాలిబండ, చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం మీదుగా ఎంజీబీఎస్ వరకు ఈ కారిడార్ అందుబాటులోకి రానుంది. ఈ మార్గంలో మొత్తం నాలుగు స్టేషన్లు ఉంటాయి. మొత్తం 5.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న ఈ నిర్మాణానికి సుమారు రూ. 2వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. మెట్రో ప్రయాణం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా రెండో దశలో మొత్తం 78.4 కి.మీ కొత్త రైలు మార్గాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ మేరకు రూట్ మ్యాప్‌లను ఖరారు చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో మూడు మార్గాల్లో మెట్రో రైలు అందుబాటులో ఉంది. మియాపూర్-ఎల్బీనగర్, రాయదుర్గం-నాగోల్, జూబ్లీ బస్ స్టేషన్-మహాత్మాగాంధీ సెంట్రల్ బస్ స్టేషన్ మధ్య మెట్రో కారిడార్లు ఉన్నాయి. కొత్తగా నిర్మించే 5.5 కి.మీ కారిడార్ అందుబాటులోకి వస్తే జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా నేరుగా ఫలక్‌నుమా చేరుకోవచ్చు. కానీ తాజా బడ్జెట్ 2024-25లో రూ.500 కోట్లు కేటాయింపులు చేస్తున్నట్టు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రూట్లో దాదాపు 1100 ఆస్తులు ప్రభావితమవుతుండటంతో పాటు ఈ ప్రాజెక్టుకు రోడ్డు విస్తరణ, వినియోగాల తరలింపుతో కలిపి దాదాపు రూ.2వేల కోట్లు ఖర్చు కానుంది. గత ప్రభుత్వం రెండు దఫాలుగా బడ్జెట్‌లో కేటాయింపులకే పరిమితమైంది. ఈ ప్రభుత్వం కూడా స్వల్ప కేటాయింపులతో సరిపెట్టింది. వీటినైనా సకాలంలో మంజూరు చేసి.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టుగా పనులు ప్రారంభిస్తే.. ఓల్డ్‌సిటీకి మెట్రో కోసం ఎదురుచూస్తున్న అక్కడి ప్రజల కళ త్వరలోనే నెరవేరనుంది.

దేశపు ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్..

- ఈ నెల 26 నుంచి 28 వరకు ..
- అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

గుండె సమస్యలపై అవగాహన కోసం భారతదేశపు ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అపోలో హాస్పిటల్స్, కార్డియో వాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్, (సీఆర్‌ఎఫ్) యూఎస్‌ఏతో కలిసి ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ ఈ మూడు రోజుల 'టీసీటీ ఇండియా 2024' భారతదేశపు ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్‌ను హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించనుందని చెప్పారు. దేశ, విదేశాల నుంచి కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లతో కూడిన 1200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. భారత్ నుంచి 100 మంది, విదేశాల నుంచి 30 మంది అధ్యాపకులు ఇంటర్వెన్షనల్ కార్డియాలజీలో తాజా పురోగతులు ప్రతినిధులకు తెలియజేయనున్నారని తెలిపారు. ఇది అతిపెద్ద ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టుల సదస్సు అన్నారు. దీనికి దేశ, విదేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనేందుకు ఇంతవరకు అవసరమైన కార్డియాక్ సర్జరీకి అనేక ప్రత్యేక పద్ధతులు కలవ న్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రోగిని గాయం, అనారోగ్యం, మరణాల నుంచి కాపాడుతుందని తెలి పారు. గతంలో ధమనులు పూర్తిగా బ్లాక్ అయినప్పుడు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేసేవారన్నారు. ఇప్పుడు బ్లాక్ అయిన ధమనులను క్లియర్ చేయడానికి ప్రత్యేక పద్ధతులు ఉన్నాయన్నారు. అలాంటి అనేక కొత్త పద్ధతులను ఈ సమావేశంలో ప్రదర్శించనున్నామని చెప్పారు. నిపుణులను ఒకచోట చేర్చే వేదిక ఇదన్నారు. ఈ వేదిక ద్వారా ప్రతినిధులు జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. రోగులు త్వరగా కోలుకోవడానికి, అందరికి అందుబాటులో ఉండే తాజా పద్ధతులపై ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో హెమోడైనమిక్స్, ఇంట్రాకోరోనరీ ఇమేజింగ్, కాల్షియం మేనేజ్‌మెంట్, టీఏవీఆర్, ఇతర కొత్త ఆవిష్కరణలు వంటి వివిధ ఇంటర్వెన్షనల్ టెక్నిక్‌లలో సెషన్‌లు ఉంటాయి. యూఎస్‌ఏ, జర్మనీ, ఆస్ట్రేలియా నుంచి తొమ్మిది ప్రత్యక్ష ప్రసార కేసులతో కేస్ ఆధారిత అభ్యాసాలు ఉంటాయన్నారు.. భారతదేశంలోని వివిధ కేంద్రాల నుంచి 12 లైవ్ ఇన్ బాక్స్ కేసులు చూపించనున్నారు. దీంతో ఇది పాన్ ఇండియా నేషనల్ ఈవెంట్‌గా మారనుంది. లైవ్ కేస్‌ల తర్వాత లైవ్ కేస్ లెర్నింగ్ పాయింట్‌లు, ఇంటరాక్షన్‌లు, ఫ్యూచర్ ఆఫ్ స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్స్ వంటి ఆసక్తికరమైన అంశాలతో లెక్చర్‌లు ఉంటాయి. హార్ట్ ఫెయిల్యూర్ మేనేజ్‌మెంట్‌లో కొత్త పరికరాలు పాత్రపై చర్చ, అక్యూట్ ఎంఐ కొత్త కెనడియన్ వర్గీకరణ, క్లినికల్ ప్రాక్టీస్‌లో దాని ఔచిత్యం, రక్తపోటు ఉన్న వారి జీవనశైలి, వైద్య చికిత్సలు ఉంటాయి అని తెలిపారు.

బాధితులకు ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఓయూ

వివిధ రుగ్మతలతో సతమతమవుతూ తన కార్యాలయాన్ని ఆశ్రయించిన వారికి వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులను మంజూరు చేయించి ఆయా రోగులకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఉరటను కలిగించారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన అబ్దుల్ షోయాబ్ (చిలకలగూడ), వనమాల కష్ణ (లాలాగూడ), సంపత్ కుమార్(శ్రీనివాస్ నగర్), చంద్ర కాంత్ (సితాఫలమండీ), బేబి రేశ్వంత్ (పార్సిగుట్ట)లు వివిధ రుగ్మతలతో సతమతమవుతూ తమ వైద్యానికి సహకరించాలని ఎమ్మెల్యేను సితాఫలమండీ లోని ఆయన క్యాంపు కార్యాలయం ద్వారా ఆశ్రయించారు. ఈ మేరకు పద్మారావు గౌడ్ సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్.ఓ.సిని మంజూరు చేయించి సుమారు ఏడు లక్షల రూపాయల విలువచేసే విద్య ఖర్చు పత్రాలను ఐదుగురు రోగులకు గురువారం తన నివాసంలో అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్. నేతలతో పాటు సమన్వయకర్త రాజ సుందర్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం వరాల జల్లు



- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

ప్రపంచంలో అత్యంత ఉత్తమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దడానికి గతంలో ఎన్నడూ లేనంతగా హైదరాబాద్‌కు రూ. 10 వేల కోట్లు ప్రజా ప్రభుత్వం కేటాయించిందని జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసి రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ నగరంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గ్రేటర్ హైదరాబాద్ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసి అభివృద్ధికై రూ. 3065 కోట్లను కేటాయించడం అభినందనీయమన్నారు. అయితే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపడమనేది దుర్మార్గమైన చర్య అన్నారు. 8మంది బీజేపీ ఎంపీలుగా గెలిచి, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి రాష్టానికి తెచ్చిన నిధులు శూన్యం అన్నారు. తెలంగాణ పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న మోడీ బీజేపీ ప్రభుత్వ అసలు రంగు ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు గమనించి బుద్ధి చెప్పాలన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా నగర అభివద్ధి, సంక్షేమం కోసం, హెచ్ఎండీఏ, మూసి నది ప్రక్షాళనకు, హైడ్రా కోసం అదనపు నిధులను మొత్తంగా రూ.10 వేల కోట్లను రాష్ట్ర బడ్జెట్ నుండి కేటాయించడం కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వానికి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మీద ఉన్న చిత్తశుద్ధికి, నగర ప్రజల పట్ల ఉన్న ప్రేమకి నిదర్శనమని అన్నారు.



బోనాల వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-ఓయూ

చిలకలగూడ చారిత్రాత్మక కట్ట మైసమ్మ ఆలయం బోనాలు వేడుకలకు హాజరు కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ను ఆలయం పాలక మండలి ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆహ్వాన పత్రికను ఆలయం చైర్మెన్ గుంటి కష్ణ, కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్‌ల నేతృత్వంలో ని బృందం గురువారం పద్మారావు గౌడ్‌కు ఆయన నివాసంలో అందించింది. చిలకలగుడా బోనాలు వేడుకలు ఘనంగా జరపాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

భాగ్యశ్రీ ఆషాఢం సేల్స్ షురూ





నవతెలంగాణ-బంజారాహిల్స్

ఇటీవలే జూబ్లీహిల్స్‌లో నూతన స్టోర్‌ను ప్రారంభించిన భాగ్యశ్రీ జువెలరీస్ ఆషాఢమాస భారీ సేల్స్ ని ప్రకటించింది. జూబ్లీ చెక్‌పోస్ట్ లోని ఆ స్టోర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ అధినేత రోహిత్ గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రత్యేకంగా పేరుగాంచిన ఆషాఢంలో భారీ బంగారు కొనుగోలు జరుగుతాయన్నారు. అందులో భాగంగానే భాగ్యశ్రీ జ్యువెలరీస్లో ఆషాఢం సేల్స్ కొనసాగుతున్నాయని హిల్స్ ప్రజలతో పాటు నగర ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. తమ వద్ద ప్రత్యేక డిజైన్లతో తయారుచేే డైమండ్ నెక్లెస్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మలేషియా శాంతి సదస్సుకు ప్రొ.రాజేష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

ఈనెల 26 నుంచి 28 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సులో డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ పాల్గొననున్నారు. " ప్రదర్శన - శాంతి కోసం క్రీడలు" అనే అంశంపై ఆయన మాట్లాడనున్నారు.గతంలో ఆయన లండన్, జపాన్, చైనా, వియత్నాం, థాయిలాండ్, టర్కీ, ఫిలిప్పిన్స్, శ్రీలంక తదితర దేశాల్లో జరిగిన అనేక క్రీడా సదస్సుల్లో పాల్గొని ప్రసంగించారు.



జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని రోడ్ నంబర్ 5 ఉమెన్స్ కాలనిలోని జీహెచ్ఎంసీ పార్క్‌లో ప్రధాన రహదారి పై ఉన్న గోడ పిల్లర్ కూలడానికి సిద్ధంగా ఉంది. అయితే జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా వ్యాపారాలు చేసే వారు ఇచ్చిన సమాచారం మేరకు.. అన్నపూర్ణ స్టూడియో రోడ్డులో పార్కింగ్ వెళ్ళే వాహనాలలో ఏదో ఒక వాహనం దీన్ని ఢీ కొట్టినట్టు తెలిసింది. ప్రమాదం జరగకా ముందే ఈ సమస్యను అధిగమించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నవతెలంగాణ-బంజారా హిల్స్

అధికారులతో కోట నీలిమ సమావేశం



- బోనాల ఏర్పాట్లపై చర్చ

నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ హనుమాన్ దేవస్థానంలో ఆదివారం జరగబోయే బోనాలు సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోటా నీలిమ, సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఆర్.బి నరేష్ ఆధ్వర్యంలో వివిధ అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పరశురాం, రవీంద్ర చార్యులు, రిపుంజె శర్మ కోట నీలిమకు వేదమంత్రాలతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం సమావేశంలో కోటా నీలిమ మాట్లాడుతూ భక్తులను దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా హెల్త్ క్యాంప్ పెట్టాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఉపవాసాలు ఉంటారని కావున బోనంతో వచ్చే భక్తులందరకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాటర్ ప్యాకెట్లు అందజేయాలని అన్నారు. పబ్లిక్ టాయిలెట్లు అదనంగా ఉండేలా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కాకుండా కొంతమంది వాలంటరీలని కూడా ఉంచేలా చూడాలని, వాళ్లకు స్పెషల్ పాసులు అందేలా చూడాలని అన్నారు. వీఐపీ దర్శనాలకు ఎక్కువగా సమయం కేటాయించకుండా సాధారణ భక్తులకు, బోనం ఇచ్చే వాళ్లకు ఎక్కువ సమయాన్ని అందేలా చూడాలని సూచించారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒక అంబులెన్స్ ఉంచితే చాలా బాగుంటుందన్నారు. వాలంటరీలతో హెల్ప్ డెస్క్ కూడా ఉపయోగించేలా చూడాలని వివిధ అధికారులను కోరారు.

భట్టి బడ్జెట్.. వట్టి బడ్జెట్

- బీఆర్ఎస్ నాయకులు తుంగబాలు



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ మ్యానిఫెస్టో చూస్తే ఆకాశం.. అమలు చూస్తే పాతాళం అన్నట్టు బడ్జెట్ చూస్తే అర్థమవుతుందని బీఆర్ఎస్ నాయకులు తుంగబాలు అన్నారు. అసెంబ్లీలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క పెట్టిన బడ్జెట్ వట్టి బడ్జెట్‌గా ఉందని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని రైతులు, మహిళలు, దళితులు, గిరిజనులు, బీసీ, నిరుద్యోగులను ప్రభుత్వం మొత్తానికే మోసం చేసిందన్నారు. పాలనలోకి వస్తారో లేదో అనుకున్న కాంగ్రెస్ నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చే ప్రణాళికలు ఏం ఆశిస్తాం అన్నారు. రుణాలు ఇచ్చేదాన్ని కూడా మంత్రి భట్టి వత్తి వత్తి పలుకుతుంటే కాంగ్రెస్ తెలివికి బడ్జెట్ కేటాయించుకుంటే బాగుండు అన్నారు. బడ్జెట్ అంతా అంకెల గారడీ, సంఖ్యల పేరడీ, మాయమాటల సందడిలా ఉందని తెలిపారు. ఇకనైనా ఆర్థిక మంత్రి సరైన విధానంలో బడ్జెట్, ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర స్థితిని దిగజారకుండ చూడాలని తుంగ బాలు సూచించారు.

ఆహార ఉత్పత్తులతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న హెచ్‌ఎంఏ ఆగ్రో

నవతెలంగాణ-బేగంపేట్

హ్యాండిల్ ఫుడ్స్, అగ్రో ప్రొడక్ట్స్‌లో అగ్రగామిగా ఉన్న హెచ్‌ఎంఏ ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఏఎల్‌ఎం ఫుడ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఫెసిలిటీస్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బేగంపేట్ లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ హెచ్‌ఎంఏ ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆహార వాణిజ్య సంస్థగా పనిచేస్తుందన్నారు. ఘనీభవించిన సహజ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతో సహా నిర్వహించే ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులను కంపెనీ అందిస్తుందన్నారు. హెచ్‌ఎంఏ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సేవలు అందిస్తోందన్నారు. ఇది పూర్తి ఆటోమేషన్‌తో తయారీ, రిటైలింగ్ కోసం పూర్తిగా సమీకృత మౌలిక సదుపాయాలను కలిగి ఉందన్నారు.

రీబా ఇంటర్నేషనల్ అవార్డును అందుకున్న థాపర్ విశ్వవిద్యాలయం

నవతెలంగాణ-బేగంపేట్

థాపర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ తమ థాపర్ యూనివర్శిటీ లెర్నింగ్ లాబొరేటరీ ప్రతిష్టాత్మకమైన రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిటిష్ ఆర్కిటెక్ట్స్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ 2024తో సత్కరించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

గురువారం బేగం పేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డిజైన్ ప్లస్ అసోసియేట్స్ సర్వీసెస్ సహకా రంతో ఈ అత్యాధునిక సదుపాయం దాని బలవంతపు రేఖాగణిత నిర్మాణం, వినూత్న రూపకల్పనకు గుర్తింపు పొందిందన్నారు. డిజైన్‌లో స్టోన్ బ్రైస్ సోలైల్, హెవీ నిర్మాణం, ఆర్కిటెక్చరల్ షేడింగ్, నేచురల్ వెంటిలేషన్ ద్వారా పగటి వెలుతురుతో ఫిల్టర్ చేసిన బహుళ అంతస్తుల కర్ణికలు, పందిరి కింద గాలిని చల్లబరుస్తుందని అన్నారు సౌకర్యవంతమైన మరియు స్థిరమైన వాతావరణాన్ని నిర్ధారిస్తుందన్నారు. ఇది మొదటి అంతస్తు స్థాయిలో ఒక పోడియం ద్వారా పూర్తి చేసినట్టు తెలిపారు.



ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా బోరబండ డివిజన్ లోని అన్ని అమ్మవార్ల దేవాలయాలకు ప్రతి సంవత్సరం ఆనవాయితీగా, సంప్రదాయం ప్రకారం పట్టు చీర సారె, పుజ సామగ్రి, అన్నదానం సదుపాయం మొదలగునవి, ఈ సంవత్సరం కుడా అందజేయనున్న బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటి మేయర్ మొహమ్మద్ బాబా ఫసియుద్దీన్. నవతెలంగాణ-జూబ్లీహిల్స్



టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ సమక్షంలో గురువారం టీఎన్జీవోస్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం.హుసేని (ముజీబ్) వల్లభ నగర్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ నుంచి రిజిస్ట్రేషన్ ఆఫీస్, హైదరాబాద్ జిల్లాకి బదిలీ అయిన శుభ సందర్భంలో హైదరాబాద్ జిల్లా రిజిస్టర్ వల్లి సుబ్బలక్ష్మి పూల బొకేతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు కేఆర్ రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుని సాధారణ బదిలీ ప్రక్రియ సందర్భంగా బదిలీ అయిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్

నవతెలంగాణ-కల్చరల్

హైదరాబాద్ రంగా రెడ్డి (ఈస్ట్ రీజియన్) రాష్ట్ర గురుకుల కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరం కు గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఒకేషనల్ గ్రూప్ లతో కలసి మిగిలివున్న ఖాళీలకు బాలికలకు చేవెళ్లలోని రాష్ట్ర సంక్షేమ గురుకుల పాఠశాలలో ,ఈ నెల 26వ తేదీ(నేడు), బాలురకు కందుకూర్ లోని సంక్షేమ గురుకుల పాఠశాల లో 27వతేదీ(రేపు),ఉదయం 9 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్ కు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని జోనల్ ఆఫీసర్ నాగ కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు

చిత్రలేఖనంలో నాలుగేండ్ల రుత్విక రికార్డ్





నవతెలంగాణ-కల్చరల్

పులి కడుపున పిల్లి పుడుతుందా అన్నది ఒక సామెత. తల్లి ప్రతిమ బోటు జాతీయ స్థాయి లో చిత్ర కారిణిగా గుర్తింపు పొంది పలు అవార్డ్స్ గెలుచుకొన్నారు తల్లి బాటలోనే నాలుగేండ్ల రుత్విక 10X10 ఇంచిల కాన్వస్ పై ఆరు నిమిషాల వ్యవధిలో ఆకుపచ్చ భూమి పై నుంచి ఉదయిస్తున్న సూర్యుడిను చిత్రించి రికార్డ్ నమోదు చేశారు. ఈ చిత్ర నేపథ్యం జాతీయ పతాకం ఆనవాళ్లు పోలి ఉంటుంది. ఈ సందర్భంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి చింతపట్ల వెంకటాచారి రికార్డ్ నమోదు పత్రాన్ని రుత్విక కు అందజేశారు

నగరంలో ఎడతెరిపిలేకుండా చిరు జల్లులు





హైదరాబాద్‌లో గురువారం ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరుజల్లులు ఆగకుండా కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వానతో రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి
నవతెలంగాణ-సిటీబ్యూరో









అధికారులు, ప్రజల సమన్వయంతో జాతర విజయవంతం







- మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-బేగంపేట్

వివిధ శాఖల అధికారులు, ప్రజల సమన్వయంతో బోనాల జాతర విజయవంతమైందని మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉజ్జయిని మహంకాళి జాతర సహకారాలు అందించిన మంత్రులు దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, దేవదాయ కమిషనర్ హనుమంతరావులను మహంకాళి ఈవో మనోహర్ రెడ్డి గురువారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులు సహాయ సహకారాల వల్లే జాతర విజయవంతమైందని తెలిపారు. అలాగే వివిధ శాఖల అధికారులు సమన్వయంతో జాతర విజయవంతమైందని వారు ప్రజలకు భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మంత్రులు తెలిపారు. మంత్రులను కలిసి ఉజ్జయిని మహంకాళి దేవాలయంఈవో మనోహర్ రెడ్డిని మంత్రులు అభినందించారు.

దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-బంజారా హిల్స్



నగరంలో దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వాలంటీర్ విద్యార్థులకు,అర్ పి.,ఎంటోమెలజీ, జిహెచ్ఎంసి అధికారులకు సూచించారు.గురువారం జూబ్లీ హిల్స్ డివిజన్ పరిధిలోని ఫిల్మ్ నగర్ ఎఫ్ఎన్‌సీసిలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి ఆమె మాట్లాడారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, వర్షాకాలంలో డెంగ్యూ,చికెన్ గున్యా టైఫాయిడ్,డయోరియా,విష జ్వరాలు లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి రూ. పదివేల కోట్లు స్వాగతిస్తున్నాం

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో



గ్రేటర్ హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు, మూసీ అభివృద్ధి, మెట్రో రైల్, తాగునీటి సరఫరా కోసం పదివేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర బడ్జెట్‌లో చేసిన కేటాయింపులను సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ స్వాగతించింది. ఈ మేరకు గురువారం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. కోటి జనాభా కలిగి వేగంగా విస్తరిస్తున్న నగరానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోనప్పటికీ నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని మొదటి బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులను సరైన దిశలోనే జరిగాయని, వీటిని పూర్తిస్థాయిలో అమలు జరపాలని ఆయన కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి కీలకంగా పని చేసే జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండిఏ సంస్థలకు నిధులు ఇవ్వకుండా అప్పులతోనే అభివృద్ధి పనులు చేసుకోవాలని చెప్పడంతో ఈ సంస్థలన్నీ పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయాయని చెప్పారు. హైదరా బాద్‌లో జరిగిన అభివృద్ధి అప్పులతోనే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులతో కాదని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిం చిన నిధులను నాలాలు, డ్రయినేజీ, రోడ్ల అభివృద్ధి తో పాటు నగర జనాభాలో 20 శాతంగా ఉన్న 1700 మురికివాడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఖర్చు చేయాలని సీపీఐ(ఎం) తరపున కోరుతున్నామని ఎం.శ్రీనివాస్ తెలిపారు. మెట్రోరైల్‌కు ప్రాధాన్యత ఇచ్చిన మాదిరిగానే ప్రజారవాణాభివృద్ధికి నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచేందుకు తగిన కేటాయింపులు జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

31లోగా ఐటీఆర్ సమర్పించాలి

- తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ అశిష్ కుమార్ శుక్ల

నవతెలంగాణ-సిటీబ్యూరో



పన్ను చెల్లింపు దారులు ఎలాంటి తప్పుడు క్లెయిమ్స్ చేయరాదని, నిబంధనల మేరకు ఐటీఆర్ (ఇన్కమ్ టాక్స్ రిటర్న్) ఫైలింగ్ చేయాలని ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఆశిష్ కుమార్ శుక్ల సూచించారు. గురువారం ఆదాయ పన్ను శాఖ అధికారులు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల డ్రాయింగ్ అండ్ డిస్బర్ సింగ్ అధికారులు, జోనల్, సర్కిల్ అధికారులు, ఎస్టాబ్లిష్మెంట్ క్లర్కులకు ఐటీఆర్ ఫైలింగ్, టాక్స్ చెల్లింపుదారుల బాధ్యతలు, పన్ను ఎగవేత, తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్‌పై ఐటీ నిబంధనల మేరకు గల చర్యలు, ఇన్కమ్ ఫైలింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశిష్ కుమార్ శుక్లా మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్స్ ఫైలింగ్‌లో అన్ని రకాల ఆదాయ వివరాలు ఇవ్వాలని, మినహాయింపులు, డిడక్షన్‌కు సంబంధించిన డాక్యు మెంట్లు డీ.డీ.ఓకు సమర్పించాలన్నారు. ఎలాంటి తప్పుడు వివరాలు ఇవ్వకూడదన్నారు. కొత్త/పాత రీజిమ్ లో ఆదాయ పన్ను రిటన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. ఐటీఆర్‌ను ఈ నెల 31లోగా సమర్పించాలని, ఐటిఆర్ సమర్పణలో డాక్యుమెంటేషన్ ప్రాపర్‌గా సమర్పించాలన్నారు. ఏవేని సందేహాలు ఉన్నట్లయితే బషీర్‌బాగ్‌లో ఐటీ కార్యాలయానికి నేరుగా వచ్చి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి సందేహాలను నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా రాధిక, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర రెడ్డి, ఆదాయ పన్ను శాఖ అధికారులు వేణుగోపాల్, వందన, జిహెచ్ఎంసి వివిధ విభాగాల అధికారులు, జోనల్, సర్కిల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఫతుల్ల గూడ చెరువు సర్వే

నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్ పరిధిలోని ఫతుల్ల గూడ చెరువు ఆక్రమణకు గురవుతుందన్న ఫిర్యాదులతో ఇటీవల ఈవిడీఎం కమిషనర్ ఏవి రంగనాథ్ సందర్శించి పరిశీలించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన ఆదేశాల మేరకు గత రెండు రోజుల నుండి ఉప్పల్, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు , ఈవిడీఎం అధికారుల ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన చెరువు ఎఫ్‌టీఎల్‌ను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నీటిపారుదల శాఖ ఏఈ నాగరాజు, ఉప్పల్ ,అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, ఈవీడిఎం అధికారులు ఫ తుల్ల గూడ చెరువు బఫర్ జోన్‌లో సర్వే లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిధిలను గుర్తించి ఎఫ్‌టీఎల్ నిర్ణయిస్తామని తెలిపారు.

బ్రెయిన్ వెంచర్స్ ఆంగ్ల హాస్య నవల ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్



మనిషి మెదడు చేసే పలు విన్యాసాల పై హాస్య మిళితంగా కథ చెప్పిన అంజన లో రచనా శక్తి ప్రశంసనీయమని గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై అమెరికా లో స్థిర పడిన తెలుగు అమ్మాయి గోలి అంజన రచించిన బ్రెయిన్ వెంచర్స్ ఆంగ్ల నవల ఆవిష్కరణ సభ త్యాగరాయ గానసభ నిర్వహణలో జరిగింది. అధ్యక్షత వహించిన కళా జనార్దన మూర్తి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. అంజన గతంలో వ్యక్తిత్వ వికాసం పై రాసిన సంపుటి పలువురి ప్రశంసలు పొందినదని వివరించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న హస్యావదాని జర్నలిస్ట్ శంకర నారాయణ మాట్లాడుతూ హాస్య రచన చేయటం సులువు కాదని అన్నారు. హాస్యం పండక పోతే అపహాస్యం అవుతుందని అన్నారు. అంజన బ్రెయిన్ వెంచర్స్ తొలి నవలలో నే హాస్య రసాన్ని తన కథనం లో ఆసక్తి కరం గా చెప్పారని ప్రశంసించారు. పాటల రచయిత అర్.విశ్వేశ్వర రావు, వడ్ల కొండ వెంకట రావు లు మాట్లాడుతూ అంజన భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ రచనలు చేయగలరని ఆకాంక్ష వ్యక్తం చేశారు

ఐ ఏట్ ఇండియా ఆలోచనాత్మకం

నవతెలంగాణ-కల్చరల్



దేశ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలకు పైగా అయినా సామాన్యుల జీవితాలలో మార్పు రాలేదు. పేదరికం నిర్మూలిస్తామని ఎన్నికల ముందు నాయకులు వాగ్దానాలు సహజమే కానీ ఇప్పటి వరకూ పెదలు పేదలు గానే మిగిలి పోయారు. దీని నేపథ్యం లో ఐ ఏట్ ఇండియా నాటకం (నేను తిన్నాను, నేను తింటాను, నేను తినేసాను) న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణ లో రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రదర్శితం అయినది. ఒక కడుపు మండిన పెద వాడు ఓటు కోసం వచ్చిన నాయకుడిని ప్రశ్నల వర్షంతో నిలదీసాడు. ఆలోచనలు రేకెత్తించే ఈ నాటకం డాక్టర్ ఎం.ఎస్. చౌదరి రచించి దర్శకత్వం వహించారు ప్రతి నెలా టికెట్ పై నాటకం ను ఉద్యమంగా చేపట్టిన ప్రముఖ నాటక సంస్థ రస రంజని నిర్వహణ లో ప్రదర్శించారు.



బీసీ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌కు మైసమ్మ బోనాల ఉత్సవాలకు ఆహ్వానం పత్రికను ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివ కమార్, నాయకులు కోట్ల కిరణ్ కుమార్, సందీప్ నవతెలంగాణ-అంబర్‌పేట



నాంపల్లి ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప ఎక్స్టర్నల్ అసేస్మెంట్ బృందం డాక్టర్ అమీర్ సింగ్, ఎన్ హెచ్ ఎం శ్రీకాంత్ రాజు, షేర్ ఇండియా ఆఫీసర్ శ్రీదేవి, నవీన్,ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ఆర్ఎంఓ డా.శ్రీలత, హెచ్ఐసీసీ డాక్టర్ రేవంత్ డా. శ్రీదేవి, గ్రేటు నర్సింగ్ సూపర్డెంట్ మల్లీశ్వరి, ఫెసిలిటీ మేనేజ్మెంట్ ఇన్‌చార్జి ఎం.సదానంద్, వై శ్రీనివాస్, సిబ్బంది తదితరులు నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాయల చంద్రశేఖర్ కృషి ఎనలేనిది

- సీపీఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ కృషి ఎనలేనిదని సీపీఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ నాయకులు గుర్తుచేసుకున్నారు. సీపీఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఆలిండియా కన్వీనర్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ గురువారం మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు వి. ప్రవీణ్ అధ్యక్షతన విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో జరిగింది. ఈ సంతాప సభలో మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. హన్మేశ్, పార్టీ సెక్రటేరియట్ సభ్యులు ఎస్.ఎల్. పద్మ , పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, ప్రదీప్ (పీవైఎల్), రామకృష్ణ (పీడీఎస్ యు), వరలక్ష్మి, లక్ష్మిబాయి (పీఓడబ్ల్యు), నల్లన్న (ఐఎల్టీయు)నాయకులు హాజరై రాయల చంద్ర శేఖరన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎం. హన్మేశ్ మాట్లాడుతూ.. 1978 సం. నుండి 2024 16వ తేదీ వరకు విప్లవోద్యమంలో కృషి చేశారు. ఇంటర్ చదువుతున్నప్పుడే ఖమ్మంలో పీడీఎస్‌యు నాయకులుగా ఎదిగాడని గుర్తు చేసుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ ప్రాంతాల్లో పనిచేశారు. పార్టీ ఏ పని ఆదేశిస్తే, దానికి క్రమశిక్షణగా పూర్తి చేసేవాడని తెలిపారు. ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ.. చంద్ర శేఖరన్న ప్రజాపంథా రాజకీయాల వైపు దృఢంగా నిలబడ్డాడన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కేఎం) బస్సు యాత్రలో 30 రోజుల పాటు తిరిగాడు. 400 రోజుల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతాంగ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించాడు. ఎక్కువ సమయాన్ని ఉద్యమానికి కేటాయించారు. మొదట నుండి రైతాంగ ఉద్యమంలో పనిచేస్తూ కేంద్ర స్థాయికి వెళ్ళారని తెలిపారు. రాయల చంద్రశేఖరన్న ఆశయాలను కొనసాగించాలని అన్న మరణం బాధాకరమన్నారు. ఈ సభలో ఎస్. నాగేశ్వరరావు, అనిల్, ప్రదీప్, క్రిష్ణ, లింగం గౌడ్, ప్రభాకర్, అఫ్జల్, వెంకటేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం



నవతెలంగాణ-మెహిదీపట్నం

విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని గుడిమల్కాపూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం - సమాజాన్ని మేలుకొలుపుదాం" అనే అంశంపై ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఝాన్సీ దేవాలయం హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది యువకులు డ్రగ్స్‌కు బానిసలై వారి జీతాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత మేల్కొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను అరికట్టడం మనందరి బాధ్యత అని డ్రగ్స్‌ను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కళ్యాణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన జీవితంలో ఉన్నతమైన స్థితికి వెళ్లడానికి ఒక లక్ష్యం ఏర్పరచుకొని దానిని చేరడానికి కష్టపడి చదవాలన్నారు. ప్రజానాట్యమండలి నగర అధ్యక్షురాలు శశికళ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోతారని, అరవడం, కేకలు వేయడం డిప్రెషన్‌లోకి వెళ్లిపోవడం వంటివి జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర సహాయ కార్యదర్శి ఏడుమేకల శ్రీశైలం, ప్రజానాట్యమండలి నాయకులు లావణ్య. సురేష్, గుడమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా, నిరుద్యోగ అంశాలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ సర్కార్

- పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.మహేష్, ఎస్‌వి శ్రీకాంత్

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా నిరుద్యోగ అంశాలను గాలికి వదిలేసిందని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పి.మహేష్, ఎస్ వి. శ్రీకాంత్ లు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై గురువారం పత్రిక ప్రకటన ద్వారా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరుద్యోగులు, విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్‌ను చూస్తే ఉసూరుమనేలా ఉంది. రాష్ట్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే నిరుద్యోగం, విద్యా అంశాలను గాలికి వదిలేసినట్లు కనిపిస్తుంది. మొత్తం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2,91,159 కోట్లు కాదా దీనిలో కేవలం 21,292 కోట్లు విద్యారంగానికి కేటాయించారని తెలిపారు. వీరు కేటాయించిన బడ్జెట్ ఏ మూలకు సరిపోవు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలు లేక వెంటిలేషన్ పై ఉన్నాయి. ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కోసం ప్రత్యేకమైన గ్రాంట్లు విడుదల చేయాల్సింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 30% నిధులను కేటాయించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి స్పష్టమైన విధి విధానాలను తయారు చేయాలని డిమాండ్ చేశారు.

'హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడంపై హర్షం'

- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ మహా నగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్ లో రూ.10 వేల కోట్లు కేటాయించడంపై సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, పాతబస్తీ మెట్రో రైల్ జేఏసీ నేత ఈ.టీ.నరసింహ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇందులో శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైల్ విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ కు రూ.1,500 కోట్లు, రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్ కు రూ.1,525 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్ కు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌కు రూ.500 కోట్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ కు రూ.3,385 కోట్లు, హైడ్రాకు రూ.200 కోట్లు కేటాయించడంతో పాటు హైదరాబాద్ పాతబస్తీ మెట్రో రైల్ విస్తరణకు రాష్ట్ర బడ్జెట్ లో రూ.500 కోట్లు కేటాయించడం శుభపరిణామన్నారు. కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేసి పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఎ.రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాతబస్తీ మెట్రో రైల్ విస్తరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, పనులు చేపట్టాక పాతబస్తీ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాతనగరం అభివృద్ధిని ఆకాంక్షిస్తూ కేటాయించిన మెట్రో రైల్ నిధులను వెంటనే విడుదల చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి, ఏడాది లోపు పూర్తి చేసి, పాతబస్తీ ప్రజలకు మెట్రో రైల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

'మాదిగల ఓట్లపై ఉన్న ప్రేమ ఎస్సీ వర్గీకరణపై లేదు'

- మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (దండోరా) రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మాదిగల ఓట్లపై ఉన్న ప్రేమ ఎస్సీ వర్గీకరణ అంశంపై లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (దండోరా) రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ విమర్శించారు.గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'మాదిగల మహాధర్నా'కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ లో 'మాదిగల మహాధర్నా'ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో జరిగే ఈ మహా ధర్నాకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ధర్నాకు మాదిగలు, మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా మోడీ ప్రభుత్వం పార్లమెంట్ లో ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సమితి జాతీయ కార్యదర్శి చిగుళ్ల యాదయ్య, ఉపాధ్యక్షులు జీడి నరసింహ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంగపాక యేసుఫ్, పి.గెల్వయ్య, మంచాల యాదగిరి, కార్యదర్శి సి.హెచ్.సాయిలు తదితరులు పాల్గొన్నారు.


'బడ్జెట్‌లో హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం'

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రసంగం ఒక కథలా రాజకీయ ప్రసంగల్లా ఉందని సెంట్రల్ హైదరాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు అన్నారు. నిధులు విడుదల చేయకుండా హైదరాబాద్ నగరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ప్రభుత్వాన్ని నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సెంట్రల్ హైదరాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో బర్కత్‌పూర చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు మాట్లాడుతూ మూసీనది కోసం తూతూ మంత్రంగా రూ.1500 కోట్లు ప్రకటించారని కొత్తగా ఒక పాలసీ కూడా తీసుకురావలేదని హైదరాబాద్ నగర ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమాల ఆనంద్ గౌడ్, కన్నె రమేష్ యాదవ్, ఎక్కాల కన్నా, శ్యామ్ రావు, నాగభూషణం చారి, యశ్వంత్, సూర్య ప్రకాష్ సింగు, దయాకర్ యాదవ్, అచ్చిని మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో గ్రేటర్‌కు పెద్దపీట

జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్‌కు రూ.3,385 కోట్ల ప్రతిపాదన




నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి పెద్దపీట వేసింది. తెలంగాణలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,91,159 కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను అసెంబ్లీలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రాష్ట్ర అభ్యున్నతికి అవసరమైన ఆర్థిక వనరులను అందించే గుండెకాయ లాంటి హైదరాబాద్‌లో శాంతి భద్రత పరిరక్షణతో పాటు అన్ని రంగాలల్లో మరింత అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా నగరానికి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించడంలో జీహెచ్ఎంసీ, మెట్రోవాటర్ వర్క్స్ ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతులకు రూ.3,065 కోట్లను ప్రతిపాదించగా, నగరానికి మంచినీటి, డ్రయినేజీ వ్యవస్థ మెరుగుపరచడానికి మెట్రో వాటర్ వర్క్స్‌కు రూ.3,385 కోట్లను ప్రతిపాదించారు. దాంతో శంషాబాద్ విమానాశ్రయం మొదలుకొని ఓఆర్ఆర్ వరకు, తాగునీటి అవసరాల కోసం మంజీరా, కృష్ణా, గోదావరి జలాలు సరఫరా చేయనున్నారు.

నగరాభివృద్ధికి రూ.10వేల కోట్ల ప్రతిపాదనలు

హైదరాబాద్ మెట్రోప్లాన్ ప్రాంతంలో రానున్న 30ఏళ్ల కోసం పక్కా. మాస్టర్‌ప్లాన్ తయారీకి సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు 2050 మాస్టర్‌ప్లాన్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఎకనామిక్ డెలప్మెంట్ ప్లాన్‌లో భాగంగా ఒక సమగ్ర నివేదికకు రూపకల్పన చేస్తున్నారు. ప్రపంచంలో టాప్-10 గ్లోబల్ నగరాల సరసన హైదరాబాద్‌ను చేర్చేందుకు కావాల్సిన అన్ని వ్యూహాలను అనుసరిస్తున్నారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమలు రోజురోజుకు అభివృద్ధి చెందుతుండడంతో గ్రేటర్ హైదరాబాద్ కిటకిటలాడుతోంది. శివారు ప్రాంతాలకు సైతం మరింత విస్తరిస్తే ప్రపంచ దేశాలు నగరం వైపే చూసే అవకాశాలున్నాయని గుర్తించిన ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రాకు రూ.200కోట్లు, ఔటర్‌రింగ్ రోడ్డు కొరకు రూ.200 కోట్లను ప్రతిపాదించారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి ఎన్నడు లేని విధంగా భారీ ఎత్తున రూ.10వేల కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇంతటి ఘనమైన నగరాన్ని మరింత విస్తరిస్తే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మూసీ అభివృద్ధికి రూ.1500 కోట్లు..



ఓఆర్ఆర్ లోపల అర్బన్ జోన్‌గా, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య పెరి అర్బన్ జోన్, ఆర్ఆర్ఆర్ అవతలి ప్రాంతాన్ని గ్రామీణ జోన్‌గా ఏర్పాటు చేయడంతో నగరంతోపాటు శివారు ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందనుంది. ఇప్పటికే మూసీని అందమైన హారంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్య మంత్రి పదేపదే ప్రస్తావన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూసీ అభివృద్ధికి రూ.1500 కోట్లతో ప్రతిపాదించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంటు ప్రాజెక్టులో భాగంగా పాదచారుల జోన్లు, పీపుల్స్ ప్లాజాలు, ఓల్డ్ సిటీలోని హెరిటేజ్ జోన్లు, హాకర్స్ జోన్లు, చిల్డ్రన్స్ థీమ్స్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు అభివృద్ధి చేయనున్నారు. మూసీ నది, నదీ తీరాన్ని ఒక ప్రణాళికతో అద్భుతంగా తీర్చిదిద్దడంతో నగరవాసుల ఎన్నోఏండ్ల కల నిజం కానుంది. సాంస్కృతిక కట్టడాలతో మూసీ అందంగా తయారు కానుంది. భవిష్యత్తులో చార్మినార్, హైటెక్‌సిటీ, సాలాం జంగ్ మ్యూజియం వంటి పర్యాటక స్థలాలతో పోటీపడడంలో ఎలాంటి సందేహం లేదు. దాంతో మూసీ పరివాహక ప్రాంతాలు ఉపాధికల్పనా జోన్‌గా మారుతుంది.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అరికట్టాలి

ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ప్రతినిధులు



నవతెలంగాణ-ముషీరాబాద్

వర్షాకాలంలో వాతావరణ మార్పుల వలన అనేక సీజనల్ వ్యాధులు వస్తున్నాయని, వీటిని అరికట్టేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ప్రతినిధులు గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నగరంలోని బస్తీల్లో పారిశుద్ధ్యం పనులు లేక, దోమల నివారణ చర్యలు లేక, దోమల విలయతాండవం చేస్తున్నాయన్నారు. డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలతో ప్రజలు మంచాన పడ్డారన్నారు. డెంగ్యూ జ్వరం వచ్చిన బాధిత కుటుంబం ఇంటికి ఆగమేఘాలుగా అధికారులు పరిగెత్తుతూ, ఇంటి వద్ద పిచికారి చేస్తున్నారు. కానీ, ముందుగా వాటి నివారణ చర్యలు ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నించారు. దోమల నివారణకి నగరంలో 2500 మంది ఎంటమాలజీ సిబ్బంది ఉన్నా నివారణ చర్యలు చేపట్టడం, ఫాగింగ్ చేయడం లాంటి పనులలో నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె. ఎస్ ప్రదీప్, పి.ఓ.డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు డి. స్వరూప, పి.వై.ఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవికుమార్, బి.ఎస్ కృష్ణ, పి.ఓ.డబ్ల్యు గ్రేటర్ హైద్రాబాద్ కార్యదర్శి వరలక్ష్మి, పి.వై.ఎల్, పి.ఓ.డబ్ల్యు గ్రేట్ హైదరాబాద్ నాయకులు బంగారు శ్రీనివాస్, కొల్లూర్ భీమేష్, మల్లేష్, నిర్మల, బాలు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంకెల గారడీతో మభ్యపెట్టారు

- స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంకెల గారడితో ఎవ్వరికి వాళ్లే పోటీపడుతున్నారని స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రతి సంవత్సరం అంకెలు పెరుగుతున్నాయి కానీ పేదల జీవితాలు మారడం లేదన్నారు. గత సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి చర్చలేదు, ఆ బడ్జెట్ ఎంతవరకు సాధించామో పరిశీలనలేదు. ఎప్పటికప్పుడు ఆ ఆర్థిక సంవత్సరం అంకెలతో మాయచేయడమే జరుగుతుంది. అటు కేంద్ర ప్రభుత్వమైనా, ఇటు రాష్ట్ర ప్రభుత్వమైనా కోట్ల లక్షల బడ్జెట్లు ప్రవేశపెట్టినా సరైన ఉచిత వైద్యం, సరైన ఉచిత చదువు అందరికి అందించలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనాథలు నిరాశ్రయుల సంక్షేమమే పటించుకోలేదని సంచారజాతులకు బడ్జెట్‌లో స్థానమే కలిపించలేదని తెలిపారు.

'మహిళలు దృఢ సంకల్పంతో పోరాడాలి'

- ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ
- పీఓడబ్ల్యూ రాష్ట్ర 7వ మహా సభల లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మారుతున్న సమాజంలో మహిళలు దృఢ సంకల్పంతో పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఏడవ మహా సభలను ఆగస్టు 31న నిర్వహిసున్నామన్నారు. అదే రోజు వీఎస్టీ నుండి మహిళల ప్రదర్శన ప్రారంభమవుతుందని, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బహిరంగ సభ, సెప్టెంబర్ 1, 2వ తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతినిధుల సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి పద్మశ్రీ శాంతా సిన్హా మెగసెసే అవార్డు గ్రహీత అధ్యక్షతన 80 మంది తో ఆహ్వాన సంఘం ఏర్పడిందని ఆమె తెలిపారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో 7వ మహా సభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి.ఝాన్సీ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో మహిళల పరిస్థితులు మరింతగా దిగజారు తున్న నేపథ్యంలో ఈ మహా సభలను నిర్వహిస్తున్నామ న్నారు. స్త్రీలపై లైంగిక దాడులు, పసిపిల్లలపై పాశవికమైన అత్యాచార సంఘటనలు తెలంగాణలో నిత్యం కొనసాగుతూనే ఉన్నాయని, గతంలో ఎన్నడూ లేనంతగా మహిళలపై హింస పెరిగిందన్నారు. మహిళలు, దళితులు, ఆదివాసీల హక్కులపై దాడి చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మహిళలపై వివిధ రూపాల్లో కొనసాగుతున్న పితృస్వామిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాలు నిర్మాణం చేసే కర్త వ్యాలను ఈ మహా సభలో చర్చించి రూపొందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బాడీ డోనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు గుత్తా జ్యోత్స్న, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, ప్రముఖ సామాజిక కార్యకర్త అంబికా, ప్రొఫెసర్ రమా మేల్కోటే, ప్రొఫెసర్ మేరీ జాన్, ప్రముఖ హక్కుల నేత కల్పన, ప్రొఫెసర్ పద్మజషా, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, మర్రిగూడెం సర్పంచ్ చింతా రజిత, ఇప్టు జాతీయ అధ్యక్షులు డాక్టర్ అపర్ణ, సంఘం ఉపాధ్యక్షురాలు జి.అనసూయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కావేరి, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సుజాత, ప్రేమలత, పుష్ప, నవ్య, సంతోషి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్ పేట్

యువతి అదృశ్యమైన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్ఐ రాజు అంబిక తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్ హాట్ రహీం పుర ప్రాంతానికి చెందిన బిరాధార రాజ్ కుమార్ కూతురు బిరాధార మాల శ్రీ(19) రహీం పుర ఎస్ఎస్కే జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ నెల 23న ఇంట్లో నుండి బయటకు ఎంతకీ తిరిగిరాక పోవడంతో కుటుంబీకులు స్థానికంగా, బందు మిత్రులతో వాకాబు చేశారు ఫలితం లేక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ క్రీడలు యువజన సర్వీసుకు రూ. 325 కోట్ల కేటాయించడం హర్షణీయం

- స్పోర్ట్స్ ఫిజికల్ ట్రైనర్ జేబీఎల్ బాబూలాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

అంతర్జాతీయ క్రీడాకారులు, యువజన సర్వీసులకు 325 కోట్లు బడ్జెట్ కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ ఫిజికల్ ట్రైనర్ జేబీఎల్ బాబూలాల్ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడాకారులు యువజనులకు నిధులు కేటాయించడం పై పత్రికా ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులు అభ్యున్నతి కోసం శిక్షణ కొరకు గత ప్రభుత్వం కేవలం 110 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు

- పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనూ రాష్ట్ర బడ్జెట్ విద్యార్థులను మోసగించిం దని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై పత్రికా ప్రకటన ద్వారా స్పందించారు. ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో 2024-25 వార్షిక బడ్జెట్ ను 2,91,159 కోట్లతో ప్రవేశపెట్టింది. దీనిలో విద్యారంగానికి కేవలం 21,292 కోట్లు అంటే 7.31 శాతం మాత్రమే కేటాయించారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా విద్యారంగానికి బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ పార్టీ నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో విద్యారంగానికి బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 30% నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ హర్షణీయం

- ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పెట్టిన బడ్జెట్ బడుగు, బలహీన వర్గాలకు నగర అభివృద్ధికి ఎంతో తోడ్పాటున అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరమన్నారు. ఈ బడ్జెట్‌లో హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం. ఇందులో మెట్రో వాటర్ వర్క్స్, ఔటర్ రింగ్, మూసీ రివర్ ఫ్రంట్ ప్రక్షాళన వంటివి ఉన్నాయి.

లిజ్జత్ పాపడ్ వెనక ఆమె



పురుషాధిక్య ప్రపంచంలో ఓ మహిళ నాయకత్వ స్థానానికి ఎదగడం అంటే సాధారణ విషయం కాదు. ఇక వ్యాపారమంటే కుటుంబాల నుండి వారసత్వంగా స్వీకరించేవారే ఎక్కువ. ఇలాంటి వారు వ్యవస్థాపకులుగా మాత్రమే కాక శతకోటీశ్వరులుగా ఎదుగుతారు. అయితే పద్మశ్రీ గ్రహీత జస్వంతిబెన్ జమ్నాదాస్ పోపట్ అలాంటి వారసత్వానికి అతీతం. భారత చరిత్రలోనే ఈమె స్ఫూర్తిదాయక కథకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. అదే 62 ఏండ్ల కిందట ఆమె ప్రారంభించిన బ్రాండ్ లిజ్జత్ పాపడ్. తన ఏడుగురు అక్కచెల్లెళ్లతో కలిసి ఆనాడు ఆమె ప్రారంభించిన ఆ ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక మంది మహిళల స్వతంత్రతకు, సాధికారతకు కేంద్రంగా ఉంది.

ప్రస్తుతం 94 ఏండ్ల జస్వంతిబెన్ అందులో 65 ఏండ్లు సోదరీమణులతో కలిసి ప్రారంభించిన వ్యాపారానికి తన జీవితాన్ని అంకితం చేసింది. ఉపాధి సరిగా దొరకని కాలం అది. చదువులూ అంతంత మాత్రమే. అలాంటి సమయంలో తన పెద్ద కుటుంబానికి ఆర్థికంగా సహకరించాలని 1959లో ఏడుగురు మహిళలు కలిసి ప్రారంభించిన బ్రాండ్ లిజ్జత్ పాపడ్. అదే ఇప్పుడు మొత్తం దేశానికి గేమ్ ఛేంజర్‌గా మారింది.

80 రూపాయాలు అప్పు చేసి

1959 మార్చి 15న జస్వంతిబెన్ జమ్నాదాస్ పోపట్, పార్వతీబెన్ రాందాస్ తోడనీ, ఉజంబెన్ నారందాస్ కుండలియా, బానుబెన్‌లతో సహా ఏడుగురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. ఎన్. తన్నా, లగుబెన్



అమృత్‌లాల్ గోకాని, జయబెన్.వి. విఠలానీ, చుతాడ్‌బెన్ అమిష్ గవాడెమ్ ఇలా అందరూ కలిసి రద్దీగా ఉండే ముంబై ప్రాంతంలోని పాత భవనం టెర్రస్‌పై గుమిగూడారు. విక్రయించడానికి నాలుగు ప్యాకెట్ల పాపడ్‌లను బయటకు తీశారు. ఆ ఏడుగురు మహిళలు కలిసి ఈ వ్యాపారాన్ని కేవలం రూ.80తో ప్రారంభించారు. చగన్‌లాల్ కరామ్సీ పరేఖ్ అనే సామాజిక కార్యకర్త వద్ద ఆ మొత్తాన్ని వారు అప్పుగా తీసుకున్నారు. కుటుంబం కోసం డబ్బు సంపాదించడానికి వారు చేసిన తీవ్ర ప్రయత్నం లిజ్జత్ పాపడ్‌గా మారుతుందని వారు ఎన్నడూ ఊహించలేదు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో తమ కోసం ఎదురుచూసిన పోరాటాల నుండి వారు ఎప్పుడూ తప్పించుకునే ప్రయత్నం చేయలేదు.



నాణ్యతకు మారుపేరుగా

రద్దీకి, పేదరికానికి చిహ్నంగా ఉండే ముంబై పట్టణంలో వారి వ్యాపారం వృద్ధి చెందడానికి ఎక్కువ కాలం పట్టలేదు. మూడు నెలల్లోనే పాపడ్ నాణ్యతగా, రుచిగా ఉండటంతో తయారు చేసే వారి సంఖ్య ఏడు నుండి 25 మంది మహిళలకు పెరిగింది. అయితే వర్షాకాలం ప్రారంభం కావడంతో టెర్రస్‌పై పాపడ్‌లు ఎండ బెట్టడం ఇబ్బందిగా మారింది. ఈ అనుభవం నుండి వారు మరుసటి ఏడాది మంచాలు, పొయ్యి సిద్ధం చేసుకున్నారు. నాణ్యతలో రాజీ పడకుండా వారు తమ వ్యాపారాన్ని కొనసాగించారు. దాని కోసం సరైన ఖాతాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు.

మొదట్లో అడ్డంకులు

ప్రస్తుతం దేశంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న లిజ్జత్ పాపడ్ విస్తరణకు మొదట్లో అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. విస్తరణ కోసం వారి మొదటి ప్రయత్నం విఫలమైంది. రుచికి, నాణ్యతకు మారుపేరుగా ఉన్న లిజ్జత్ తరువాతి ఏడాది ముంబైతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా బ్రాంచులు ఏర్పాటు చేయగలిగారు. దాంతో ఈ మహిళలు అవార్డులతో పాటు ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. విదేశీ ప్రముఖులు సైతం వీరి పరిశ్రమలను సందర్శించారు. ఎగుమతులు భారీగా వృద్ధి చెందాయి. శ్రీ మహిళా గ్రిహ ఉద్యోగ్ లిజ్జత్ పాపడ్‌గా ఉన్న ఈ పరిశ్రమ తర్వాత కాలంలో శ్రీ ఉమెన్ హోమ్ ఇండస్ట్రీ టేస్టీ పాపార్డమ్స్‌గా మారి ఓ సొసైటీగా నమోదు పేరు నమోదు చేసుకుంది.

మహిళలకు ఉపాధి

ఈ లిజ్జత్ పాపడ్ నైపుణ్యం ఉన్న నిరక్షరాస్యులైన గ్రామీణ మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను అందిస్తున్నది. ప్రస్తుతం వారు తమ సంస్థలో 43000 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నందు ఆమెకు ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. తన 91వ ఏట 2021 జనవరి 26, భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె భారత ప్రభుత్వం నుండి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించి వారిని సాధికాతవైపు నడిపించాలని ఆమె కోరుకుంటుంది.

వివిధ రకరకాలు

వ్యాపారం వృద్ధి చెందే కొద్ది రకరకాల రుచులతో వివిధ పాపడ్‌లను తయారు చేయడం ప్రారంభించారు. ఖఖ్రా (1974), మసాలా (1976), వాడి, గోధుమ అట్టా, బేకరీ ఉత్పత్తులపై (1979) దృష్టి పెట్టారు. వీటిని తయారు చేసేందుకు పిండి మిల్లులను (1975), ప్రింటింగ్ విభాగం కూడా ఏర్పాటు చేశారు. పాలీప్రొఫైలిన్ ప్యాకింగ్ డివిజన్



(1978) కూడా ఏర్పాటు చేశారు. అయితే తర్వాత కాలంలో వారు కుటీర తోలు (1979), అగ్గిపెట్టెలు (1979), అగర్బత్తిలు (ధూపం కర్రలు) వంటి కొన్ని వెంచర్‌లు ప్రారంభించారు కానీ అవి అంతగా విజయవంతం కాలేదు.

పన్నీర్‌తో అద్భుత ప్రయోజనాలు..



మనం వాడే ప్రతీ ఆహార పదార్థానికీ రకరకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. వాటిలో మనం ఎక్కువగా వాడేది పన్నీర్. ఎంతో టేస్టీగా ఉండే పన్నీరుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం.

కాన్సర్లలో ఎక్కువ మందికి సోకుతున్న రొమ్ము క్యాన్సర్ నుంచీ మనల్ని కాపాడుతుంది. పాల ఉత్పత్తి అయిన పన్నీర్‌లో ఉండే కాల్షియం, విటమిన్ డి, రొమ్ము కాన్సర్‌ను దూరం చేస్తాయి. బాడీలోని వివిధ రకాల ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. కండరాలు, నాడుల పనితీరు నిర్వహిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

గుండెకు ఎంతో మంచిది, రక్తంలోని షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. పన్నీర్‌లో ఉండే మెగ్నీషియం క్యాటలిస్టులా పనిచేస్తుంది, జీవ రసాయనిక చర్యల్ని ప్రోత్సహిస్తుంది. పన్నీర్‌లో ఉండే జింక్ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికీ, జీర్ణక్రియకు, షుగర్‌ని కంట్రోల్ చెయ్యడానికీ, టెన్షన్లను తట్టుకోవడానికీ ఉపయోగపడుతుంది.

ఇది ఎముకలకు బలాన్ని ఇస్తుంది. మనకు రోజూ అవసరమయ్యే కాల్షియంలో 8శాతం దీని ద్వారా లభిస్తుంది. ఇది పిల్లలు, పెద్దల్లో ఎముకలు పటిష్టంగా ఉండేలా చేస్తుంది. గర్భవతులైన మహిళలకు అత్యుత్తమైన ఆహారం పన్నీరు.

పన్నీర్‌లో ఎక్కువగా ఉండే ప్రోటీన్‌లు శాఖాహారులకు శక్తినిస్తాయి. పన్నీరులో ఫాస్ఫరస్, ఫాస్ఫేట్‌లు జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసి, వాటిని వెలికి తీయడానికి సహాయపడతాయి.

ఇందులో ఉండే వే ప్రోటీన్.. ఎంతో ఆరోగ్యవంతమైనది. ప్లేయర్లు, ఎక్సర్‌సైజ్‌లు చేసేవారికి ఇది మేలు చేస్తుంది. ఇది చాలా నెమ్మదిగా జీర్ణం అవుతూ, నెమ్మదిగా శక్తిని ఇస్తుంది. అందువల్ల అథ్లెటిక్స్, బాడీ బిల్డర్‌లు, స్ప్రింటర్‌లు, ఆటలు ఆడేవారికి ఇది ఎంతో మేలైన ప్రోటీన్.

రేచీకటిని నిరోధిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆకలి లేకపోవడాన్ని నిరోధిస్తుంది. అలాగే ప్రొస్టేట్ రుగ్మతలను పోగొట్టి, వివిధ రకాల అంటువ్యాధులకు విరుద్ధంగా పోరాడుతుంది. సెలీనియం ఎక్కువగా ఉండే పన్నీరును వంటల్లో వేసుకొని తినడం వల్ల మన శరీరంలోకి విష వ్యర్థాలు రాకుండా ఉంటాయి. అలాగే రకరకాల వ్యాధుల నుంచీ తప్పించుకోవచ్చు.

పన్నీర్‌లో పొటాషియం కూడా ఉంటుంది. ఇది బాడీలో ద్రవ నియంత్రణ పదార్ధంగా పని చేస్తుంది. రెగ్యులర్‌గా పన్నీరు తింటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

దేశంలో 49,342 ఎంఎస్ఎంఈలు మూత

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో 1,114 న్యాయమూర్తి పోస్టులు మంజూరు కాగా, అందులో ప్రస్తుతం 757 న్యాయమూర్తులు పని చేస్తున్నారు. 357 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకుగాను, 29 మంది ఉన్నారు. ఎనిమిది ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టులో 42 మంది న్యాయమూర్తులకు గాను, 28 మంది ఉన్నారు. 14 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తెలంగాణలో 2,731 పోక్సో కేసులు నమోదు

తెలంగాణలో 2,731 పోక్సో కేసులు నమోదయ్యాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2019 నుంచి 2024 మే 31 వరకు తెలంగాణలో 2,731 పోక్సో కేసులు నమోదు కాగా అన్నింటినీ పరిష్కరించారని తెలిపారు. తెలంగాణలో ఒక్క పోక్సో కోర్టు కూడా లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2,99,759 పోక్సో కేసులు నమోదు కాగా, 410 పోక్సో కోర్టును ఏర్పాటు చేశారని, 1,62,497 కేసులు పరిష్కరించారని తెలిపారు.

తెలంగాణలో 2,24,659 ఇండ్ల నిర్మాణం పూర్తి

తెలంగాణలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఎవై-యూ) కింద 2,24,659 ఇండ్ల నిర్మాణం పూర్తైందని కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోఖాన్ సాహు తెలిపారు.తెలంగాణలో 2,50,084 ఇండ్లు మంజూరుకాగా, 2,44,219 ఇండ్ల నిర్మాణం ప్రారంభమైందన్నారు. వాటిలో 2,24,659 ఇండ్ల నిర్మాణం పూర్తైనట్టు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామంటూ ప్రకటించారని పేర్కొన్నారు. దీనికి రూ.8,424 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. వాస్తవానికి రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు దశబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అర్హతగల పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరముందని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. మహిళలకు వడ్డీలేకుండా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పెంచాలని పేర్కొన్నారు.

తలసరి ఆదాయమే కాదు..అప్పులూ పెరిగాయి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"తెలంగాణ ఏర్పడినప్పుడు 2014-15లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,24,104 కాగా, 2023-24లో రూ.3,47,299కి పెరిగింది. అదే కాలంలో రాష్ట్రం అప్పు రూ.72,658 కోట్ల నుంచి రూ. 6,71,757 కోట్లకు చేరుకుంది" అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసన సభలో ప్రవేశ పెట్టిన తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే-2024 నివేదిక వెల్లడించింది. తలసరి ఆదాయంలో దేశంలోనే అత్యధిక వృద్ధినమోదు చేస్తున్నప్పటికీ, అప్పు కూడా గణనీయంగా 824.5 శాతంపెరిగిందని పేర్కొంది. అప్పుల పెరుగుదలను, ఆదాయ వృద్ధితో సమతుల్యం చేయాలంటే భారీగా రుణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వెల్లడించింది. అదే సందర్భంలో ఖర్చులు తగ్గించుకోవడం, ఆదాయ మార్గాలను పెంచుకోవాలని పేర్కొంది. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ కఠినమైన నిర్ణయాలు తీసుకోని దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని వివరించింది. వ్యవసాయం, తయారీ, సమాచార సాంకేతిక, ఫార్మా మొదలగు రంగాలు తెలంగాణ ప్రధాన ఆర్థిక వనరులుగా ఉన్నాయని తెలిపింది. ఈ రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆరుగ్యారెంటీల అమలును ఒక సవాలుగా తీసుకుని అమలు చేస్తున్నామనీ, ఈ పథకాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. గత ప్రభుత్వ తప్పిదాలను సవరించుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెలుతున్నట్టు నివేదికలో సర్కార్ తెలిపింది.

మన పద్దు రూ.2,91,159 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సంస్కరణలు తీసుకోవాల్సిందేనని ఆర్థిక మంత్రి భట్టి తెలిపారు.



తలసరి ఆదాయంలోజిల్లాల మధ్య వ్యత్యాసం

2023-24 సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,47,299. జాతీయ తలసరి ఆదాయం రూ.1,83,236. దీనితో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,64,063 ఎక్కువ. అదే సమయంలో ఇదే తలసరి ఆదాయంలో జిల్లాల మధ్య తీవ్రమైన అంతరం ఉంది. రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ.9,46,862 కాగా, వికారాబాద్ జిల్లాలో అదే తలసరి ఆదాయం రూ.1,80,241గా ఉంది. దీన్నిబట్టి జిల్లాల మధ్య ఆదాయంలో అంతరాలు ఉన్నట్టు తెలుస్తుందనీ, తమ ప్రభుత్వం ఆ అంతరాలను తగ్గించే ప్రయత్నం చేస్తుందని ఆర్థిక మంత్రి చెప్పుకొచ్చారు.

రుణమాఫీ

రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీని ఒకే విడతలో తీర్చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని ఆర్థికమంత్రి చెప్పారు. దానిలో భాగంగా 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు ఉన్న రైతు రుణాలన్నింటికీ రుణమాఫీ వర్తింపచేశామన్నారు. దీనికోసం రూ.31వేల కోట్లు అవసరం కాగా, వాటిని పూర్తిస్థాయిలో సమీకరించుకుంటున్నామని చెప్పారు. ఈ నెల 18న రూ.లక్షలోపు రుణం ఉన్న 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు రుణమాఫీ చేశామన్నారు. త్వరలో మిగిలిన రైతులకూ రుణమాఫీ వర్తింపచేస్తామని చెప్పారు. రైతు భరోసా, రైతు కూలీల సంక్షేమం, పంట బీమా, వరిపంటకు బోనస్, రైతు నేస్తం, వంటి పథకాల అమలు కోసం వ్యవసాయశాఖకు అత్యధికంగా రూ.72,659 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్టు తెలిపారు.

ధరణి ప్రక్షాళన

ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తున్నామనీ, దీనికోసం కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 35 లావాదేవీలకు సంబంధించిన మాడ్యూల్స్‌లో 10 మాడ్యూల్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

కేసీఆర్ హాజరు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు తొలిసారి అసెంబ్లీకి వచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ప్రారంభం అయ్యాక సభలోకి వచ్చిన ఆయన, అది పూర్తికాకముందే సభలోంచి వెళ్లిపోయారు. అక్కడి నుంచి నేరుగా మీడియా పాయింట్‌కు వెళ్లి అక్కడ విలేకరులతో మాట్లాడారు.

మండలిలో...

రాష్ట్ర శాసనమండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం చైర్మెన్ శాసనమండలి సమావేశాలను శనివారానికి వాయిదా వేశారు. శాసనసభను కూడా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారానికి వాయిదా వేశారు.

నితీశ్ యూటర్న్ వెనుక?

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీకి 16 స్థానాలు ఉన్నాయి. అంటే ఈ రెండు పార్టీలకు కలిసి 28 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అత్యంత ముఖ్యమైన విశేషమేమిటంటే ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలపై మోడీ ప్రదర్శించిన దయాగుణం. ఈ రెండు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు అందజేశారు. ఇది ప్రభుత్వాన్ని కాపాడుకునే బడ్జెట్ అని ప్రతిపక్షాలు మండిపడుతుంటే టీడీపీ, జేడీయూ సహా ఎన్డీఏ పక్షాలన్నీ దీనిని విప్లవాత్మక బడ్జెట్ అని కొనియాడాయి.

ప్రతిపక్షాలు ఏమంటున్నాయి?

బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజీ కోసం అవసరమైతే నిరసనకు దిగుతానని నిన్న మొన్నటి వరకూ చెప్పిన నితీశ్ ఇప్పుడు హఠాత్తుగా ప్యాకేజీతో ఎందుకు సంతృప్తి చెందారని ప్రతిపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. ఆయన బీజేపీ ఒత్తిడికి లొంగిపోయి పనిచేస్తున్నారని, జైలుకు వెళతానేమోనని భయపడుతున్నారని ఎద్దేవా చేస్తున్నాయి.

నితీశ్‌కు సన్నిహితంగా ఉండే ఓ అధికారిపై ఈడీ దాడి జరిగింది. ఆ తర్వాత ఆయన తీవ్ర ఒత్తిడికి గురయ్యారని ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు చెబుతున్నాయి. అందుకే ఆయన ప్రత్యేక హోదా డిమాండ్ నుండి వెనకడుగు వేశారని, బీజేపీకి లొంగిపోవడం మొదలు పెట్టారని అంటున్నాయి. సన్నిహితుడిపై దాడి చేసిన ఈడీ తనపై కూడా నిఘా పెట్టి అలాంటి చర్యకు దిగుతుందేమోనని నితీశ్ అనుమానిస్తున్నారు. వాస్తవానికి బీహార్‌లో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సంజీవ్ హన్స్ నివాసాలపై ఈడీ బృందం దాడులు జరిపింది. నితీష్ కుమార్‌కు సంజీవ్ హన్స్ సన్నిహిత అధికారి అని చెబుతారు. సంజీవ్ కాకుండా దర్యాప్తు సంస్థ నిఘా నీడలో మరింత మంది అధికారులు కూడా ఉన్నారన్నది ప్రతిపక్షాల ఆరోపణ. ఈ అధికారులతో సంబంధాల విషయంలో నితీశ్ ఇప్పుడు ఒత్తిడికి లోనవుతున్నారని ప్రతిపక్షాలు అంటున్నాయి.నితీశ్‌పై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని ఆర్జేడీ ఎమ్మెల్యే ముకేష్ రోషన్ చెప్పారు.

నితీశ్‌ను భయపెట్టేందుకు కేంద్రం సంజీవ్ హన్స్ వంటి అధికారులను లక్ష్యంగా చేసుకుంది. సంజీవ్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. కేంద్రంలో నితీశ్ చిచ్చు పెడతారని బీజేపీకి బాగా తెలుసని, సంజీవ్ హన్స్‌పై ఈడీ దాడుల నేపథ్యంలో నితీష్ ఇక ఆ పని చేయబోరని కమలదళం అనుకున్నదని ముకేష్ తెలిపారు. నితీశ్ ఏ రోజైతే ప్రత్యేక హోదా డిమాండ్‌ను ముందుకు తెస్తారో అదే రోజు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపుతారని, అందుకే ఆయన వెనకడుగు వేశారని ముకేష్ చెప్పారు. కాగా నితీశ్‌ను బీజేపీ బ్లాక్‌మెయిల్ చేస్తోం దని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజయ్ తివారీ తెలిపారు. సంజీవ్ విషయంలో కానీ, మరొకరి విషయంలో కానీ ఈడీని ప్రయోగిస్తూ నితీశ్‌పై ఒత్తిడి కొనసాగించాలన్నదే బీజేపీ ఉద్దేశమని చెప్పారు.

కనీస రాజకీయ 'మద్దతు ధర'

బడ్జెట్ తర్వాత కనీస మద్దతు ధరలపై కూడా బాగా చర్చ జరిగింది. అయితే ఈ మద్దతు ధరను రాజకీయాలతో ముడి పెట్టారు. ఇప్పుడు రాజకీయాలకు సంబంధించిన 'కనీస మద్దతు ధర'లపై చర్చ నడుస్తోంది. అంటే దీనర్థం ఏమిటంటే మోడీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నందుకు ప్రతిగా నితీశ్, చంద్రబాబు ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు మంచి బహుమానం లభించింది. టీడీపీ, జేడీయూ కాకుండా బీజేపీని బలపరుస్తున్న 12 ఎన్డీఏ మిత్రపక్షాలన్నింటికీ కలిపి లోక్‌సభలో పాతిక మంది సభ్యులే ఉన్నారు. వీరిలో ఎక్కువ పార్టీలకు కేవలం ఒకటి రెండు స్థానాలు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, నితీశ్ మద్దతే కీలకం కాబట్టి బడ్జెట్‌లో వారి రాష్ట్రాలకు మంచి కేటాయింపులు దక్కాయి.

పూర్వ చరిత్ర 'ఘనమైన'దే

ఈ సందర్భంగా నితీశ్, చంద్రబాబుల పూర్వ చరిత్రను కూడా కొందరు గుర్తు చేస్తున్నారు. 2009, 2022 మధ్యకాలంలో బీజేపీతో నితీశ్‌కు ఆరుసార్లు విభేదాలు పొడసూపాయి. తెలుగుదేశం పార్టీ అయితే 2018 మార్చిలో మోడీ ప్రభుత్వంపై ఏకంగా అవిశ్వాస తీర్మానం కూడా పెట్టింది. ఆ సమయంలో చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న ఏకైక డిమాండ్‌తో ఆయన కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకున్నారు కూడా. బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న నితీశ్ డిమాండ్‌ను కేంద్రం తోసిపుచ్చి ఉండవచ్చు. కానీ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చినందుకు నితీశ్ సంబరపడిపోయారు. బడ్జెట్‌లో అనేక ముఖ్యమైన ప్రకటనలు ఉన్నాయని చెప్పారు. తన మిగిలిన డిమాండ్లు భవిష్యత్తులో నెరవేరతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు దేశానికి సరైన సమయంలో సరైన నేత లభించారని, ఆయనే మోడీ అంటూ చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు.

అంతా గ్యాస్..ఒట్టి ట్రాష్..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'అంతా గ్యాస్.. ఒట్టి ట్రాష్...' అంటూ రాష్ట్ర బడ్జెట్‌ను ఉద్దేశించి మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసింది బడ్జెట్ ప్రసంగం కాదనీ, అది రాజకీయ సభల్లో చేసిన స్పీచ్‌లాగా ఉందని ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్ విలేకర్లతో మాట్లాడారు. బడ్జెట్‌లో ఒక్క పాలసీ కూడా నిర్దిష్టంగా లేదని విమర్శించారు. ఒక పద్ధతీ లేదు, పాడూ లేదని దుయ్యబట్టారు. ఇది పేదల బడ్జెట్ కాదు, రైతుల బడ్జెట్ అంతకంటే కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాన్ని శాసనసభలో చీల్చి చెండాడతామని హెచ్చరించారు. ఆర్థిక మంత్రి ఒత్తి ఒత్తి పలకటం తప్ప బడ్జెట్‌లో గట్టితనమేమీ లేదని విమర్శించారు. మహిళల కోసం ఉద్దేశించినవి కూడా కొత్త పథకాలేమీ కాదనీ, గతంలో ఉన్నవేనని స్పష్టం చేశారు. హామీల అమలు కోసం ప్రభుత్వానికి ఆర్నెల్ల సమయం ఇవ్వాలని భావించామనీ, ఈ అర్భక ప్రభుత్వానికి ఆ గడువు తీరిందని కేసీఆర్ హెచ్చరించారు.

ఖనిజ హక్కులపై రాయల్టీ పన్ను విధించొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

విజయంగా చెప్పవచ్చు. 'రాయల్టీ అనేది పన్ను స్వభావం కాదు. రాయల్టీని పన్నుగా పరిగణిస్తూ ఇండియా సిమెంట్స్ కేసులో గతంలో ఈ న్యాయస్థానం వ్యక్తం చేసిన అభిప్రాయం సరైంది కాదని మేము అభిప్రాయపడుతున్నాము. ప్రభుత్వానికి చేసే చెల్లింపులన్నింటినీ కేవలం పన్నులుగా పరిగణించకూడదు. ఎందుకంటే బకాయిల్లో దానిని రికవరీ చేయవచ్చునని చట్టం చెబుతోంది' అని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఖనిజాలు, క్వారీలతో కూడిన భూమికి పన్ను విధించడానికి రాష్ట్రాల శాసనసభలకే అధికారం ఉన్నదని చెప్పారు. 'ఖనిజ హక్కులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర శాసనసభలకే ఉంటుంది. పార్లమెంటుకు ఆ హక్కు ఉండదు. ఈ వ్యవహారంలో తలదూర్చే అధికారం కేంద్రానికి లేదు' అని మెజారిటీ న్యాయమూర్తులు రూలింగ్ ఇచ్చారు. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఖనిజాలు ఉన్న భూములపై రాష్ట్రాలు పన్నులు విధించలేవని, ఆ హక్కు కేంద్రానికే ఉంటుందని తెలిపారు. రాష్ట్రాలు ఎవరికి వారు వేర్వేరుగా లెవీ విధిస్తే ప్రతికూల ప్రభావం పడుతుందని వాదించారు. కాగా తొమ్మిది మంది సభ్యులున్న ధర్మాసనం ఎదుట పెండింగులో ఉన్న కేసుల్లో ఇదే అతి పురాతనమైనది. విచారణ పూర్తవడంతో మార్చి 14న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

అభూత కల్పన..అంకెల గారడీ : కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని వర్గాలకూ బడ్జెట్‌లో అన్యాయమే జరిగిందని తెలిపారు. ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేల హామీ ఏమైందని ప్రశ్నించారు.

పార్టీ ఫిరాయింపుల కేసులపై వాదనలు

నవతెలంగాణ-హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో గురువారం వాదనలు జరిగాయి. స్పీకర్ నిర్ణయం తర్వాతే న్యాయ సమీక్షకు వీలుంటుందనీ, ఆయన తన నిర్ణయాన్ని వెల్లడించకుండానే కోర్టులో పిటిషన్లు వేసేందుకు వీల్లేదని రాష్ట్రం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, దానం, కడియం తరఫు న్యాయవాదులు వాదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పి. కౌశిక్ రెడ్డి, వివేకానంద వేసిన పిటిషన్లపై విచారణ శుక్రవారం కొనసాగిస్తామని న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తన పిటిషన్‌ను స్వీకరించేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి కోరగా ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఫైనల్‌పై కన్నేసి..



బంగ్లాతో భారత్ సెమీస్ నేడు

దంబుల్లా : మహిళల ఆసియా కప్‌లో టీమ్ ఇండియా మరో టైటిల్‌పై కన్నేసింది. 11 సార్లు చాంపియన్ భారత మహిళల జట్టు నేడు సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన హర్మన్‌ప్రీత్ సేన నేడు సెమీస్‌లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుంది. షెఫాలీ వర్మ స్మృతీ మంధాన, జెమీమా సహా హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్ భీకర ఫామ్‌లో ఉన్నారు. స్పిన్నర్లు దీప్తి శర్మ, రాధ యాదవ్ దంబుల్లా పిచ్‌పై మ్యాజిక్ చేస్తున్నారు. గతంలో ఆసియా కప్‌లో భారత్‌కు షాక్ ఇచ్చిన బంగ్లాదేశ్ నేడు అదే స్ఫూర్తితో బరిలోకి దిగుతుంది. భారత్, బంగ్లా సెమీస్ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం.

క్వార్టర్స్‌లో ఆర్చరీ అమ్మాయిలు

అంకితకు 11వ సీడింగ్

పారిస్ : పారిస్ ఒలింపిక్స్‌లో భారత మహిళల ఆర్చరీ జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన ర్యాంకింగ్ రౌండ్‌లో అమ్మాయిలు 1983 పాయింట్లతో నాల్గో స్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్స్‌కు చేరింది. దక్షిణ కొరియా, చైనా, మెక్సికో టాప్-3లో నిలిచాయి. ఈ నెల 28న క్వార్టర్‌ఫైనల్ మ్యాచులు జరుగుతాయి. మహిళల ర్యాంకింగ్స్‌లో అంకిత 11వ సీడింగ్ సాధించింది. భజన్ కౌర్, దీపిక కుమారి వరుసగా 22, 23వ సీడింగ్ సాధించారు.



పారిస్ పిలుస్తోంది!

- నేడు 2024 ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు
- భారత పతాకధారులుగా సింధు, శరత్ కమల్



206 దేశాలు. 329 పతక ఈవెంట్లు. 32 క్రీడాంశాలు. ప్రపంచ మేటీ అథ్లెట్లతో పోటీపడి విశ్వవిజేతగా నిలిచేందుకు ప్రతి క్రీడాకారుడు స్వప్నిస్తుండగా.. నేడు పారిస్ 2024 ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు జరుగనున్నాయి. పి.వి సింధు, అచంట శరత్ కమల్ ఆరంభ వేడుకల పరేడ్‌లో భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటలకు ఆరంభ వేడుక షురూ కానుంది.

నవతెలంగాణ - పారిస్

ఎప్పుడు, ఎక్కడ?

2024 పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు వైవిధ్యంగా ప్రణాళిక చేశారు. సహజంగా ఆతిథ్య దేశ జాతీయ స్టేడియంలో ఆరంభ వేడుకలు జరుగుతాయి. కానీ పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు మాత్రం నదీ తీరంలో జరుగనున్నాయి. పోటీపడే దేశాల అథ్లెట్ల పరేడ్ మైదానంలో కాకుండా.. నదిలో పడవలో సాగుతుంది. ముగింపు వేడుకలు మాత్రం ఫ్రాన్స్ జాతీయ స్టేడియం నిర్వహించనున్నారు. 'వేగంగా వెళ్లాలని అనుకుంటే ఒంటరిగా వెళ్లు.. చాలా దూరం వెళ్లాలని అనుకుంటే కలిసి వెళ్లు'అనే నినాదంతో పారిస్ ఒలింపిక్స్ సాగనున్నాయి.

భారత్ పతక ఆశలు

2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. ఓ పసిడి, రెండు రజతాలు సహా నాలుగు కాంస్య పతకాలు సాధించింది. నీరజ్ చోప్రా భారత క్రీడా చరిత్రలో స్వర్ణ చరిత్ర లిఖించాడు. టోక్యో ఒలింపిక్స్ ముగిసి మూడేండ్లు గడిచాయి. భారత్ విశ్వ క్రీడల్లో పతక వేట మరింత మెరుగుపర్చుకుంది. ఒలింపిక్స్‌లో భారత్ ఇప్పటివరకు 35 పతకాలు సాధించింది. హాకీలో 12 మెడల్స్ రాగా.. అందులో స్వర్ణాలు సైతం ఉన్నాయి. పారిస్‌లో నీరజ్ చోప్రా, పి.వి సింధు, మీరాబాయి చాను సహా నిఖత్ జరీన్, ఇషా సింగ్‌లపై పతక ఆశలు భారీగా ఉన్నాయి. భారత్ రెండెంకల పతకాలను చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

గ్లోబల్ స్టార్స్ మెరుపుల్

టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్ చివరిసారి ఒలింపిక్స్ బరిలో నిలిచాడు. చారిత్రక ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు సాధించిన చోట స్పెయిన్ బుల్ ఒలింపిక్ పసిడి వేట సాగిస్తున్నాడు. జిమ్నాస్టిక్స్ ఐకాన్ సిమోనె బైల్స్, చైనా టేబుల్ టెన్నిస్ దిగ్గజం మా లాంగ్‌లు పారిస్ ఒలింపిక్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు.

ఆ రెండు దేశాలు అవుట్

పారిస్ విశ్వ క్రీడల్లో 209 దేశాలు పోటీపడుతున్నాయి. ఒలింపిక్స్ చరిత్రలో అత్యంత విజయవంతమైన దేశం రష్యాకు మరోసారి నిరాశే ఎదురైంది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) రష్యాతో పాటు బెలారస్‌ను పారిస్ క్రీడలకు దూరం పెట్టింది. ఈ రెండు దేశాలకు చెందిన క్రీడాకారులు తటస్థ అథ్లెట్లుగా బరిలోకి దిగుతున్నారు.



ఐదేండ్లకు ఓసారే వేలం!

ఐపీఎల్ ఫ్రాంచైజీల డిమాండ్

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 ఆటగాళ్ల వేలంపై ఫ్రాంచైజీలు పలు డిమాండ్లను తెరపైకి తీసుకొచ్చారు. ఐపీఎల్ 2025 ఆటగాళ్ల వేలం సహా రానున్న సీజన్ నిర్వహణ రోడ్ మ్యాప్‌పై చర్చించేందుకు పది ఫ్రాంచైజీల యాజమానులతో బీసీసీఐ భేటీ కానుంది. ముంబయిలో గురువారం ఈ సమావేశం జరుగనుంది. ప్రతి ఐదేండ్లకు ఓసారి మెగా వేలం, 4-6 ఆటగాళ్లను అట్టిపెట్టుకునే అవకాశం, ఎనిమిది రైట్ టూ మ్యాచ్ (ఆర్‌టీఎం), ఆటగాళ్లు ఫ్రాంఛైజీ వదిలి వెళ్లే వెసులుబాటు తొలగించటం, వేలం పర్సు మొత్తం పెంపు వంటి అంశాలను ఐపీఎల్ అధికారులకు ఇప్పటికే ఫ్రాంఛైజీ యజమానులు తెలిపారు. ఈ సమావేశం అనంతరం వేలం రూల్స్‌పై బీసీసీఐ ఓ నిర్ణయం తీసుకోనుంది.

నవచిత్రం

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



రామ్ భీమన, డా॥రమేష్ తేజావత్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన నూతన సినిమా 'పురుషోత్తముడు'. ఈ చిత్రాన్ని శ్రీ శ్రీదేవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై డా.రమేష్ తేజావత్, ప్రకాష్ తేజావత్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంతో హాసిని సుధీర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. 'ఆకతాయి', 'హమ్ తుమ్' చిత్రాలతో మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకున్న రామ్ భీమన ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ప్రకాష్ రాజ్, మురళి శర్మ రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముకేష్ ఖన్నా వంటి స్టార్ కాస్టింగ్‌తో రూపొందిన ఈ సినిమా నేడు (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ భీమన, నిర్మాత డా.రమేష్ తేజావత్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

దర్శకుడు రామ్ భీమన మాట్లాడుతూ, 'డా.రమేష్ తేజావత్, ప్రకాష్ తేజావత్ లాంటి మంచి ప్రొడ్యూసర్స్ నాకు దొరకడం సంతోషంగా ఉంది. ఈ సినిమాను క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించాను. ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ, ముఖేష్ ఖన్నా, మురళీ శర్మ లాంటి పెద్ద ఆర్టిస్టులను అనుకుంటే వాళ్లంతా మా మూవీలోకి వచ్చేలా మా ప్రొడ్యూసర్స్ చేశారు. వీళ్లంతా తమ నటనతో కథకు బలాన్ని తీసుకొచ్చారు. ఒక న్యూస్ ఆర్టికల్ చదివి కొన్నేళ్ల కిందట ఈ సినిమా కథ రెడీ చేసుకున్నాను. ఒక కోటీశ్వరుడైన అబ్బాయి పల్లెటూరికి ఎందుకు వచ్చాడు?, అక్కడ ఏం చేశాడు అనేది ఈ చిత్ర కథ. మహేశ్ బాబు 'శ్రీమంతుడు' లాంటి సినిమాలు ఇలాంటి కథలతో వచ్చాయి కదా అనిపించవచ్చు. మన దగ్గర కథ లైన్‌గా అనుకుంటే ఎన్నో సినిమాలు ఒకేలా అనిపిస్తాయి. కానీ ఆ కథలో ఏం చెప్పాం అనేది ముఖ్యం. ఈ సినిమాలో ఇప్పటిదాకా మన ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో రాని పాయింట్‌ను టచ్ చేశాం' అని తెలిపారు.

'నాకు సినిమాలంటే ప్యాషన్. బిజినెస్‌లో బాగా రాణిస్తున్నా ఒక మంచి తెలుగు సినిమా నిర్మించాలనే కోరిక మనసులో ఉండేది. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. సినిమా కోసం నిర్మాతలుగా ఎక్కడా రాజీ పడకుండా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాం. ఈ సినిమాని సకుటుంబంగా ప్రేక్షకులంతా హాయిగా చూసేలా ఉంటుంది' అని నిర్మాత డా.రమేష్ తేజావత్ చెప్పారు.



నేతన్నకు కేటాయింపులేవీ?

- బడ్జెట్‌లో కాంగ్రెస్ మోసాన్ని నిరసిస్తూ 27న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా : తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమకు, నేతన్న సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడాన్ని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు చేసిన మోసాన్ని నిరసిస్తూ ఈ నెల 27న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా తలపెడుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా సర్కారుకు పట్టకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఉపాధి లేక 14 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కొన్ని నెలలుగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా నేతన్న సంక్షేమం, ఉపాధి, అభివృద్ధి కోసం నిర్దిష్టంగా బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడం చేనేత పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య వైఖరి బయటపడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో నేతన్నలకు పొందుపర్చిన అంశాలను కూడా బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడం దారుణమని పేర్కొన్నారు.

వ్యవసాయ బడ్జెట్‌ను సవరించాలి

- రైతాంగ సమస్యలు పరిష్కరించాలి : తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ (2024-25)లో రూ.72,659 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించడాన్ని తెలంగాణ రైతు సంఘం ఆహ్వానించింది. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు రుణమాఫీలో కొంత మంది అర్హులకు రుణాలు రద్దు కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 12.12.2018 నుంచి 09.12.2023 వరకు బాకీ ఉన్న వారికి రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. మార్చి 1 నుంచి 20 వరకు ధరణి లోపాలపై విచారణ చేపట్టారనీ, గుర్తించిన సమస్యలు ఇంతవరకు పరిష్కారం కాలేదని తెలిపారు. 33 రకాల సన్నధాన్యం పండించిన రైతులకే రూ. 500 బోనస్ ఇస్తామనడం సరైంది కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 70 శాతం ఏ, సీ గ్రేడ్ల వరిసాగు చేస్తున్నారనీ, ఆ రైతులకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లలో ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు ప్లాట్‌ఫారాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. అవసరమైన చోట కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,301 కోట్లు కేటాయించినప్పటికీ 70శాతం నుంచి 80శాతం పూర్తయిన మధ్యతరహా, భారీ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇరిగేషన్ అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.1500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యాన శాఖకు ప్రస్తుతం కేటాయించిన రూ.737 కోట్లు రెట్టింపు చేయాలనీ, పామాయిల్, డెయిరీ రైతులకు సబ్సిడీలు పెంచాలని కోరారు. ఆ సమస్యల పరిష్కారానికి కావాల్సిన విధంగా బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాలెన్స్‌డ్ బడ్జెట్

- వ్యవసాయ విధాన విశ్లేషకులు దొంతి నర్సింహారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ ఉన్న పరిమితుల్లో బ్యాలెన్స్‌డ్‌గా ఉంది. అప్పులు, ఖర్చుల కనుగుణంగా ఉంది. వ్యవసాయ శాఖకు గత ప్రభుత్వం రూ.18 వేల కోట్లు కేటాయించింది. ఈ ప్రభుత్వం రూ.32 వేల కోట్లు కేటాయించింది. గత కంటే రూ. 14 వేల కోట్లు అధికం. మొత్తంగా వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు రూ. 72 వేల కోట్లు కేటాయించడం మంచి పరిణామం. గత బడ్జెట్‌కు ఈ బడ్జెట్ దగ్గరగా ఉంది. అయితే ప్రాధాన్యతలు మారిపోయాయి. వ్యవసాయానికి, ఎస్సీ, గ్రామీణాభివృద్ధికి అత్యధికంగా నిధులు కేటాయించింది.



సాగు...బహు బాగు...

వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 72వేల కోట్లు

గత బడ్జెట్ కంటే ఈసారి రూ.14వేల కోట్లు అదనం

- రైతు రుణమాఫీకి రూ 31వేల కోట్లు
- రైతు భరోసాకు రూ.15వేల కోట్లు
- వ్యవసాయ కూలీలకు రూ.905 కోట్లు
- పంటల బోనస్‌కు రూ. 1358 కోట్లు



పశు సంవర్థక, ఉద్యానవన శాఖలకు ఊతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో (2024-25) వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు ఊతమిచ్చింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగంపై ఫోకస్ చేసింది. రూ 72వేల కోట్లు కేటాయించి, ఆ రంగానికి అగ్రతాంబులం వేసింది. ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, వరికి బోనస్, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ 15వేలు, ధాన్యం సేకరణ వంటి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది.

పంట పెట్టుబడి సాయంతోపాటు పంటల కొనుగోలుకు కూడా తగిన భద్రతను కల్పించింది. గత ప్రభుత్వం వ్యవసాయ శాఖకు రూ. 18వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.32వేల కోట్లు కేటాయించింది. రూ.14వేల కోట్లు పెంచింది. అన్నదాతలు బ్యాంకుల్లో చెల్లించాల్సిన అప్పులను తీర్చేందుకు బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ఇప్పటికే రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం...ఆగస్టు 15లోపు పూర్తి చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా రైతు రుణమాఫీకి రూ.31వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది.వానాకాలం, యాసంగి సీజన్లకుగానూ గత రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు కింద పెట్టుబడి సాయం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు బడ్జెట్‌లో రూ 15392 కోట్లు కేటాయించింది. ఈసారి బీడు భూములు, రాళ్లు, రప్పలు, రియల్ ఎస్టేట్ భూములకు, రహదారులకు అందుతున్న పెట్టుబడి సాయాన్ని ఇవ్వబోమంటూ ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తగినట్టుగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. రెక్కాడితేగానీ డొక్కాడని వ్యవసాయ కూలీల(భూమిలేని)కు ఏడాదికి రూ 12వేల చొప్పున బడ్జెట్‌లో రూ.905 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కూలీల సాయానికి బడ్జెట్‌లో భరోసా ఇచ్చింది. గత ఐదారేండ్లుగా దాదాపు 28 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిని రైతు కష్టం నీటిపాలైతే గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈసారి బడ్జెట్‌లో పంటల బీమాకు భరోసా కల్పించింది. పంటల బీమాను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నది. రైతుకు పైసా ఖర్చు లేకుండా పూర్తి భద్రతనిచ్చింది. రైతు బీమా కోసం బడ్జెట్‌లో రూ 1167 కోట్లు. రాష్ట్రంలో సన్నరకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకుగానూ 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ను ప్రకటించింది. ముఖ్యంగా ఉద్యాన శాఖను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. జీతభత్యాలకు తప్ప బడ్జెట్‌లో పైసా అదనంగా కేటాయించలేదు. ఈ బడ్జెట్‌లో మాత్రం రూ. 737 కోట్ల కేటాయింపులు దక్కాయి. పశు సంవర్థక శాఖకు రూ 1980 కోట్లు కేటాయించింది. రైతు నేస్తం పేరిట వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక అభివృద్ధిని రైతులకు అందించాలని భావిస్తోంది. శాస్త్రీయ పద్దతుల ద్వారా దిగుబడులు పెంచుకునేందుకు ఇది రైతులకు ఉపయోగపడుతున్నది. మైక్రో ఇరిగేషన్‌కు రూ. 20కోట్లు, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ. 395కోట్లు కేటాయించింది. వ్యవసాయాన్ని పరుగులు పెట్టించాలంటే యాంత్రీకరణకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నది. కానీ రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణకు నిధులు కేటాయించలేదు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌కు బడ్జెట్‌లో రూ 1358 కోట్లు కేటాయించింది. గతం కంటే రూ 358 కోట్లు అదనం. వ్యవసాయ అనుబంధ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చింది. అయితే రాష్ట్రంలో పత్తి పంటకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఇతర పండ్లు, చిరుధాన్యాల పంటల సాగు తగ్గిపోయింది. చివరకు ఆకుకూరలు, కూరకాయలను సైతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితులున్నాయి. కానీ బడ్జెట్‌లో వీటికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనే చెప్పొచ్చు.

రాష్ట్ర బడ్జెట్‌లో పేదల వాటా పెంచాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పేదల వాటా మరింత పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. వ్యవసాయ కార్మికుల కోసం తీసుకొచ్చిన రైతు కూలి సంక్షేమ పథకాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు పెంచాలనీ, నియోజకవర్గానికి 10 వేల ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ మూడెకరాల సాగుభూమి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ చట్టం బలోపేతం కోసం బడ్జెట్‌లో ఏమీ మాట్లాడకపోవడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం చేయడానికి అవసరమైన నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు. రూ.3836 కోట్లతో ఏం మార్పులు చేస్తారని ప్రశ్నించారు. కేరళలో పేదలకు ఇస్తున్నట్టుగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జనాభా దామాషా ప్రకారం కేటాయింపుల్లేవు

- కేటాయింపులు, ఖర్చుల సమతుల్యత ఉండాలి : రాష్ట్ర బడ్జెట్ పై కేవీపీఎస్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2024-25 సంవత్సరానికి గాను గురువారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపులు ఖర్చుల సమతుల్యత ఉండాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.2.91,159 లక్షల కోట్ల బడ్జెట్‌లో దళితులు 18శాతం నిధులు కేటాయించాల్సి ఉందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్డీఎఫ్ ప్రకారం కేటాయించాల్సినదానికి భిన్నంగా కేవలం 14.86శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కేటాయింపులు కూడా ఖర్చుకు నోచుకోవట్లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 శాతం ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి మౌలిక సంక్షేమానికి ఖర్చు పెట్టగలిగితే దళితులకు కొంత ఊరట లభిస్తుందని తెలిపారు. అంకెలు పెంచుతూ అమలులో వివక్ష పాటిస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో అంకెలు పెరిగితే బతుకులు మారవనీ, అవి దళితుల సంక్షేమానికి ఖర్చు పెట్టాలని సూచించారు. సాంఘీక సంక్షేమం కింద రూ.33,124 కోట్లు కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో రోజురోజుకు దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దళితుల బడ్జెట్ వారి మౌలిక సంక్షేమానికి ఖర్చు పెట్టాలంటే ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నిరంతర తనిఖీ అమలు పర్యవేక్షణ జరిగితే ఎంతో కొంత దళితుల సంక్షేమానికి తోడ్పడుతుందని గుర్తు చేశారు.

దళితుల భూమి, పారిశ్రామిక అభివృద్ధి, పక్కా గృహాలు, విద్యా, వైద్య సౌకర్యాలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, రహదారులు వంటి సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి దళిత సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే నోడల్ ఆఫీసర్‌తో పాటు, సీఎం అధ్యక్షతన అపెక్స్ బాడీ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్ని రూపాల్లో కేటాయింపులు చేసినా అందులో సగం కూడా ఖర్చు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కేటాయింపులతో గత ప్రభుత్వం కూడా గప్పాలు కొట్టిందని గుర్తు చేశారు. దళితుల బడ్జెట్‌ను కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి వాటికి దారి మళ్లించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో అంబేద్కర్ బంధు పెట్టి రూ.12లక్షలకు పెంచి ఇస్తామని చెప్పి, దానికి ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి పైసా చిత్తశుద్ధితో దళిత సంక్షేమానికి ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకతీతంగా పారదర్శకంగా ప్రతి పైసా ఖర్చు చేయాలని వారు డిమాండ్ చేశారు

దళితుల జనాభా ప్రకారం నిధులేవి?

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్సీల జనాభా ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు రూ.52,409 (18 శాతం) వేల కోట్లు కేటాయించాల్సి వుండగా కేవలం రూ.33,124 వేల కోట్లు మాత్రమే కేటాయించారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.2,91,159 కోట్లు కాగా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కేటాయింపుల చట్టం ప్రకారం దళితుల జనాభా 18 శాతం ప్రకారం నిధులు కేటాయించకుండా చట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చినట్టు అంబేద్కర్ అభయ హస్తం పథకం గురించి ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించలేదని తెలిపారు. బడ్జెట్‌ను సవరించి ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన పథకాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కృష్ణా ప్రాజెక్టులకు భారీ వరద

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రమంతా ముసురుతోకూడిన వానలు పడుతున్నాయి. దీంతో కృష్ణా ప్రాజెక్టులకు ఎగువ నుంచి భారీ వరద కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయానికి 1,92,803 క్యూసెక్కుల వరద చేరుతున్నది. శ్రీశైలం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 853 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 87 టీఎంసీలుగా ఉంది. ఎడమ జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని అధికారులు ప్రారంభించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కూడా వరద కొనసాగుతున్నది. 9500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద జయాశయంలోకి వస్తుంది. పూర్తి నీలి నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 503.880 అడుగుల్లో 121.3844 టీఎంసీలకు చేరుకుంది.పూర్తిస్థాయి నీటి మట్టం590 అడుగులుగా ఉంది. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకూ వరద పెరుగుతున్నది.

కృష్ణా బేసిన్ రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీ)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	వదులుతున్న నీరు (క్యూసెక్కులు)
ఆలమట్టి	129.72	90.13	198000	275000
నారాయణపూర్	37.64	30.77	240000	250028
జూరాల	9.66	6.34	227000	252605
తుంగభద్ర	105.79	102.66	98450	98404
శ్రీశైలం	215.81	92.49	254700	31784
నాగార్జునసాగర్	312.05	121.87	6500	0
పులిచింతల	45.77	0.97	525	0

గోదావరి బేసిన్

సింగూరు	29.917	13.90	1444	0
నిజాంసాగర్	17.800	3.45	960	0
శ్రీరాంసాగర్	18.500	26.77	21650	0
కడెం	7.600	5.74	10536	13082
శ్రీపాద ఎల్లంపల్లి	20.175	14.49	20998	0
మేడిగడ్డ	16.170	-	771580	771580
సమ్మక్కసాగర్	6.940	-	950420	950420
సీతమ్మసాగర్	36.570	54.75(ఎం)	1147940	1147940
భద్రాచలం	లెవెల్	46.92(ఎం)	1011364	1011364

రాష్ట్ర బడ్జెట్ ప్రజా సంక్షేమానికి దిక్సూచి

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్ దిక్సూచి అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజల ఆలోచనలకు రాష్ట్ర బడ్జెట్ దగ్గరగా ఉందన్నారు. గత పదేండ్ల కాలంలో బడ్జెట్ హైప్ తప్ప ఏం లేదని ఎద్దేవా చేశారు. పదేండ్ల కేసీఆర్ బడ్జెట్ ఊహల్లో విహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉంటుందని స్పష్టం చేశారు. వ్యవసాయానికి పెద్దపీట వేయడంతో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. గత పదేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వం అప్పులకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆయన ఆరోపించారు.

రాష్ట్రపతి భవన్‌లో రెండు హాళ్ల పేర్లలో మార్పు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రెండు ప్రధాన హాల్స్ పేర్లను మార్చుతు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్ణయం తీసుకున్నారు. దర్బార్ హాల్ పేరును గణతంత్ర మండపంగా, అశోక హాల్‌ను అశోక మండపంగా మార్పు చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్రపతి భవన్ డిప్యూటీ ప్రెస్ సెక్రెటరీ నవిక గుప్తా ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రపతి కార్యాలయం, నివాసమైన రాష్ట్రపతి భవన్, దేశానికి చిహ్నమని, ప్రజల అమూల్యమైన వారసత్వమని అన్నారు. ఈ భవన్‌ను దేశ ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ దిశలో రాష్ట్రపతి భవన్ భారతీయ సాంస్కృతిక విలువలు, తత్వాలను ప్రతిబింబించేలా చేసేందుకు స్థిరమైన ప్రయత్నం జరిగిందన్నారు. ఇందులో భాగంగా దర్బార్ హాల్, అశోక్ హాల్‌ను గణతంత్ర మండపం, అశోక్ మండపం అని పేరు మార్చడానికి సంతోషిస్తున్నట్టు తెలిపారు.

నేషనల్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని వెనక నుంచి ఢీకొట్టిన బైక్..

ముగ్గురు యువకులు దుర్మరణం



నవతెలంగాణ-కంది

జాతీయ రహదారి 161పై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని వెనక నుంచి బైక్ ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలం తునికిళ్ల తండా శివారులో జరిగింది. స్థానికులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్కల్ మండలంలోని గంగోజిపేటకు చెందిన సందీప్, నవీన్, గొంగులూరుకు చెందిన అభిలాష్.. కంది మండల కేంద్రంలోని అక్షయపాత్రలో పనిచేస్తున్నారు. డ్యూటీలో భాగంగా గురువారం ఉదయం ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో కంది మండలంలోని తికేల తాండా వద్ద నాందేడ్-అకోల జాతీయ రహదారి 161పై నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని వెనక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఆ ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నది. కాగా వారికి హెల్మెట్లు ఉంటే ప్రాణాలతో బయట పడే వారిని స్థానికులు చెప్పుకొచ్చారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి దామోదర రాజనర్సింహ

మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రమాద ఘటన గురించి తెలియగానే.. మృతుల కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులు.. తల్లీకొడుకు ఆత్మహత్య



నవతెలంగాణ-చైతన్యపురి

కూలి పనులు చేసుకుని.. ఉన్నదాంట్లో ఇద్దరు పిల్లలతో సంతోషంగా సాగుతున్న కుటుంబంలో అనారోగ్య సమస్యలు ఇంటి పెద్ద దిక్కు ప్రాణం తీశాయి. భర్త మరణం తరువాత కుటుంబాన్ని నెట్టుకొస్తున్న భార్య.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. తల్లిని విగతజీవిగా చూసిన పెద్ద కొడుకు తట్టుకోలేక అతనూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయవిదారక ఘటన రంగారెడ్డి జిల్లా చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన గుంజి శివ, భార్య పద్మ(40) ఇద్దరు కుమారులతో కలిసి కొన్నేండ్ల కిందట జీవనోపాధి కోసం హైదరాబాద్ నగరానికి వచ్చారు. కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీలో అద్దెకు నివసిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. అయితే గుంజి శివ కొన్ని నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న పద్మ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అది చూసిన పెద్ద కొడుకు వంశీ(18) కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో రెండో కొడుకు బంధువుల ఇంటికి వెళ్లాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్లనిర్మాణానికి సర్కారు కొత్త విధానం

- జిల్లా కేంద్రం నుంచి రాజధానికి హైవేల నిర్మాణం
- ఆర్అండ్‌బీకి రూ.5.790 కోట్లు
- ఆర్ఆర్ఆర్‌కు రూ.1525 కోటు
- ఓఆర్ఆర్‌కు రూ.200కోట్లు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర లైఫ్‌లైన్‌గా భావిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డుకు తాజా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1525 కోట్లు కేటాయించింది. ఇప్పటికే అలైన్‌మెంట్‌తోపాటు కేంద్ర ప్రభుత్వం అన్ని అనుమతులను ఇచ్చిన సంగతి తెలిసిందే. భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఆర్ఆర్ఆర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 2024-25 నిధులు ఇచ్చింది. ఈ నిధులు భూసేకరణ, మౌలిక వసతులకల్పన కోసం ఖర్చుచేయనునఆనరు. ఈ రోడ్డు నిర్మాణ విషయమై సర్కారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రత్యేక కారిడార్,స్మార్ట్ సీటీలు, క్లస్టర్లు ఏర్పాటుచేయడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నది. తొలుత నాలుగు లేన్లతో ప్రారంభించి ఎనిమిది లేన్లుగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తున్నది. దాదాపు 347.6 కిలోమీటర్ల మేర ఆర్ఆర్ఆర్‌ను నిర్మించనున్నారు. ఉత్తర భాగం నిర్మాణానికి రూ.13.522 కోట్లు, దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్లు వ్యయం చేయనున్నారు. ఇదిలావుండగా పంచాయతీరాజ్ రోడ్లకూ ప్రభుత్వం నిధులను కేటాయించింది.

ఆర్అండ్‌బీ రోడ్లకు నూతన పాలసీ

రోడ్లు, భవనాల శాఖ రోడ్ల కోసం సైతం రూ.5,790 కేటాయించడం గమనార్హం. రాష్ట్రంలో సమగ్ర రహదారుల విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వ భావిస్తున్నది. దీనిలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ నుంచి మండల కేంద్రానికి తారురోడ్డు వేయడం, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు లేన్ల రహదారుల నిర్మాణం, జిల్లా కేంద్రం నుంచి రాజధాని హైదరాబాద్‌ను అనుసంధానించేలా హైవేల నిర్మాణం చేయడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించే పనిలో రోడ్లు, భవనాల శాఖ నిమగ్నమై ఉంది.

సుందరయ్య, ఎన్టీఆర్ హయాంలో శాసనసభకు ఒక విలువ ఉండేది

- ఇప్పుడు దుమ్మెత్తి పోసుకుంటున్నారు.. కౌగిలించుకుంటున్నారు
- సభకు రాని వారి వేతనాలు కట్ చేయాలి
- చివరకు ప్రధాని తప్పు చేసినా తప్పని చెప్పే సంస్కృతి నాది : బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు లాంటి నాయకుల హయాంలో శాసనసభకు ఒక విలువ ఉండేదని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఇప్పుడు అసెంబ్లీ అనేది పేకాట క్లబ్బులాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభా వ్యవహారాల మీద తనకు అవగాహన ఉందని, ఇన్నాళ్లకు అసెంబ్లీకి వచ్చానని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం చేసే దేవాలయానికి(అసెంబ్లీ) వచ్చాననే అభిప్రాయం కలిగిందని, సమస్యల పరిష్కారం కోసం అనుభవజ్ఞులు మాట్లాడతారని అనిపించిందని అన్నారు. కానీ, నెలకు రూ.2.75 లక్షల వేతనం తీసుకునే ప్రజాప్రతినిధులు కొందరు అసలు అసెంబ్లీకి రావడం లేదని, ఉద్యోగులు విధులకు రాకపోతే ఏ విధంగా వేతనం కట్ చేస్తారో.. అసెంబ్లీకి రాని వారి వేతనాలు అలాగే కట్ చేయాలన్నారు. ఇది ప్రజల సొమ్ము అన్నారు. తాను ఏ రోజు రాకున్నా.. అసెంబ్లీకి రిటర్న్ చేస్తా.. ఒకవేళ తీసుకోపోతే అసెంబ్లీ ముందు ప్రజలకు పంచుతానని చెప్పారు. రాజకీయ నాయకులకు ప్రజా సమస్యల పరిష్కారంపై కమిట్‌మెంట్ ఉండాలన్నారు. కానీ, అసెంబ్లీలో ప్రజలకు సంబంధించిన అంశాలను కాకుండా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకుంటూ.. మళ్లీ కౌగిలించుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ గేటు దగ్గర ఉన్న పోలీసులు వాననక, ఎండనక పని చేస్తుంటే వారికి రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, జీవో 317 సమస్య అలాగే ఉందని అన్నారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గడిచిన పదేండ్లలో కేంద్రం ఇప్పటివరకు ఎన్ని నిధులు ఇచ్చిందో గత ప్రభుత్వం చెప్పలేదని, ఇప్పటి ప్రభుత్వం చెప్పదు అన్నారు. ఇవ్వలేదు అని మాత్రమే నింద వేస్తున్నారన్నారు. ఇచ్చిన నిధులు అసంపూర్తిగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ తప్పు చేసినా అది తప్పు అని చెప్పే సంస్కృతి నాది అని అన్నారు.

ప్రగతి పట్టని..లక్ష్యం లేని బడ్జెట్

- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ప్రగతి పట్టలేదనీ, దానికి ఒక లక్ష్యం లేదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బడ్జెట్ నిండా అప్పులే కనిపించాయని ఎత్తిచూపారు. బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగంగా సాగిందని దెప్పిపొడిచారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. 62 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నట్టు బడ్జెట్‌లో చూపెట్టారనీ, అందులో అభివృద్ధికి ఖర్చు చేస్తున్నది కేవలం రూ.33 వేల కోట్లేనని చెప్పారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదన్నారు. పేద మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.4 వేలకు పింఛన్ పెంపు సంగతేంటని నిలదీశారు. ఓట్ ఆన్ అకౌంట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.28 వేల కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో దానికి కోతపెట్టి రూ.22,301 కోట్లకు కుదించడమేంటని ప్రశ్నించారు. వాస్తవిక బడ్జెట్ రూ.2.40 లక్షల కోట్లకు మించదనీ, అంటే ప్రతిపాదించిన దాంట్లో 50 వేల కోట్ల రూపాయలు కోతపెట్టబోతున్నారని వివరించారు. కేటాయింపులు బారెడు ఖర్చు మూరెడు అన్నట్టు బడ్జెట్ ఉందనీ, ఇది బోగస్, అవాస్తవిక, అంకెల గారడీ బడ్జెట్ అని విమర్శించారు.

నేటినుంచి ఇంజినీరింగ్ రెండోవిడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యాసం వత్సరంలో ప్రవేశాల కోసం శుక్రవారం నుంచి రెండో విడత కౌన్సె లింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. శుక్రవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకో వాలని తెలిపారు. ఈనెల 27న ధ్రువపత్రాల పత్రాల పరిశీలన నిర్వహి స్తామని వివరించారు. ఈనెల 27,28 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేం దుకు అవకాశముందని పేర్కొన్నారు. అదేనెల 31న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

చెరువుల రక్షణకు ఏం చర్యలు తీసుకున్నారు?

- హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

పటాన్‌చెరువు సమీపంలోని చిట్కూల్‌లోని పెద్దచెరువులోని భారీ మొత్తంలో చేపలు మృతి చెందిన నేపథ్యంలో అక్కడ శుభ్రతకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వి.శ్రవణ్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత నెలలో భారీ వర్షపు నీరు చెరువులోకి చేరడం వల్ల రెండు రకాల సమస్యలు వచ్చి చేపలు మృతి చెందాయనీ, రసాయన కాలుష్యం వల్ల మృతి చెందలేదని ప్రభుత్వం చెప్పింది. చెరువు వద్ద కలుషిత నీటిని శుద్ధి చేసే యూనిట్‌ను పెడతామని తెలిపింది. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. చెరువులో రెండు సార్లు పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెందాయంటూ పత్రికల్లో వచ్చిన కథనాన్ని సుమోటోగా తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణను అక్టోబరుకు వాయిదా వేసింది.

భారీగా మొక్కలు నాటుతాం

ప్రస్తుత వర్షాకాలంలో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందనీ, ఇందులో లోకల్‌బాడీలను భాగస్వాములను చేస్తున్నట్టు ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు నివేదిక ఇవ్వాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం సర్కారును ఆదేశించింది. జనాభా నిష్పత్తిలో మొక్కలు లేవంటూ కె.ప్రతాప్‌రెడ్డి వేసిన పిల్‌పై తదుపరి విచారణను ఆగస్ట్ 1కి వాయిదా వేసింది.

కాళేశ్వరంతో తెలంగాణను

ధాన్యాగారంగా మార్చాం



- కేసీఆర్‌ను బదనాం చేసేందుకే కాంగ్రెస్ కుట్రలు
- వరదను తట్టుకొని మేడిగడ్డ నిలబడింది
- నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రాజెక్టులను ఎండబెడుతున్నరు
- రాజకీయాలు మాని రైతులను ఆదుకోవాలి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కరీంనగర్ ఎల్ఎండీ పరిశీలన

నవతెలంగాణ - తిమ్మాపూర్

కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను ధాన్యాగారంగా మార్చామని.. వరదను తట్టుకొని మేడిగడ్డ నిలబడిందని, అలాంటి ప్రాజెక్టు నుంచి ఎనిమిది నెలలుగా నీరు లిఫ్ట్ చేయకుండా పంట పొలాలను, ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలించేందుకు వెళ్తూ గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ)ని పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

కాళేశ్వరంలో ఏర్పడిన చిన్న లోపాన్ని సాకుగా చూపి ప్రాజెక్టుకు ఒక విఫలయత్నంగా చూపే ప్రయత్నం చేశారన్నారు. కాళేశ్వరం నుంచి ప్రతిరోజూ లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోతున్నా లిఫ్ట్ చేయడం లేదని వాపోయారు. లోయర్ మానేరు డ్యాం, మిడ్ మానేరు సహా ప్రాజెక్టులు ఎండిపోయాయని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రాజెక్టులతో పాటు మేడిగడ్డను పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. 10లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని మేడిగడ్డ నిలబడిందని చెప్పారు. కానీ, లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను సీఎం రేవంత్‌రెడ్డి పణంగా పెట్టి పంట పొలాలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. 40వేల క్యూసెక్కుల ప్రవాహం దాటితే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చని, ఇప్పుడు అక్కడ పది లక్షల క్యూసెక్కుల నీరు కిందకు పోతోందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలు రాకపోవడం వల్లే నీరు లిఫ్ట్ చేయడం లేదని అధికారులు చెప్తున్నారని అన్నారు. ఎల్ఎండీ, అన్నపూర్ణ రిజర్వాయర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నింపితే రైతుల్లో భరోసా ఏర్పడుతుందన్నారు. నీరు ఉన్నప్పుడు కాళేశ్వరం ద్వారా ప్రాజెక్టులు నింపకుండా రేపు వర్షం పడలేదనే సాకు చూపెడతారని అనిపిస్తోందని, ఇలాంటి ఇబ్బందులు ఉండకుండా రాష్ట్ర ప్రభుత్వానికి కాళేశ్వరం ద్వారా నీరు నింపాలని సూచిస్తున్నామని అన్నారు.

కన్నెపల్లి దగ్గర పంపు ఆన్ చేస్తే రిజర్వాయర్లు అన్నీ నిండుతాయని తెలిపారు. ఎస్సారెస్పీలో 90టీఎంసీలకు కేవలం 24టీఎంసీలు, ఎల్ఎండీ, మిడ్ మానేరులో ఐదు టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపితే రైతుల అవసరాలతో పాటు హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాలు తీరుతాయని తెలిపారు. కేసీఆర్ ను బదనాం చేయాలని ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మేడిగడ్డ మేడిపండు అని, లక్షల కోట్లు కొట్టుకు పోయాయని చేసిన ప్రచారాలన్నీ ఉత్తివేనని తేలాయని అన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎండుతున్న ప్రాజెక్టులు, మండు తున్న రైతుల గుండెల బాధలను శాసనసభలో ఎండగడతామని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆదేశాలతో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచనతో ప్రాజెక్టు సందర్శనకు వచ్చామ న్నారు. రాజకీయాలు వదిలే యండి, ఎన్నికలు అయిపో యాయి.. రైతుల జీవితాలతో చెలగాటమడొద్దని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. శుక్రవారం కన్నెపల్లి, మేడిగడ్డను సందర్శించి, కాళేశ్వరం దర్శనం చేసుకుంటామని, వీలుంటే అన్ని ప్రాజెక్టులూ సందర్శిస్తామని చెప్పారు.

బిజినెస్

ప్రాంతీయ పత్రికల రాబడి పెరగొచ్చు

- 2024-25 రెవెన్యూలో 8-9 శాతం వృద్ధి
- క్రిసిల్ రిపోర్ట్



న్యూఢిల్లీ : కీలక రంగాల నుంచి ప్రకటనలు పెరగడంతో పాటుగా చందాదారుల సంఖ్య మద్దతుతో ప్రాంతీయ పత్రికల రెవెన్యూ పెరగనుందని క్రిసిల్ రేటింగ్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో పత్రికల రెవెన్యూలో 8-9 శాతం వృద్ధి ఉండొచ్చని తెలిపింది. మొత్తం మార్కెట్ సర్క్యులేషన్‌లో 60 శాతం ప్రాతినిధ్యం కలిగిన ఎనిమిది మీడియా సంస్థలను పరిశీలిస్తే తక్కువ న్యూస్‌ప్రింట్ ఖర్చులతో పాటు, ఆదాయాన్ని పెంచే ప్రకటనల్లో డిమాండ్ నెలకొందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక విశ్వాసానికి తోడు కార్పొరేట్లు, ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రకటనల ఆదాయాలు ప్రధానంగా పెరగనున్నాయని తెలిపింది. మార్కెటింగ్‌పై కార్పొరేట్ వ్యయం పెరిగిందని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. ఆటోమొబైల్స్, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్, విద్య, ఇ-కామర్స్, రియల్ ఎస్టేట్ రంగాలు స్థానిక మీడియా సంస్థలకు ప్రధాన రెవెన్యూగా ఉన్నాయని తెలిపింది. డిజిటల్ మీడియాకు ప్రజాదరణ పెరుగుతున్నప్పటికీ ప్రాంతీయ పత్రికలు అందించే స్థిరమైన పఠన అలవాట్లు, స్థానిక కంటెంట్ అంశాలు స్థిరమైన చందాదారుల సంఖ్య పెరుగుదలకు దోహదం చేస్తున్నాయని పేర్కొంది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయంలో 2-4 శాతం పెరుగుదల ఉండొచ్చని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది.

కెనరా బ్యాంక్‌కు రూ.3,905 కోట్ల లాభాలు

బెంగళూరు : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10.5 శాతం వృద్ధితో రూ.3,905 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయాలతో పాటు వడ్డీయేతర ఆదాయాలు, రికవరీలు పెరగడంతో మెరుగైన ఫలితాలు నమోదు చేసినట్లు ఆ బ్యాంక్ తెలిపింది. 2023-24 ఇదే క్యూ4లో రూ.3,539 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.8,666 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) గడిచిన క్యూ4లో 5.77 శాతం పెరిగి రూ.9,166 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం ఏకంగా 10.38 శాతం వృద్ధితో రూ.5,319 కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. 2023 జూన్ ముగింపు నాటికి 1.57 శాతంగా ఉన్న నికర నిరర్థక ఆస్తులు.. 2024 జూన్ నాటికి 1.24 శాతానికి పరిమితమయ్యాయి.

ఐపిఒకు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్

- రూ.600 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ : ఇంజనీరింగ్ పరికరాల తయారీలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ కొత్తగా ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదిత పత్రాలను (డిఆర్‌హెచ్‌పి)ని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)కి సమర్పించినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.10 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయడం ద్వారా రూ.250 కోట్లు, అదే విధంగా 18,444 మిలియన్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్‌లో జారీ చేయడంతో రూ.350 కోట్లు సమీకరించాలని నిర్దేశించుకుంది. ఈ నిధులను మూలధన వ్యయాలు, కొన్ని రుణాలను తిరిగి చెల్లించడానికి, సాధారణ పరిపాలన అవసరాల కోసం ఉపయోగించనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఈ ఇష్యూలో ఎస్2 ప్రమోటర్లు కందుల రామక్రిష్ణ, కందుల క్రిష్ణవేణి, నాగేశ్వర్‌రావు కందుల, కాత్రగట్ట మోహన్ రావు, కాత్రగడ్డ శివప్రసాద్, కుండరవల్లి పున్న రావులు తమ హోల్డింగ్స్‌లో కొంత భాగాన్ని విక్రయించనున్నారు. ఈ కంపెనీ రెవెన్యూ 2022-23లో రూ.497.59 కోట్లుగా ఉండగా.. 2023-24లో రూ.543.67 కోట్లకు పెరిగింది.

ఇంటెగ్రా ఎస్సెన్సియా లాభాలు రెట్టింపు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఇంటెగ్రా ఎస్సెన్సియా 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 107.63 శాతం వృద్ధితో రూ.2.45 కోట్ల నికర లాభాలు సాధించినట్లు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1.18 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.68.1 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.40 శాతం పెరిగి రూ.100.6 కోట్లకు చేరింది. ఇటీవల బ్రెవ్‌టుస్ బేవరేజీస్ ప్రయివేటు లిమిటెడ్ (బిబిపిఎల్)ను స్వాధీనం చేసుకున్న సంస్థలో రూ.10 కోట్ల పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు పేర్కొంది.

పిసి జ్యువెలర్స్ ఒటిఎస్‌కు బిఒబి ఆమోదం

హైదరాబాద్ : ప్రముఖ ఆభరణాల రిటైల్ చెయిన్ పిసి జ్యువెలర్స్ సమర్పించిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఒటిఎస్) ప్రతిపాదనకు బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) తన ఆమోదాన్ని తెలిపిందని ప్రకటించింది. కంపెనీ బకాయిలు చెల్లించడానికి ఒటిఎస్‌ను ఎంచుకున్నట్లు స్పష్టం చేసింది. ఒటిఎస్ నిబంధనలు, షరతులు సెటిల్‌మెంట్ కింద చెల్లించవలసిన నగదు, ఈక్విటీ భాగాలకు అంగీకరించినట్లు పేర్కొంది. 14 బ్యాంక్‌ల నుంచి అప్పులు పొందిన పిసి జ్యువెలర్స్ ఆరు బ్యాంక్‌లో వన్ టైం సెటిల్‌మెంట్‌కు ఒప్పందాలు కుదర్చుకుంది.

మార్కెట్లకు ఐదో రోజూ నష్టాలు

ముంబయి : అమ్మకాల ఒత్తిడితో వరుసగా ఐదో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. మూలధన లాభాలపై బడ్జెట్‌లో పన్ను ప్రతిపాదించడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో గురువారం కూడా సూచీలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 109 పాయింట్ల నష్టంతో 80,039కు దిగజారింది. నిఫ్టీ 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, ఎల్అండ్‌టి, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అధికంగా లాభపడగా.. యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, టైటాన్, ఐసిఐసిఐ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి.

నేటినుంచి పాలిసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 27న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల 27,28 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 31న ప్రత్యేక విడత పాలిసెట్ ప్రవేశాలకు సీట్లను కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

అందర్నీ అలరించే ఆపరేషన్ రావణ్


తిరువీర్, రక్షిత్ అట్లూరి, మారుతి, వెంకట సత్య

'పలాస, నరకాసుర' వంటి చిత్రాలతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటించిన కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ సినిమాలో రాధిక శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ బాషల్లో తెరకెక్కించారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ నేపథ్యంలో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను దర్శకుడు మారుతి అతిథిగా ఘనంగా నిర్వహించారు.

నేను ఆరు నెలల కిందట ఈ సినిమా చూశాను. చాలా బాగుంది. వాళ్ల అబ్బాయిని హీరోగా పెట్టి వెంకట సత్య థ్రిల్లర్ సినిమాను రూపొందించడం మామూలు విషయం కాదు. 'లండన్ బాబులు' మూవీతో మెల్లిగా మొదలైన రక్షిత్ జర్నీ 'పలాస'తో పీక్స్‌కు వెళ్లింది. ఈ సినిమాతో రక్షిత్ మరింత మంచి పేరు తెచ్చుకోవాలి. ఈ మాస్క్ మ్యాన్ ఎవరు అనే క్యూరియాసిటీని బాగా హైప్ చేయటం విశేషం. ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది.

- దర్శకుడు మారుతి

దర్శకుడు వెంకట సత్య మాట్లాడుతూ, 'నేను, మా రక్షిత్ మూవీ కెరీర్‌లోకి రావడానికి మారుతి కారణం. మీ ఆలోచనలే మీ శత్రువులు, సైకో థ్రిల్లర్ అనే ట్యాగ్‌లైన్స్‌తో ప్రమోషన్ చేస్తున్నాం గానీ మా సినిమాలో మంచి లవ్‌స్టోరీ ఉంటుంది. ప్రేమ సెన్సిబిలిటీస్ ఎలా ఉంటాయో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ప్రేమ ఇవ్వడం అనేది ఒకరకంగా ఉంటుంది. ప్రేమ అంతా నాకే కావాలని అనుకున్నప్పుడు మరో రకంగా ఉంటుంది. ఎంత డీప్ ప్రేమ, ఎంత వయలెంట్‌గా మారింది అనేది ఈ సినిమాలో తెరకెక్కించాం' అని తెలిపారు.

'ఈ సినిమాను మా నాన్న ఎంతో బాగా డైరెక్ట్ చేశారు. ఆయన ఫస్ట్ టైమ్ డైరెక్టర్ అని సినిమా చూశాక ఎవరూ అనుకోరు. అంత బాగుంటుంది. నా ఫ్రెండ్ తిరువీర్. మేము కలిసి పలాసలో చేశాం. రాధిక పర్ఫార్మెన్స్ చూస్తే మీరు ఎంతో ఎమోషనల్ అవుతారు. మాస్క్ మ్యాన్ ఎవరో కనిపెట్టి మాకు చెబితే, సిల్వర్ కాయిన్ ఇస్తామని చెప్పాం. సినిమాకు మంచి హైప్ ఏర్పడింది. తప్పకుండా థియేటర్స్‌లోనే మా సినిమాని చూడండి. థ్రిల్ ఫీలవుతారు' అని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు.

రెండు ప్రేమ కథలు ఒకేలా ఉండవు

హీరో నారా రోహిత్ ప్రస్తుతం వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తన ల్యాండ్‌మార్క్ 20వ చిత్రం 'సుందరకాండ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి ఈ ఫన్ ఫిల్డ్ రోమ్-కామ్‌ను నిర్మిస్తున్నారు.

నారా రోహిత్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో నారా రోహిత్ ఇన్నోసెంట్ లుక్స్‌లో కూల్ డ్రెస్‌లో క్లాసీ, ఛార్మింగ్‌గా కనిపించారు. బ్యాక్ గ్రౌండ్ చాలా బ్యూటీఫుల్‌గా కనిపిస్తోంది. 'నో టు లవ్ స్టోరీ ఆర్ నాట్ సేమ్' అని పోస్టర్ పై ఉంది. సుందరకాండలో ప్రేమకథ చాలా కొత్తగా ఉంటుందని పోస్టర్ ద్వారా రివీల్ చేసినట్లుగా ఈ చిత్ర టీజర్‌ను త్వరలో విడుదల చేయనున్నారు.


నారా రోహిత్

నారా రోహిత్ సరసన విర్తి వాఘని హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్‌కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సత్య, అజయ్, గణేష్, అభినవ్ గోమఠం, విశ్వంత్, రూపా లక్ష్మి, సునైనా, రఘుబాబు తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన - దర్శకత్వం: వెంకటేష్ నిమ్మలపూడి, నిర్మాతలు: సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి, డీవోపీ: ప్రదీష్ ఎం వర్మ, సంగీత దర్శకుడు: లియోన్ జేమ్స్, ఎడిటర్: రోహన్ చిల్లాలే, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సందీప్, ఆర్ట్ డైరెక్టర్: రాజేష్ పెంటకోట, లిరిక్స్: శ్రీ హర్ష ఈమని, యాక్షన్ కొరియోగ్రఫీ: పృథ్వీ మాస్టర్.


అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్

ఆ ఇంట్లోకి వెళ్తే..?

బ్లాక్ బస్టర్ హర్రర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా రూపొందిన సినిమా 'డీమాంటీ కాలనీ 2'. ఈ సినిమాలో అరుల్ నిధి, ప్రియ భవానీ శంకర్ జంటగా నటిస్తున్నారు.

అన్తి జాస్కెలైనెన్, సెరింగ్ డోర్జీ, అరుణ్ పాండియన్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రాజ్‌వర్మ ఎంటర్‌టైన్మెంట్, శ్రీ బాలాజీ ఫిలింస్ సంయుక్తంగా తెలుగులో విడుదల చేస్తున్నాయి. దర్శకుడు అజయ్ ఆర్ జ్ఞానముత్తు రూపొందించిన ఈ సినిమా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ట్రైలర్ ఇంట్రెస్టింగ్‌గా ఉందన్న ఆర్జీవీ చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగు తుంటాయి. ఆ ఇంట్లో నుంచి బయటకు వచ్చిన చైన్ తిరిగి ఆ ఇంటికే ఎలాగోలా చేరుతుంటుంది. ఈ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఓ సందర్భంలో ప్రధాన పాత్రధారులంతా ఆ ఇంట్లోకి వెళ్తారు. వారికి అక్కడ నమ్మలేని, భయంకర ఘటనలు ఎదురవుతాయి. డీమాంటీ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి?, దాని నుంచి ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు అనేది ట్రైలర్‌లో గూస్ బంప్స్ తెప్పించేలా చూపించారు దర్శకుడు అజయ్ ఆర్ జ్ఞానముత్తు. అన్తి జాస్కెలైనెన్, సెరింగ్ డోర్జీ, అరుణ్ పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవింద్ రాజన్, సర్జనో ఖాలిద్, అర్చన రవిచంద్రన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ - సామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ - హరీశ్ కన్నన్, ఎడిటర్ - కుమరేష్.డి, ప్రొడ్యూసర్స్ - విజయసుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్, కో ప్రొడ్యూసర్స్ - బి సురేష్ రెడ్డి, బి.మానస రెడ్డి.

నగల దొంగ..

తెలుగు తెరపైకి మరో సస్పెన్స్ థ్రిల్లర్ రాబోతోంది. కృష్ణసాయి - మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'జ్యువెల్ థీఫ్'. ఈ సినిమా టీజర్, ఆడియో లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీ విష్ణు గ్లోబల్ మీడియా బ్యానర్‌పై, పీఎస్ నారాయణ దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రేమ, అజయ్, 30 ఇయర్స్ పృథ్వీ, శివారెడ్డి, శ్రావణి, శ్వేతరెడ్డి తదితరులు నటించారు.


కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్

ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ సినిమా టీజర్, ఆడియో లాంచ్ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డీఐజీ అనిల్ మింజ్, ఏపీ, తెలంగాణ ఇన్‌కమ్‌టాక్స్ కమీషనర్ జీవన్ లాల్ లవిడియ, నటీ ఎస్తర్ చిత్ర టీజర్‌తో పాటు పాటలను విడుదల చేశారు.

ఈ సందర్భంగా నటి ఎస్తార్ మాట్లాడుతూ, 'హీరో కృష్ణసాయి నిజ జీవితంలోనూ రియల్ హీరో. ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇలాంటి వారు అరుదుగా ఉంటారు. టీజర్ చూస్తే.. 'జ్యువెల్ థీఫ్' మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కినట్టు అర్థమవుతోంది. సినిమా పెద్ద హిట్ అవుతుందని నమ్మకం కలుగుతుంది' అని అన్నారు.


హీరో కృష్ణ సాయి మాట్లాడుతూ, 'నేను సూపర్ స్టార్ కృష్ణ అభిమానిని. ఆయన స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చాను. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. ఈ తరం ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. ఇక ఎంఎం శ్రీలేఖ అందించిన మ్యూజిక్ బాగుంది. ఒకప్పుడు హీరోయిన్ ప్రేమ సినిమాలు చూశాను. ఆమెతో కలిసి నటించాలన్న నా కల ఈ సినిమాతో నెరవేరింది' అని తెలిపారు.

డైరెక్టర్ పీఎస్ నారాయణ మాట్లాడుతూ,'నా మీద నమ్మకంతో తనతో సినిమా చేయమని కృష్ణసాయి వచ్చారు. ఆయనకు తగ్గ కథను పది రోజుల్లోనే పూర్తి చేశాను. నటీనటులు, టెక్నీషియన్స్ అందరు బాగా చేశారు. ఇది చిన్న సినిమా కాదు, సీనియర్ నటీనటులు ఉన్నారు. అందరిని ఆకట్టుకునే సినిమా ఇది' అని చెప్పారు.

హీరోయిన్ మీనాక్షి జైస్వాల్ మాట్లాడుతూ,'ఈ సినిమాలో నాది ఛాలెంజింగ్ రోల్. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకు దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు' అని అన్నారు. నటి ప్రేమ మాట్లాడుతూ,'నాకు ఈ సినిమాలో మంచి క్యారెక్టర్ ఇచ్చారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ అందరిని ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను. కృష్ణసాయి లాంటి వాళ్ళు చాలా అరుదుగా ఉంటారు' అని తెలిపారు.

నవచిత్రం

మాస్ బీట్‌తో రెప్పల్ డప్పుల్..


రవితేజ, భాగ్యశ్రీ బోర్సే

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మిస్టర్ బచ్చన్' మ్యూజిక్ ప్రమోషన్లు బాగా జోరందుకున్నాయి. ఫస్ట్ సింగిల్ 'సితార్..' అద్భుతమైన రెస్పాన్స్‌తో చార్ట్ బస్టర్ అయ్యింది. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్ 'రెప్పల్ డప్పుల్..'ను గురువారం విడుదల చేశారు. ఇది ఫస్ట్ సింగిల్‌కి చాలా డిఫరెంట్‌గా ఉంది.

హైలీ ఎనర్జిటిక్ బీట్‌లతో కూడిన కంప్లీట్ మాస్ నెంబర్ ఇది. మ్యూజిక్ కంపోజిషన్, ట్యూన్‌లో ఈ మాస్ నెంబర్‌ను మ్యాసీ బ్లాక్‌బస్టర్‌గా మార్చేలా కంపోజ్ చేశారు మిక్కీ జె మేయర్. ఆర్కెస్ట్రేషన్ అద్భుతంగా ఉంది. సింగర్స్ అనురాగ్ కులకర్ణి, మంగ్లీ తమ స్పెషల్ వోకల్స్‌తో ఎక్స్‌ట్రార్డినరీగా పాడారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ ఈ ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ నెంబర్ బీట్‌లను పెర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేశాయి. ఇది ప్రతి మాస్ పార్టీ ప్లే లిస్ట్‌లో ఉండబోతోంది. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే డ్యాన్స్ ఫ్లోర్‌ని ఆదరగొట్టారు. ఈ మాస్ బ్లాక్‌బస్టర్‌కు భాను మాస్టర్ అద్భుతంగా కొరియోగ్రఫీ చేశారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ సినిమా ఆగస్ట్ 15న విడుదల కానుంది.

అదే జామ్ జంక్షన్ ప్రత్యేకత



'జామ్ జంక్షన్ మ్యూజిక్ కాన్సెప్ట్ నాకు చాలా నచ్చింది. కొత్తగా అనిపించింది. ఇలాంటి కాన్సెప్ట్ ఎక్కడా జరగలేదు. దీన్ని చాలా అద్భుతంగా చేయాలనిపించింది. చాలా మంది ట్యాలెంట్ ఉన్న వాళ్ళని ఒక ప్లాట్ ఫామ్ మీద చూడబోతున్నాం. సిక్స్ బ్యాండ్స్ వన్ బై వన్ పెర్ఫార్మ్ చేస్తుంటే చూడటం మామూలు ఎగ్జైట్‌మెంట్ ఉండదు' అని డైరెక్టర్ మారుతి అన్నారు.

డైరెక్టర్ మారుతి ప్రజెంట్స్ బిగ్గెస్ట్ మ్యూజికల్ ఈవెంట్ జామ్‌జంక్షన్ షో సెప్టెంబర్ 6న హైటెక్స్ గ్రౌండ్స్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో తాజాగా కర్టెన్‌రైజర్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది.

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ, 'నేను బ్యాండ్ నుంచే వచ్చాను. బ్యాండ్ ఎమోషన్ నాకు తెలుసు. జామ్ జంక్షన్‌లో పార్ట్ అవ్వడం ఆనందంగా ఉంది. ఆరు బ్యాండ్స్‌తో మొదలయ్యే ఈ వేదిక త్వరలోనే 60కి చేరుతుందని భావిస్తున్నాను' అని తెలిపారు. 'మంచి ప్రయత్నం చేస్తున్న టీంలో అందరికీ ఆల్ ది బెస్ట్. ఇందులో విన్నర్‌కి నా బ్యానర్‌లో మ్యూజిక్ చేసే అవకాశం ఇస్తాను' అని నిర్మాత ఎస్కేఎన్ చెప్పారు.

శ్రీ ఈవెంట్స్ కంపెనీ ఫౌండర్, సీఈవో శ్రీ మాట్లాడుతూ, 'జామ్ జంక్షన్ కాన్సెప్ట్ చాలా యూనిక్‌గా ఉంది. ఇందులో సిక్స్ డిఫరెంట్ స్టేజస్ ఉంటాయి. సెవెన్ రౌండ్స్ ఉంటాయి. మొదటి నాలుగు రౌండ్స్‌లో వోన్ కంపోజిషన్, ఐదో రౌండ్ టాలీవుడ్, ఆరు ఇన్‌స్ట్రుమెంటల్, లాస్ట్ ఫ్యూజన్ సాంగ్స్. ఆరు బ్యాండ్స్ వన్ బై వన్ ప్లే చేస్తుంటారు. లాస్ట్ వన్ అవర్ తెలుగు డీజే ఉంటుంది. మ్యూజిక్ లవర్స్‌కి చాలా మంచి యాంబియన్స్‌లో గ్రేట్ సౌండ్ అండ్ లైట్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే బిగ్గెస్ట్ షో ఇది' అని అన్నారు.


సంజయ్ శ్రీ రాజ్, ప్రియ శ్రీనివాస్

భిన్న కథతో గల్లీ గ్యాంగ్ స్టార్స్

సంజయ్ శ్రీ రాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్ మహాన్, రితిక ప్రధాన పాత్రలలో తెరకెక్కించిన చిత్రం 'గల్లీ గ్యాంగ్ స్టార్స్'. ఈ సినిమాని డా.ఆరవేటి యశోవర్ధాన్ ఏ బి డి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ సినిమా నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సందర్భంగా దర్శకుడు ధర్మ మాట్లాడుతూ, "గల్లీ గ్యాంగ్ స్టార్స్ అనేది సినిమా కాదు నిజ జీవితంలో ఎందరో అనాథలు ఎదుర్కొనే రోజువారి సంఘటనలు. అనాథల బాధ్యత సమాజం తీసుకోకపోతే ఆ సమాజం ఎన్ని దారుణాలు ఎదుర్కోవాల్సి వస్తుందో వాస్తవికంగా తెరకెక్కించాం. సినిమా షూటింగ్ అంతా నెల్లూరులో 76 రోజుల పాటు చేశాం. ఎన్నోసార్లు అనుకున్న బడ్జెట్ దాటిపోయి షూటింగ్ ఆగిపోయింది. అనుకున్న ప్రతిసారి ప్రొడ్యూసర్ యశోవర్ధన్ ధైర్యంగా అడుగు ముందుకు వెయ్యటం వల్లనే ఈ సినిమా ఈరోజు రిలీజ్ కాబోతుంది. ఈ బ్యానర్‌లో ఆయన నూతన దర్శకులకు అవకాశం ఇస్తూ, మూడు సినిమాలను వరసగా నిర్మించారు. దానిలో మొదటి సినిమా ప్రయోగాత్మకమైన చిత్రం 'మే16'. ఇది ఒక మోనో డ్రామా. ఆ తర్వాత చిత్రం నెల్లూరు గల్లిలో జరిగే మాస్ డ్రామా సినిమా 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' . ఇదే బ్యానర్‌లో వస్తున్న మరో సినిమా ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది' అని తెలిపారు.



వైభవంగా రేవు ఆడియో ఆవిష్కరణ వేడుక

వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రేవు'.

ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్, పారుపల్లి ప్రొడక్షన్ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నిర్మాణ సూపర్ విజన్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, ఆగస్టు రెండో వారంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో గీత రచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్ తేజ, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ అతిథులుగా ఈ చిత్ర ఆడియో రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

గీత రచయిత చంద్రబోస్ మాట్లడుతూ, 'ఈ సినిమాకు పాటలు రాసిన ఇమ్రాన్ శాస్త్రి పేరు ఎంత వైవిధ్యంగా ఉందో, అతను రాసిన పాటలు అంతే వైవిధ్యంగా ఉన్నాయి. అన్ని ఎమోషన్స్‌తో పాటలు రాశారు. సంగీతం బాగుంది. ఈ సినిమాలో నవ్యత, నాణ్యత రెండూ కనిపించాయి' అని అన్నారు.

'ఈ సినిమాలోని పాటల విన్నాక ఒక ఉద్విగ్నతకు లోనయ్యాను. అంత బాగున్నాయి' అని మరో గీత రచయిత రామజోగయ్య శాస్త్రి చెప్పారు.

గీత రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ, 'గీత రచయితగా ఇమ్రాన్ శాస్త్రి నాలాగే మొదటి సినిమాకే సింగిల్ కార్డ్ రాసే అవకాశం దక్కించుకున్నారు. జాన్ సంగీతం బాగుంది. ఈ సినిమా ఘన విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నా' అని తెలిపారు.

గీత రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ, 'రేవు సినిమా కార్యక్రమం చూస్తుంటే కొత్త నెత్తుటి సముద్రం చూస్తున్నట్లు ఉంది. నేను తీరప్రాంతంలో పుట్టలేదు కానీ తీరప్రాంత ప్రజల గురించి తెలుసు. వారి జీవన విధానం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమా వేదిక మీద అక్షరాలన్నీ కలిపినట్లు ఉంది' అని అన్నారు.

'ఈ సినిమా పెద్ద కమర్షియల్ హంగులు ఉన్న మూవీ కాదు. ఇదొక జీవన పోరాటం. మత్స్యకారుల జీవితాలను తెరపై చూపిస్తుంది' అని నిర్మాణ పర్యవేక్షకులు ప్రభు చెప్పారు. గీత రచయిత కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా లిరిసిస్ట్ ఇమ్రాన్ శాస్త్రి, మ్యూజిక్ చేసిన జాన్...ఈ ఇద్దరిలో అన్ని మతాలు ఉన్నాయి. అందుకే అన్ని వర్గాల వారికీ నచ్చేలా పాటలు రూపొందించారు' అని తెలిపారు. 'ఈ వేదిక మీద ఆస్కార్ నుంచి అన్ని ప్రతిష్టాత్మక అవార్డులు ఉన్నట్లు భావిస్తున్నా' అని చిత్ర గీత రచయిత ఇమ్రాన్ శాస్త్రి చెప్పారు.

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ, 'రేవు సినిమాకు మా మిత్రులు మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నా మీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఈ సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్తున్నాం. ఈ మూవీ మంచి సక్సెస్ కావాలని, ఈ బ్యానర్‌లో మరిన్ని ప్రాజెక్ట్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

'మత్స్య కారుల జీవితాలను ప్రతిబింబించేలా రూపొందించాను. ఈ సినిమాలో స్టార్ కాస్ట్ ఎవరూ లేరు' అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు.

సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్.. సింబా



అనసూయ, జగపతి బాబు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. సంపత్ నంది టీం వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్ల పై సంపత్ నంది, దాసరి రాజేందర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంపత్ నంది అందించిన ఈ కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు.

అనసూయ మాట్లాడుతూ, 'వృక్షో రక్షతి రక్షితః అనే కాన్సెప్ట్ అందరికీ తెలిసిందే. ప్రస్తుతం పర్యావరణాన్ని మనం ఎలా పాడు చేస్తున్నామో.. దానికి ఎలాంటి పర్యవసనాలను చూస్తున్నామో అందరికీ తెలిసిందే. సింబా' చాలా మంచి కాన్సెప్ట్‌తో రాబోతోంది. సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్‌గా అందర్నీ అలరిస్తుంది. జగపతి బాబు ఈ చిత్రానికి ప్రధాన బలం. ఈ సినిమా ఒక్కరికి నచ్చినా, ఒక్కరిలోనూ మార్పు తెచ్చినా ఎంతో మార్పు వస్తుంది' అని అన్నారు. 'అందరూ అద్భుతమైన అవుట్ పుట్ ఇచ్చారు. మా సినిమా ఆగస్ట్ 9న రాబోతోంది. ఇది సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్. ఇంత వరకు ఇండియన్ స్క్రీన్ మీద ఇలాంటి కాన్సెప్ట్ రాలేదు. అందరికీ ఈ సినిమా నచ్చుతుందని భావిస్తున్నాను' అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. నిర్మాత దాసరి రాజేం దర్ రెడ్డి మాట్లాడుతూ, 'సంపత్ నంది చెప్పిన పాయింట్ నాకు చాలా నచ్చింది. కృష్ణ సౌరభ్ ప్రాణం పెట్టి మ్యూజిక్ ఇచ్చారు. మురళీ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. మా సినిమాకు కథే హీరో. ప్రతీ కారెక్టర్ హీరోలానే ఉంటుంది. ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ముందు తరాల గురించి ఆలోచించండి అని చెప్పే సినిమా ఇది. ఈ సినిమా అందర్నీ తప్పకుండా అలరిస్తుంది' అని అన్నారు.

పవర్‌ఫుల్ కంటెంట్‌తో విరాజి

మహా మూవీస్, ఎమ్ 3 మీడియా పతాకంపై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం 'విరాజీ'. ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.


మహేంద్ర నాథ్

- మా సంస్థలో నిర్మించిన రెండో చిత్ర మిది. వరలక్ష్మి శరత్ కుమార్‌తో 'శబరి' సినిమా చేశాం. దీన్ని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేశాం. ఇప్పుడు వరుణ్ సందేశ్ హీరోగా 'విరాజీ' నిర్మించాం. టైటిల్ అనౌన్స్‌మెంట్ నుంచి ఈ సినిమాకి మంచి రెస్పాన్స్ వచ్చింది. వరుణ్ సందేశ్ లుక్‌తో పాటు ట్రైలర్‌కు ప్రేక్షకుల ఆదరణ దక్కింది.
- మా స్నేహితుడు సుకుమార్ ద్వారా దర్శకుడు ఆద్యంత్ హర్ష పరిచయం అయ్యారు. ఆయన కథ చెప్పిన విధానం నన్ను ఆకట్టుకుంది. చెప్పడమే కాదు సెట్ లో కూడా అంతే బాగా తెరకెక్కించాడు.
- వరుణ్ సందేశ్ గత సినిమా 'నింద' మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. అది మా సినిమాకు అడ్వాంటేజ్ అవుతుందని భావిస్తున్నాం. ఇందులో వరుణ్ గెటప్ కూడా కొత్తగా ఉంటుంది. అలా ఎందుకు ఉంది అనేది థియేటర్‌లో చూడాలి. మన సొసైటీలో ఉన్న ఒక అంశాన్ని తీసుకుని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను నిర్మించాం. ఆగస్టు 2 రిలీజ్ అని అనౌన్స్ చేశాం. ఇంతలో కొన్ని సినిమాలు ఆగస్టు 2న రిలీజ్ అని ప్రకటించాయి. మన సినిమాలో కంటెంట్ ఉంటే తప్పకుండా ఆదరణ పొందుతుంది అని మేము బిలీవ్ చేస్తున్నాం. అందుకే మా డేట్‌ను పోస్ట్ పోన్ చేయలేదు.
- మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లకి సినిమా నచ్చి, నైజాంలో రిలీజ్ చేస్తున్నారు. సెన్సార్ సభ్యులు కూడా మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. మా సంస్థలో ప్రస్తుతం బిగ్ బాస్ అమర్ దీప్, సురేఖవాణి కూతురు సుప్రీత జంటగా ఓ మంచి లవ్, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చేస్తున్నాం.

ఏమైందో మనసే..


పవన్ కుమార్, సాహిబా భాసిన్

'మెరిసే మెరిసే' సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేసిన పవన్ కుమార్ కొత్తూరి సక్సెస్ అందుకున్నారు. ఆయన తన రెండో సినిమా 'యావరేజ్ స్టూడెంట్ నాని'తో హీరోగా కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

శ్రీ నీలకంఠ మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఆగస్ట్ 2న విడుదల కాబోతోంది. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్లోకి రానుంది.

ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. గతంలో విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్, మోషన్ పోస్టర్, ఫస్ట్‌లుక్ పోస్టర్, ఫస్ట్ సింగిల్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్‌లోనే తన ఎక్స్‌ప్రెషన్స్, పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు పవన్ కుమార్. గురువారం ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'ఏమైందో మనసే'ను మేకర్స్ రిలీజ్ చేశారు. పూర్తి రొమాంటిక్ మోడ్‌లో సాగే ఈ మెలోడీ పాటకు కార్తీక్ బి కొడకండ్ల మంచి బాణీని అందించారు. శక్తి శ్రీ గోపాలన్ గానం వినసొంపుగా ఉంది. కృష్ణవేణి మల్లవజ్జల సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. ఈ పాటలో పవన్, సాహిబా భాసిన్ స్టీమీ కెమిస్ట్రీ అదిరిపోయింది అని చిత్ర యూనిట్ తెలిపింది. పవన్ కుమార్ కొత్తూరి, స్నేహ మాల్వియ, సాహిబా భాసిన్, వివియా సంత్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, ఖలేజా గిరి, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డిఓపం : సజీష్ రాజేంద్రన్, ఎడిటర్: ఉద్ధవ్, కొరియోగ్రఫీ: రాజ్ పైడి మాస్టర్, ఫైట్స్: నందు.